ధరణి - నవలిక
ఇంకో ఐదు కథలు



ఆచార్య మర్రెబోయిన జయదేవ్
డి.లిట్.

ధరణి – నవలిక
ఇంకో ఐదు కథలు

ఆచార్య మర్రెబోయిన జయదేవ్
ఎం.ఏ., పిహెచ్.డి.,డి.లిట్.

విశ్రాంతాచార్యులు
తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్నం

ధరణి - నవలిక, ఇంకో ఐదు కథలు

రచన, ప్రచురణ - ఆచార్య మర్రిబోయిన జయదేవ్
Darani Navalika - Inko Idu Kathalu
Written& Published
by
Prof. M. Jaya dev

ప్రథమ ముద్రణ : డిసెంబర్, 2023

ప్రతులకు :
ఆచార్య ఎం. జయదేవ్
ఫ్లాట్ నెంబర్- 402, దేవాస్ ఈస్ట్ వెస్ట్ రెసిడెన్సీ
ప్రభుపాద టౌన్షిప్, మసీద్ బండ,
కొండాపూర్, హైదరాబాదు- 500084, సెల్ నెంబర్-9290102364

నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాదు
తెలుగు బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాదు.

వెల : రూ. 150/-

పేజ్ లే అవుట్
అంకుష్ గ్రాఫిక్స్, నల్లకుంట,
హైదరాబాదు, సెల్ : 9912929078

ముఖచిత్రం
కూర్మా విశ్వకళ్యాణ్ , విశాఖపట్నం, సెల్. 9030803525

అంకితం



గురువర్యులు ఆచార్య కొర్లపాటి శ్రీరామ మూర్తి,

వారి సతీమణి వెంకట రమణ గార్ల

దివ్యస్మృతికి

విషయ సూచిక

నా మాట

ఈ నవలా కథను నేను మొదట సంతానం అనే పేరుతో కథగా రాసి అనుభవాల కథలు అనే నా పుస్తకంలో ప్రచురించాను. ఈ పుస్తకానికి అభిప్రాయం రాసిన హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు సంతానం కథ చాలా బాగుందని, అందులో చాలా మలుపులున్నాయని, నవలకు కావలసిన కాన్వాస్ అందులో ఉందని ఆకథను నవలగా రాసే ప్రయత్నం చేయమని చెప్పారు. ఆ ప్రయత్న ఫలితమే ఈ నవల. నేను ఈ నవలను రాయడానికి అవసరమైన మంచి సలహా ఇచ్చినందుకు ఆచార్య దార్ల గారికి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

"గుణయుతునకు మేలు గోరంత చేసినా

కొండ యగును వాని గుణము చేత

కొండ యంత మేలు గుణహీను డెరుగనా"

అని వేమన గుణవంతునికి గుణహీనునికి మధ్య వున్న తేడాను చాలా చక్కగా చెప్పాడు. ఈనవలలో గుణ హీనులెవరూ లేరు. అందరూ గుణవంతులే. వేమన చెప్పినట్లుగా గుణవంతులకున్న కృతజ్ఞతా లక్షణం ఈ

నవలలోని పాత్రల్లో బాగా కనిపిస్తుంది. సాధారణంగా నవలలో మంచి పాత్రలు చెడ్డ పాత్రలు వుంటాయి. ఈ రెండు రకాల పాత్రల మధ్య సంఘర్షణ ఉంటుంది. ఈ సంఘర్షణను శక్తి వంతంగా చిత్రించడం లో నవలా కర్త గొప్పతనం, పాత్రచిత్రణ ఆధారపడి వుంటుంది. కానీ ఈ నవలలో అన్నీ మంచి పాత్రలే ఉన్నాయి. మంచి పాత్రల మధ్య సంఘర్షణ ఈ నవలలో ముఖ్యమైనది. సంఘర్షణ ప్రధానంగా ఉన్నప్పుడు కథ పాత్రల సంభాషణ ద్వారా జరుగుతుంది. ఈ నవలలోని కథ కూడా ఎక్కువగా సంభాషణా త్మకంగా సాగింది.

రెండు కుటుంబాలు అద్దె ఇళ్ళలో పక్క పక్కన నివసిస్తున్నప్పుడు కొంత మంది మధ్య తగాదాలు గొడవలు జరుగుతూ ఉంటాయి. కొంత మంది విషయంలో గొడవలు జరగకపోయినా ఏదో మామూలు పరిచయస్తుల లాగా ఉంటారు. ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతే వారి మధ్య పెద్దగా సంబంధాలుండవు. చాలా తక్కువ మంది విషయంలో మాత్రమే రెండు కుటుంబాల మధ్య విడదీయరాని అనుబంధం ఏర్పడుతుంది. దానికి ప్రధాన కారణం ఆ రెండు కుటుంబాల్లోని వాళ్ళు ఒకే రకమైన మనస్తత్వం కలిగి ఉండడమే కాకుండా చాలా మంచి వాళ్ళు కావడమే. ఈ నవలలో పక్కపక్కన అద్దె ఇళ్ళలో నివసిస్తున్న ధరణి పాండురంగరాజులు, కమల సత్యప్రసాదులు అనే రెండు జంటల మధ్య ఉన్న అభిమానం, ఆప్యాయత, స్నేహబంధం - దాన్ని జీవితాంతం కొనసాగించడం ప్రధానమైన అంశం. ఈ రెండు జంటల్లో మొదటి జంట యొక్క కూతురు, రెండవ జంట కొడుకు పాత్రలుగా ఉన్నారు. కూతురు పుట్టుక ఇందులో ప్రత్యేకమైన సంఘటన. ఈమె పుట్టుక భారత కథను గుర్తుకు తెస్తుంది. కాలక్రమంలో ఒక జంట వేరే ఊరికి వెళ్లిపోవడం, వెళ్లి పోయినప్పటికీ వాళ్ళ మధ్య స్నేహబంధం అలాగే కొనసాగడం, ఒక జంటలో భర్త చనిపోవడం, మరొక జంటలో భార్య చనిపోవడం, చివరికి చనిపోయిన భర్త భార్య, మరొక జంటలో చనిపోయిన భార్య భర్త, జంటగా ఏకం కావడం ఇందులోని ప్రధానమైన కథ.

ఈనవలలో ప్రధాన పాత్ర ధరణి. కథ అంతా ఆమె చుట్టూ తిరుగుతుంది. మొదటి నుంచి చివరి వరకు ఆ పాత్ర ప్రధానంగా ఉంటుంది. అందువల్లనే ఈ నవలకు ఆమె పేరుతో ధరణి అని పేరు పెట్టాను. నవలా

రచనలో ఇది నా మొదటి ప్రయత్నం. ఇందులో ఎంత వరకు కృతకృత్యు డనయ్యానో పాఠక లోకం నిర్ణయించాలి.

ఈ పుస్తకంలో తాగుబోతులు, దొంగ, తాతమ్మ చదవు, ఆటో పార్వతి, అతిగారాబం అనే ఐదు కథలు ఉన్నాయి. తాగుబోతుల కథలో ఇద్దరు తాగుబోతుల మధ్య పేకాట సమయంలో ఏర్పడిన గొడవ వల్ల ఒకడు ఇంకొకన్ని అవమానిస్తాడు. అవమానానికి గురి అయినవాడు రహస్యంగా ప్రతీకారం తీర్చుకుంటాడు. దొంగ కథలో జేబుదొంగ మంచి మనసు కనిపిస్తుంది. తాతమ్మ చదువులో 80 ఏళ్లు దగ్గరగా ఉన్న ముసలి స్త్రీ చదువురానిదని ముని ముని మనుమల చేత హేళనకు గురి అయి పట్టుబట్టి బడికి వెళ్లి చదువుకుంటుంది. ఆటోపార్వతిలో ఒక యువతి పురుషులు మాత్రమే ఉన్న ఆటో రంగంలో అడుగు పెట్టి మంచి ఆటో డ్రైవర్‌గా స్వతంత్రంగా జీవిస్తుంది. అతి గారాబం కథలో లేక లేక కలిగిన కుమారున్ని అతి గారాబంగా పెంచితే కలిగే పరిణామాలు ఉన్నాయి.

ఇవన్నీ అనుభవాల కథలు. ఇందులో కొన్ని నా అనుభవాలు, మరికొన్ని నేను తెలుసుకున్న ఇతరుల అనుభవాలు. అనుభవాలను ఉన్నది ఉన్నట్టుగా చెబితే అది సాహిత్యం అనిపించుకోదు. వాస్తవం అనిపించుకుంటుంది. సాహిత్యం అనిపించుకోవాలంటే అనుభవాలకు కొంత కల్పన అవసరం. ఆ కల్పన హృదయ రంజకంగా ఉండాలి. కథలో చివర మంచి మలుపు ఉండాలి. ఈ కథల్లో అనుభవాలకు తోడు మలుపు కోసం కొంత కల్పన చేశాను. ఈ కథలు ఎక్కువగా సంభాషణాత్మకంగా నాటకీయ పద్ధతిలో సాగుతాయి. రచన నాటకీయ పద్ధతిలో ఉన్నప్పుడు పాత్రల మధ్య సంఘర్షణ ఉంటుంది. ఈ కథల్లో పాత్రల మధ్య సంఘర్షణ ఉంది.

నా కథల్లో భిన్న వ్యక్తుల భిన్న మనస్తత్వ చిత్రణ ప్రధానంగా ఉంటుంది. ధరణి నవలలోనూ, ఐదు కథల్లోనూ అలాంటి భిన్న మనస్తత్వ చిత్రణ ప్రధానంగా ఉంది.

జయదేవ్

ధరణి - నవలిక

"ధరణి గారూ, రాజు గారు చనిపోయి ఈనెల 10వ తేదీ నాటికి సంవత్సరం అవుతుంది. ఆ రోజున మనము ఈ వూర్లో ఉన్న అన్ని అనాధ శరణాలయాల్లో మధ్యాహ్నం పూట ప్రత్యేకమైన వంటకాలతో రాజు గారి జ్ఞాపకార్థం భోజనాలు పెట్టిద్దాం" అన్నాడు సత్యప్రసాద్.

"అలాగే మాష్టారూ, మీరు చెప్పినట్లుగా తప్పనిసరిగా ఆ రోజున అన్ని అనాధ శరణాలయాల్లోనూ రాజు గారి జ్ఞాపకార్థం భోజనాలు పెట్టిద్దాం. అలాగే మా చెల్లెలు కమల చనిపోయి ఆరు నెలలు అవుతూ వుంది. ఆమె సంవత్సరీకం రోజు కూడా అన్ని అనాధ శరణాలయాల్లో ఆమె జ్ఞాపకార్థం భోజనాలు పెట్టిద్దాం" అన్నది ధరణి.

"అలాగే చేద్దాం. రాజు గారి ఊర్లో మెయిన్ రోడ్డుకు అనుకొని వారికి ఆరు ఎకరాల పొలం ఉంది కదా, ఆ పొలాన్ని ప్రభుత్వం వారికి ఇస్తే అక్కడ ప్రభుత్వం వారు గురుకుల ఆశ్రమ పాఠశాలను, ఆ పాఠశాలలో చదువుకునే పిల్లలకు వసతి గృహాన్ని కట్టిస్తారు. గురుకుల ఆశ్రమ పాఠశాలకు భూమిని ఉచితంగా ఇచ్చినందుకు ఆ పాఠశాలకు రాజు గారి పేరు పెడతారు. అది

కూడా మనం చేయాలి. మనిద్దరం వెళ్లి జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి ఆ భూమిని ప్రభుత్వం వారికి ఇచ్చి అందులో కట్టే గురుకుల ఆశ్రమ పాఠశాలకు రాజు గారి పేరు పెట్టమని కోరుదాం. అలాగే ఆ పాఠశాలలో మన డబ్బుతో రాజు గారి నిలువెత్తు విగ్రహాన్ని పెట్టించుదాం'' అన్నాడు సత్య ప్రసాద్.

"మీరు ఎంత మంచి వారు మాస్టారూ, చనిపోయిన రాజు గారి మీద మీకు చాలా అభిమానముంది. తప్పనిసరిగా మీరు చెప్పినట్లుగా ఆ ఆరు ఎకరాల భూమిని ప్రభుత్వం వారికి ఇద్దాం. మనకు ఆ భూమితో ఎలాంటి అవసరం లేదు. ఆ భూమి ప్రజలకు ఉపయోగపడితే చనిపోయిన రాజు గారి ఆత్మ ఎంతో సంతోషిస్తుంది. ఆ పాఠశాల ఉన్నంత కాలం రాజు గారి పేరును ప్రజలు చెప్పుకుంటూ ఉంటారు. వారి నిలువెత్తు విగ్రహాన్ని చూసి ప్రజలు సంతోషిస్తూ వుంటారు. అలాగే చనిపోయిన మా చెల్లెలు కమల పేరు శాశ్వతంగా గుర్తుండేలాగా ఏదైనా కార్యక్రమం చేయాలి. దాన్ని గురించి కూడా ఆలోచించండి'' అన్నది ధరణి.

"కమల పట్ల మీకు చాలా ప్రేమాభిమానాలున్నాయి. అలాగే మీరు చెప్పినట్లుగా కమల పేరు శాశ్వతంగా గుర్తుండిపోయే లాగా ఒక కార్యక్రమం తప్పనిసరిగా చేద్దాం. విశ్వవిద్యాలయాల్లో వ్యక్తుల పేరుతో గోల్డ్ మెడల్ ను ఏర్పాటు చేస్తూ ఉంటారు. గోల్డ్ మెడల్ పెట్టడానికి విశ్వవిద్యాలయానికి మూడు లక్షల రూపాయలు ఇవ్వాలి. మా పొలిటికల్ సైన్స్ విభాగంలో ప్రతి సంవత్సరం ఎం.ఏ లో మొదటి ర్యాంకు తెచ్చుకున్న అభ్యర్థికి కమల పేరుతో ఒక బంగారు పతకాన్ని ఏర్పాటు చేద్దాం. విశ్వవిద్యాలయం వారు కాన్వకేషన్ పుస్తకంలో ఆమె పేరుతో బంగారు పతకం ఉన్నట్లుగా ప్రకటించడమే కాకుండా ప్రతి సంవత్సరం కాన్వకేషన్ జరిగే రోజున పొలిటికల్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంకు తెచ్చుకున్న అభ్యర్థికి ఆమె పేరుతో బంగారు పతకాన్ని బహుకరిస్తారు. ఇది చాలా మంచి పని. ఆ పని చేద్దాం "అన్నాడు సత్య ప్రసాద్.

"మీరు చెప్పిన ఈ పని చాలా బాగుంది, అలాగే చేద్దాం. కానీ మాస్టారూ, మీరు నన్ను బహువచనంతో "ధరణి గారూ'' అని, "మీరు'' అని పిలవడం బాగా లేదు. నేను మీ భార్యను, భార్యను ఎవరైనా "మీరు'' అని పిలుస్తారా? మీరు తప్ప ఎవరూ పిలవరు, ఎవరైనా మన సంభాషణ విన్నారంటే మనల్ని

భార్యాభర్తలు అనుకోరు, అందువల్ల మీరు నన్ను "నువ్వు" అని "ధరణి" అని పిలవండి" అన్నది ధరణి.

"మిమ్మల్ని మొదటి నుంచి "ధరణి గారు" అని "మీరు" అని పిలవటం అలవాటయింది. ఆ అలవాటు మానుకొని కొత్తగా నువ్వు అని పిలవలేకపోతున్నాను. ఆడవాళ్ళను గౌరవించడం మన సంప్రదాయం. మీరు నా భార్య అయినప్పటికీ గౌరవంగా మిమ్మల్ని మీరు అని, ధరణి గారూ, అని పిలుస్తున్నాను. ఇందులో తప్పేముంది. మీరు కూడా నన్ను ఇంకా "మాస్టారు" అనే పిలుస్తున్నారు కదా" అన్నాడు సత్యప్రసాద్.

"ఆడవాళ్ళను గౌరవించడం మన సంప్రదాయమే, అంగీకరిస్తున్నాను, కానీ పరాయి స్త్రీలను "మీరు" అని గౌరవంగా పిలవాలి, భార్యను కాదు, మీరు ఇప్పుడు నాకు భర్త, భార్య భర్తను మీరు అని పిలవటం, భర్త భార్యను నువ్వు అని పిలవడం ఆనవాయితీ, దానికి భిన్నంగా మీరు భార్యనైన నన్ను "మీరు" అని పిలవటం నాకు నచ్చడం లేదు. ఎలాగైనా మీరు నన్ను "నువ్వు" అని పిలవటం అలవాటు చేసుకోవాలి. నాకు మొదటి నుంచి మిమ్మల్ని "మాస్టారు" అని పిలవడం అలవాటయింది. అది మానుకోలేక మీరు నాకు భర్త అయినప్పటికీ "మాస్టారు" అని పిలుస్తున్నాను. ఇందులో తప్పేముంది? మీరు ఎలాగూ యూనివర్సిటీలో మాష్టారే కదా, గతంలో నాకు బి.ఎ పాఠాలు చెప్పారు కదా, కాబట్టి నాకు మీరు మాస్టారే, మీరు మాస్టారు కాబట్టి నేను మిమ్మల్ని మాస్టారు అని పిలుస్తున్నాను" అన్నది

"ఎలా పిలుస్తున్నారు అన్నది ముఖ్యం కాదు, మనుషుల మీద మనసులో ప్రేమ ఉండడం ముఖ్యం, మీ మీద నాకు ప్రేమ, గౌరవం ఉన్నాయి. పిలుపు ముఖ్యం కాదు. నువ్వు అన్నా, మీరు అన్నా, ఆ పిలుపులో ప్రేమ ఉండాలి, అభిమానం ఉండాలి, గౌరవం ఉండాలి, అలా ఉండేటట్లుగా నేను మిమ్మల్ని పిలుస్తున్నాను. కాబట్టి మన పిలుపుల సంగతి వదిలేసి జరగవలసిన కార్యక్రమాన్ని గురించి ఆలోచిద్దాం. మనం రేపే కలెక్టర్ దగ్గరికి వెళ్లి భూమి సంగతి గురించి కలెక్టర్ గారితో మాట్లాడదాం" అన్నాడు.

అనుకున్నట్లుగానే ధరణి సత్య ప్రసాదులు మరుసటి రోజు కలెక్టర్ గారిని కలిసి రాజు గారి పేరుతో ఉన్న ఆరు ఎకరాల పొలాన్ని గురుకుల ఆశ్రమ

పాఠశాలకు ఇచ్చేటట్లు, ఆ స్థలంలో ప్రభుత్వం వారు గురుకుల ఆశ్రమ పాఠశాలను, అందులో చదువుకునే పిల్లలకు వసతి గృహాన్ని కట్టించేటట్లుగా, ఆ పాఠశాలకు రాజు గారి పేరు పెట్టేటట్లుగా, ఆ పాఠశాలలో తమ డబ్బుతో రాజు గారి నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించేటట్లుగా రాతకోతలన్నీ పూర్తి చేసి వచ్చారు. ప్రతి సంవత్సరం రాజు గారు చనిపోయిన రోజున ఆ పాఠశాలలోని పిల్లలందరికీ భోజనాలు పెట్టించాలని కూడా వారు నిర్ణయించుకున్నారు. అలాగే కమల చనిపోయిన రోజున ప్రతి సంవత్సరం విశాఖపట్నం లోని అన్ని అనాథ శరణాలయాల్లోనూ భోజనాలు ఏర్పాటు చేయాలని వారిద్దరూ నిర్ణయించుకున్నారు. ఆ మరుసటి రోజే విశ్వవిద్యాలయానికి మూడు లక్షల రూపాయలు కట్టి కమల పేరుతో పొలిటికల్ సైన్స్ విభాగంలో ఒక బంగారు పతకాన్ని ఏర్పాటు చేశారు.

ఇదంతా చేసిన తర్వాత ధరణి ఇంట్లో కూర్చుని తన గత జీవితాన్ని , తన జీవితంలో వచ్చిన అనేక మలుపులను, తన ఊరును, ఊరికి కొంచెం దూరంగా ఉన్న పట్నాన్ని, ఆపట్నంలో తన జీవితాన్ని జ్ఞాపకం చేసుకుంది.

2 వ అధ్యాయం

అది ఒక మోస్తరు మునిసిపాలిటీ పట్నం. మూడు లక్షలకు పైగా జనాభా ఉంటుంది. దాని చుట్టుపక్కల మంచి సారవంతమైన మాగాణి భూములు కలిగిన పల్లెటూర్లు ఉన్నాయి. ఆ పల్లెటూర్ల నుంచి మోతుపరి రైతులు మొదలుకొని సామాన్య ప్రజల వరకు అనేక పనుల మీద ఆ పట్నానికి వచ్చిపోతూ ఉంటారు. కొంతమంది ఏ పని లేకపోయినా ఆ పట్నానికి వచ్చి హొటల్లో టిఫిన్లు భోజనాలు చేసి సినిమాలు చూసి రాత్రికి తమ ఊరికి వెళ్ళిపోతుంటారు. కొంతమంది మోతుబరి రైతులు తమ పిల్లలను చదివించడానికి పల్లెటూర్లు వదిలి ఆపట్నంలో నివాసం ఏర్పరచుకున్నారు. ఆ ఊర్లో అనేక రైస్ మిల్లులు ఉన్నాయి. ఆ ఊరికి వచ్చే జనాలు బస చేయడానికి లాడ్జింగులు కూడా ఉన్నాయి. ఊర్లో ఇంటర్మీడియెట్, డిగ్రీ కలిసి వున్న ఒక ప్రభుత్వ కళాశాల, అలాగే ఇంటర్మీడియెట్, డిగ్రీ కలిసి వున్న ఒక ప్రైవేటు మహిళా కళాశాల ఉన్నాయి.

ఆ ఊర్లో ధనవంతులున్నారు. ఎగువ మధ్య తరగతి వారు దిగువ మధ్యతరగతి వారు ఎక్కువగా ఉన్నారు. బీద వాళ్ళు చాలా మంది ఉన్నారు. ధనవంతుల ఇళ్ళు నాలుగు ఐదు పడకగదులతో డాబా ఇళ్ళు ఆర్భాటంగా ఉన్నాయి. మధ్యతరగతి వాళ్ళ ఇళ్ళన్నీ చాలా వరకు ఒకే విధంగా ఉన్నాయి. వీరి ఇళ్ళు రైలు పెట్టెల మాదిరిగా ఒక గది తర్వాత మరొక గది వరుసగా మొత్తం మూడు గదులతో ఉన్నాయి. కొన్ని ఇళ్ళు నాలుగు గదులతో కూడా ఉన్నాయి. కొందరు మధ్యతరగతి వాళ్ళు అద్దెకు ఇచ్చుకోవడానికి వీలుగా రెండు పోర్షన్లు, మూడు పోర్షన్లు, నాలుగు పోర్షన్లు కట్టించుకున్నారు. అన్ని పోర్షన్లకు కలిపి ఒకటే ప్రహరీ గోడ ఉంటుంది.

అలాంటి నాలుగు పోర్షన్లు ఉన్న ఆవరణలో ధరణి తన భర్తతో కలిసి ఒక పోర్షన్లో అద్దెకు ఉంది. అయింట్లో మొత్తం మూడు గదులున్నాయి. మొదటి గది డ్రాయింగ్ రూం, రెండవ గది బెడ్ రూమ్, మూడవది వంటగది. చివర స్నానం గది, లెట్రిన్ ఉన్నాయి. అటువైపు నుంచి మొదటి పోర్షన్ లో ఇల్లు గలవారున్నారు. మిగిలిన మూడు పోర్షన్లు అద్దెకిచ్చారు. ధరణి కుటుంబం ఇటువైపు చివరి పోర్షన్లో ఉంది.

ధరణి భర్త పాండురంగరాజు. అతను బి. ఏ వరకు చదువుకున్నాడు. అతని సొంత ఊరు ఆ పట్టణానికి దగ్గరలో ఉన్న పల్లెటూరు. అతనికి ఒక తమ్ముడున్నాడు. అతను కూడా ఆ పట్నంలోనే వేరే ఉద్యోగం చేస్తున్నాడు. రంగరాజుకు సొంత వూర్లో పిత్రార్జితం పది ఎకరాల పొలం వుంది. అది కౌలుకు ఇచ్చి పట్నంలో వ్యాపారం చేసుకుంటున్నాడు. అతను ధరణి కంటే ఆరు సంవత్సరాలు పెద్దవాడు. అతనికి భార్య ధరణి మీద చాలా ప్రేమ, ఇష్టం. పెళ్లి చూపుల్లో ఆమెను చూసి ఆమె పట్ల బాగా ఆకర్షితుడయ్యాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తనకు కట్నం ఏమీ అక్కర్లేదని చెప్పాడు. పెళ్లి చేసుకున్న తర్వాత ఆమె పద్ధతులు ఆమె నిరాడంబరత అతనికి ఇంకా బాగా నచ్చాయి. ఇంటి పని విషయంలో గానీ, బయట పని విషయంలో గానీ ఆమె ఎవరిమీద ఆధారపడకుండా తన పనులన్నీ తానే చేసుకునేది. ఇంటిని చాలా శుభ్రంగా అద్దం లాగా ఉంచేది.

పాండురంగరాజు తల్లిదండ్రులు అప్పుడప్పుడు వాళ్ళ ఇంటికి వచ్చేవారు. ధరణి వారిని చాలా బాగా చూసుకునేది. వాళ్లకు కావాల్సినవన్నీ అడిగి మరీ

చేసి పెట్టేది. అంత మంచి కోడలు లభించినందుకు వాళ్ళు చాలా సంతోషించేవారు. ఆమెను గురించి కొడుకుతో చాలా మంచిగా చెప్పేవారు. తన తల్లిదండ్రులను అంత బాగా చూసుకుంటున్న ధరణి పట్ల రంగరాజుకు చెప్పలేనంత ప్రేమ. ఆమె ఏనాడు తనకు చీరలు కావాలని నగలు కావాలని అడగలేదు. ఇవన్నీ చూసిన తర్వాత అతనికి ఆమె మీద ప్రేమ రెట్టింపు అయింది. ఆమె మాటకు చాలా విలువ ఇస్తాడు, ఆమె కోరిన కోరిక ఏది కాదనడు. ఆమె మనసు తెలుసుకొని ప్రవర్తిస్తూ ఉంటాడు. అతను చాల మంచి భర్త.

పాండురంగరాజుకు సొంత వ్యాపారముంది. ఆయన ఉదయం టిఫిన్ చేసి 9 గంటలకు ఆఫీస్ కు వెళ్తాడు. మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనానికి వచ్చి మళ్లీ మూడు గంటలకు ఆఫీస్ కు వెళ్తాడు. రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వస్తాడు. ఇది అతని దినచర్య. వ్యాపారం పని మీద అతను నెలలో పది రోజుల పాటు వేరే ఊర్లకు వెళ్లి వస్తుంటాడు. అతని వ్యాపారం బాగానే సాగుతుంది. వ్యాపారాల్లో సహజంగా ఉండే ఒత్తిళ్లు అతని వ్యాపారంలో కూడా ఉన్నాయి. అతను అప్పుడప్పుడు తోటి వ్యాపారస్తులతో కలిసి తాగుతూ ఉంటాడు. అతనికి సిగరెట్ కాల్చే అలవాటు కూడా ఉంది. ఆ కుటుంబానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు.

ఇంటికి సంబంధించిన అన్ని పనులు ధరణి స్వయంగా చేసుకుంటుంది. అంట్లు తోమడం, వంట చేసుకోవడం, ఇల్లు శుభ్రం చేయడం, బట్టలుతకడం, ఇంటికి సంబంధించిన సామానులు కొనుక్కురావడం, కూరగాయలు కొనుక్కోవడం మొదలైన అన్ని పనులు ఆమే చేసుకుంటుంది. పాండురంగరాజు వ్యాపారానికి సంబంధించిన పనులతో బిజీగా ఉంటాడు. అందువల్ల ఇంటికి సంబంధించిన విషయాలు పూర్తిగా ధరణికి వదిలేశాడు. ధరణికి ఖాళీగా ఉండటం ఇష్టముండదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ ఉంటుంది. పని మనుషులతో పని చేయించడం ఆమెకు అసలు ఇష్టముండదు. పని మనుషులు పని శుభ్రంగా చేయరు. వారు చేసే పని ఆమెకు అసలు నచ్చదు, అందువల్ల ఇంటికి సంబంధించిన అన్ని పనులు ఆమే చేసుకుంటుంది. ఖాళీగా ఉండడం ఆమెకు ఏమాత్రం ఇష్టముండదు. ఏదో ఒక పని చేసుకుంటూనే ఉంటుంది. ఏ పని లేకపోతే చేసిన పనే మళ్ళీ మళ్ళీ చేస్తూ

ఉంటుంది. అందువల్ల ఆమెను తెలిసినవారు ఆమెను పని రాక్షసి అంటూ ఉంటారు. అది ఆమెకు ఒక రకంగా కితాబు లాంటిది. అది నూటికి నూరు పాళ్ళు నిజం.

ధరణి మంచి రంగుతో సన్నగా అందంగా ఉంటుంది. చాలా సింపుల్ మనిషి. కలుపుగోలుగా ఉంటుంది. ఆమెకు ఆడంబరాలు ఆర్భాటాలు అసలు ఇష్టముండదు. స్త్రీలకు సహజంగా ఉండే బంగారు నగల మీద, చీరలు జాకెట్ల మీద, ఇంటికి సంబంధించిన ఖరీదైన వస్తువుల మీద ఆమెకు ఏమాత్రం కోరిక లేదు. ఆమె ఏనాడు భర్తను తనకు చీరలు కావాలని, నగలు కావాలని ఇంట్లోకి సోఫాలు మొదలైనవి కావాలని ఎప్పుడూ అడగలేదు. ఆమె అడగకపోయినప్పటికీ పాండురంగరాజు ప్రతినెలా కొంత డబ్బును ఆమెకు ఇచ్చి ఆమెకు ఇష్టమైన చీరలు నగలు కొనుక్కోమని చెబుతూ ఉంటాడు. కానీ ఆమె ఆ డబ్బులు ఖర్చు పెట్టదు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ తిరిగి భర్తకే ఆడబ్బు ఇస్తూ ఉంటుంది. తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సమయంలో ఐదు ఎకరాల పొలం ఇచ్చారు. దానికి సంబంధించిన కౌలు డబ్బులు తండ్రి ఆమెకు తెచ్చి ఇస్తుంటాడు. ధరణి ఆ డబ్బుతో తనకు అవసరమైన చీరలు జాకెట్లు కొనుక్కుంటూ ఉంటుంది. ఆమె బజారుకు నడిచే వెళ్తుంది. చేతిలో మోయలేనంత బరువు ఉంటే తప్ప రిక్షా గానీ ఆటో గానీ ఎక్కదు. ఇలా శారీరక కష్టం చేయడం వల్ల ఆమె చాలా ఆరోగ్యంగా ఉంది.

ధరణి తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. వాళ్లకు పల్లెటూర్లో పది ఎకరాల పొలం ఉంది. తండ్రి వ్యవసాయం చేస్తాడు. ధరణికి పనిచేయడమంటే చాలా ఇష్టం. సెలవులు వచ్చినప్పుడు వ్యవసాయ పనుల్లో పాల్గొనేది. తల్లికి ఇంటి పనుల్లో చాలా సాయం చేసేది. ఆమె ఏనాడు తల్లిదండ్రులను అది కావాలి ఇది కావాలని అడిగేది కాదు. ఆమె ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలది. తల్లిదండ్రులకు ఆమె అంటే చాలా ఇష్టం. అంత మంచి కూతురు తమకు పుట్టినందుకు వాళ్ళు ఎంతో ఆనందిస్తూ ఉంటారు. తల్లిదండ్రుల పట్ల ఆమె చాలా వినయ విధేయతలు కలిగినది. ఆమెకు తన కుటుంబమంటే చాలా ఇష్టం. కుటుంబానికి దూరంగా ఉండటం ఆమెకు ఏమాత్రం ఇష్టముండేది కాదు.

ధరణికి చదువంటే చెప్పలేనంత ఇష్టం, ఆసక్తి. బాగా చదివి కళాశాలలో లెక్చరర్ గా ఉద్యోగం చేయాలని ఆమె కోరుకుంటూ ఉంటుంది. డిగ్రీ చదువుతుండగా తల్లిదండ్రులు పెళ్లి ప్రస్తావన తెచ్చారు. తల్లిదండ్రులను వదిలివేసి, చదువు మానేసి పెళ్లి చేసుకొని తన కుటుంబానికి దూరంగా వెళ్లిపోవడం ఆమెకు ఏమాత్రం ఇష్టం లేదు. అదే విషయాన్ని తల్లిదండ్రులకు ఆమె చెప్పింది. కానీ తల్లిదండ్రులు ఆమె మాటలను అంగీకరించలేదు. స్త్రీకి పెళ్లి తప్పనిసరి అని, ఏ వయసులో జరిగే ముచ్చట ఆ వయసులో జరగాలని, ఆమెకు పెళ్లి వయసు వచ్చిందని చెప్పి ఆమెను పెళ్లికి అంగీకరింపజేశారు. తల్లిదండ్రుల మాట కాదనలేక ఆమె పెళ్లికి అంగీకరించింది. పెళ్లి నాటికీ ఆమెకు 22 సంవత్సరాలు. పెళ్లయిన తర్వాత ఆమె తమ పల్లెటూరుకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నానికి కాపురానికి వచ్చింది.

కాపురానికి వచ్చిన కొత్తలో ధరణికి తల్లిదండ్రులు బాగా గుర్తుకు వచ్చేవారు. తన పల్లెటూరు, పరిసరాలు, పచ్చని పొలాలు తన చదువు ఆమెకు ఎప్పుడు గుర్తుకొస్తూ వుండేవి. ఆమె భర్త పాండురంగరాజు ఆమెను చాలా బాగా, ప్రాణం లాగా చూసుకుంటూ వుంటాడు. ఆమె పట్ల చాలా ప్రేమగా వుంటాడు. ఇంటికి సంబంధించిన అన్ని విషయాలు ఆమెకు చెప్పి చేసేవాడు. తనపట్ల అంత ప్రేమని ప్రదర్శిస్తున్న భర్త అంటే ఆమెకు చాలా ప్రేమ, అభిమానం, గౌరవం కూడా. అయితే అందులో ప్రత్యేకత ఏమీ లేదు. పెళ్లయిన తర్వాత స్త్రీలకు మంచి భర్త మీద కలిగే అభిప్రాయం లాంటిదే ఆమెకు కూడా ఆమె భర్త మీద కలిగింది. అతను తన భర్త, తన భవిష్యత్తు అంతా అతనితోనే ముడిపడి వుంది. తన మిగిలిన జీవితమంతా అతనితోనే గడపాలనేది ఎవరు చెప్పకుండానే ఆమెకు అర్థమైంది. అందువల్ల ఆమె భర్తను చాలా బాగా చూసుకునేది. భర్త సాహచర్యంలో కాలం గడిచే కొద్దీ ఆమె మెల్లమెల్లగా పుట్టింటి సంగతులు మరిచిపోయి కొత్త జీవితానికి అలవాటు పడింది. ఆమె జీవితం సుఖంగా చాలా సాఫీగా సాగుతూ ఉంది. అయితే ఆమెకు ఒకటే లోపంగా అనిపించేది. తాను బాగా చదువుకొని లెక్చరర్ కావాలన్న తన కోరిక తీరనందుకు కొంత బాధ పడుతూ ఉంటుంది.

ధరణికి తనలో మార్పు వచ్చిన తరువాత స్త్రీ జీవితంలో పెళ్లి ఎంత మార్పు తెస్తుందో ఆమెకు అర్థమైంది. ఆమె అప్పుడప్పుడు పుట్టింటికి వెళ్తూ

ఉంటుంది. వెళ్ళినప్పటికీ ఒకటి రెండు రోజుల కంటే ఎక్కువగా అక్కడ ఉండలేకపోతూ వుంది. పుట్టినింట్లో ఒక అతిధి లాగా ఉంటున్నట్టుగా ఆమెకు అనిపించ సాగింది. దానితో ఆమె ఎక్కువ రోజులు అక్కడ ఉండకుండా తన ఇంటికి వచ్చేది. పెళ్లి కాకముందు ఆమె తల్లిదండ్రులను వదిలి వుండడానికి ఏమాత్రం ఇష్టపడేది కాదు. ఇప్పుడు ఆమె తన పుట్టింట్లో ఎక్కువ రోజులు ఉండడానికి ఇష్టపడటం లేదు. తల్లిదండ్రులు ఆమెను ఇంకా కొన్ని రోజులు తమతో ఉండమని బతిమాలుతూ ఉంటారు. అయినప్పటికీ ఆమె పుట్టింట్లో రెండు రోజులు కంటే ఎక్కువగా ఉండలేక పోతూవుంది. స్త్రీల జీవితంలో వివాహం తెచ్చిన మార్పుకు ఆమె చాలా ఆశ్చర్యపోయేది. తల్లిదండ్రులు అప్పుడప్పుడు తన దగ్గరికి వస్తూ ఉంటారు. వారిని ఆమె చాలా బాగా చూసుకునేది. తల్లిదండ్రులను చూడాలనిపించినప్పుడల్లా ఆమె వారి దగ్గరికి వెళ్తూ ఉంటుంది. వెళ్లేటప్పుడు తల్లిదండ్రులకు ఇష్టమైన స్వీట్స్, పండ్లు తీసుకుని పోతుంది. అప్పుడప్పుడు బట్టలు కూడా తీసుకొని పోతుంది. తమ పట్ల అంత శ్రద్ధను ప్రేమను చూపిస్తున్న కూతురంటే వారికి చాలా ఇష్టం.

3 వ అధ్యాయం

ధరణికి పెళ్లై ఆరు సంవత్సరాలయింది. ఇంతవరకు పిల్లలు కలగలేదు. పిల్లలంటే ఆమెకు చాలా ఇష్టం. చిన్నప్పటినుంచి పిల్లలతో కలిసి ఆమె బాగా ఆడుకునేది. పెద్దయిన తర్వాత కూడా ఆమె పిల్లలతో కలిసిపోయి తాను ఒక పిల్ల అయి వారితో ఆడుకునేది. ఆమె అమ్మ "పిల్లలతో ఏమిటే ఆ ఆటలు, నువ్వు ఇంకా చిన్న పిల్లవనుకుంటున్నావా" అని తిట్టేది. కానీ ధరణి తల్లి మాటలు పట్టించుకోకుండా పిల్లలతో ఆడుకుంటూ ఉండేది.

పెళ్లి అయిన రెండవ సంవత్సరం నుంచి ఆమె సంతానం కోసం ప్రయత్నిస్తూ వుంది. ఆవూర్లో ఉన్న అన్ని దేవాలయాలకు వెళ్లి సంతానం కలిగించుమని ఆ దేవతలను వేడుకుంది. చుట్టుపక్కల దగ్గర్లో ఉన్న అన్ని పుణ్యక్షేత్రాలకు భర్తతో కలిసి వెళ్లి సంతానం కలిగించమని ప్రార్థించింది. ఫలితం లేదు. ఇంకా పక్కింటివారు, చుట్టాలు బంధువులు చెప్పిన దూరంగా ఉన్న తిరుపతి, అన్నవరం, సింహాచలం మొదలైన పుణ్యక్షేత్రాలకు

పాండురంగరాజుతో కలిసి వెళ్లి ఆయా దేవుళ్ళకు మొక్కుకుంది. సంతానం కలిగితే మొక్కు తీరుస్తానని ముడుపు చెల్లిస్తానని అనేక రకాలుగా మొక్కుకుంది. కానీ ఫలితం లేదు. అనేక రకాల నోములు నోసింది. దానధర్మాలు చేసింది. ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమెకు సంతానం కలగలేదు.

చర్చికి వెళ్లి అక్కడ ప్రార్థన చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని కొందరు చెప్పగా విని ఆమె ప్రతి ఆదివారం తప్పనిసరిగా చర్చికి వెళ్లి తనకు సంతానం కలుగించుమని జీసస్ ను, మేరీ మాతను ప్రార్థించింది. దానివల్ల కూడా ఫలితం లేకపోయింది.

దీనితో తనకు సంతాన భాగ్యం లేదేమోనని ఆమె దిగులు పడుతూ ఉంది. ఎవరైనా తల్లిదండ్రులు చిన్నపిల్లలు ఎత్తుకొని వెళ్తూ ఉంటే ఆమె తదేకంగా వారి వైపు చూస్తూ వారి అదృష్టానికి సంతోషిస్తూనే తన దురదృష్టానికి విచారిస్తూ ఉంటుంది. తనకు ఆ భాగ్యం లేకపోయింది కదా అని మనసులో చాలా బాధపడుతూ ఉంటుంది. గత జన్మలో చేసుకున్న పాపం వల్ల తనకు పిల్లలు కలగలేదని ఆమె ఎంతగానో చింతిస్తూ వుంటుంది. ఆమె పడుతున్న బాధను చూసి రంగరాజు చాలా బాధపడుతూ వుంటాడు. ఆమె బాధను చింతను తన మాటల చేత పోగొట్టడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తూ వుంటాడు. ఆమెను ఎంతగానో ఓదార్చుతూ తప్పనిసరిగా ఆమెకు సంతానం కలుగుతుందని నచ్చజెప్పుతూ వుంటాడు.

పాండురంగరాజుకు కూడా పిల్లలంటే చాలా ఇష్టం. అతను ధరణితో కలిసి దేవాలయాలకు పుణ్యక్షేత్రాలకు వెళ్లి ఎంతో భక్తితో ఆయా దేవుళ్ళను తమకు సంతానం కలిగించుమని వేడుకునేవాడు. ధరణి చేస్తున్న దానాలు ధర్మాలు నోములు వ్రతాలకు అతను పూర్తిగా సహకరించేవాడు. అతను తన వ్యాపార పనులతో బిజీగా ఉండడం చేత పిల్లలు లేరన్న దిగులు అతనికి పెద్దగా వుండేది కాదు. కానీ ధరణి పడే దిగులు చూసి అతను చాలా బాధపడేవాడు. ఆమె దిగులు పోగొట్టడానికి ఏమి చేయాలో అతనికి అర్థమయ్యేది కాదు.

చంటి పిల్లలను ఇంట్లో ఉంచుకొని వారిని ప్రేమతో పెంచితే సంతానం కలుగుతుందని ఎవరో చెప్పగా ప్రతిరోజు ఉదయం తన మరిది (భర్త తమ్ముడు) యింటికి వెళ్లి అతని రెండేళ్ళ కూతురును తన ఇంటికి తీసుకొని వచ్చి సాయంత్రం వరకు తన దగ్గరనే ఉంచుకొని ఎంతో ప్రేమగా సొంత కూతురు లాగా ఆపాప ఆలనా పాలనా ధరణి చేసింది. ఆ పాప గూడా ఆమెను "ధరణమ్మా" అని ఎంతో ప్రేమగా పిలిచేది. పాప ఆమె దగ్గరున్నంత సేపు ఆమెకు చాలా సంతోషంగా ఉండేది. సాయంత్రం కాగానే మరిది గానీ తోడుకోడలు గానీ వచ్చి పాపను తీసుకొని వెళ్లేవారు. పాప వెళ్ళిపోగానే ఆమెకు ఏమీ తోచేది కాదు. చాలా బాధగా ఉండేది. పాప మీద రోజు రోజుకు ఆమెకు ప్రేమాభిమానాలు పెరుగుతూ వచ్చాయి. చివరకు ఆ పాపను దత్తత తీసుకుందాని ఆమె భర్తకు చెప్పింది. పాండురంగరాజు కూడా దానికి అంగీకరించాడు. కానీ ఆమె తోడుకోడలు పాపను దత్తత ఇవ్వడానికి అంగీకరించలేదు. పాండురంగరాజు తమ్ముకిని కూడా ఒకటే కూతురు. అయితే వాళ్లకు ఇంకా పిల్లలు పుట్టే అవకాశముంది. వాళ్ల పాప ఒక్కతే చాలనుకున్నారు. ఆ పాపను తమకు ఇచ్చి ఇంకొకరిని కనమని ధరణి, భర్త ద్వారా మరిదితో తోడుకోడలికి చెప్పించింది. నేను పిల్లలను కనే యంత్రాన్ని కాను అని తోడికోడలు అంగీకరించలేదు. దానితో ధరణికి చాలా నిరాశ కలిగింది. ఎంతగానో బాధపడింది. ఆ బాధ నుంచి బయటపడడానికి ఆమెకు చాలా రోజులు పట్టింది.

సంతానం కోసం భక్తి మార్గం ద్వారా ప్రయత్నం చేస్తూనే ఆధునిక వైద్యం ద్వారా కూడా ఆ దంపతులు చాలా ప్రయత్నించారు. సంతాన సాఫల్య కేంద్రాల్లో వారు పరీక్షలు చేయించుకున్నారు. వారిద్దరిలో ఎలాంటి లోపం లేదు. ఆడాక్టర్లు చెప్పిన మందులు వాడారు, సర్జరీలు చేయించుకున్నారు. ఎన్ని మందులు వాడినప్పటికీ ఎన్ని సర్జరీలు చేయించుకున్నప్పటికీ ఆమెకు సంతానం కలగలేదు. ఐ.యు.ఐ, ఐ.వీ.ఎఫ్ ల ద్వారా కూడా చాలా ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నం కూడా ఫలించలేదు. సంతానం లేదన్న దిగులు ఆమెకు రోజు రోజుకు పెరుగుతూ వచ్చింది. ఏం చేయాలో ఆమెకు అర్థం కావడం లేదు. ఆమె దిగులును పోగొట్టి ఆమెను ఎలా సంతోష పెట్టాలో పాండురంగరాజుకు తెలియక చాలా సతమతమవుతూ వుంటాడు. ఎలాగైనా ఆమెకు సంతానం

కలిగే లాగా చేసి ఆమెను సంతోషపెట్టాలని అతను తీవ్రంగా ఆలోచించేవాడు. కానీ అతనికి ఏ ఉపాయం తోచలేదు.

ఆమె బాధను పోగొట్టడానికి అనాధ శరణాలయంలో ఒక అమ్మాయిని దత్తత చేసుకుందామని పాండురంగరాజు ధరణికి చెప్పాడు. కానీ దానికి ఆమె అంగీకరించలేదు. ఆ పిల్లలు ఎవరికి పుట్టారో, పెరిగి పెద్దయిన తర్వాత ఆపిల్లల ప్రవర్తన ఎలా ఉంటుందో, మనం తెచ్చుకున్న పాప పెరిగి పెద్దయిన తర్వాత మన కులం వాళ్ళు ఆ పాపను పెళ్లి చేసుకోవడానికి అంగీకరించక పోవచ్చు మొదలైన కారణాలు చెప్పి ఆమె అనాధ శరణాలయంలోని పిల్లను దత్తత తీసుకోవడానికి అంగీకరించలేదు. పిల్లల కోసం ఆమె చేసిన అన్ని ప్రయత్నాలు విఫలం కావడంతో ఆమె చాలా నిరాశతో దిగులుతో ఉంటూ వచ్చింది. ఆ నిరాశ నుంచి దిగులు నుంచి బయటపడడానికి ఆమె అంతకుముందు కంటే ఎక్కువగా అస్తమానం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతూ వుంది. అప్పుడప్పుడు మరిది కూతురును తెచ్చుకొని ఆ పాపతో కాలక్షేపం చేస్తూ కొంతలో కొంత ఊరట చెందుతూ ఉంది.

4 వ అధ్యాయం

ఇలా ఉండగా ఆ ఊర్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు లెక్చరర్ గా బదిలీ మీద ఉద్యోగంలో చేరిన సత్యప్రసాద్ అనే అతను ధరణి ఉంటున్న పక్క పోర్షన్ లోకి వచ్చాడు. పిహెచ్.డి. చేసి డాక్టరేట్ పట్టా పొందాడు. అతనికి కొత్తగా పెళ్లి అయింది. మంచి రోజులు లేకపోవడం చేత భార్యను ఇంకా కాపురానికి తీసుకురాలేదు. ఇంట్లో చేరిన మొదటి రోజు అతను పాండు రంగరాజు వద్దకు వచ్చి పరిచయం చేసుకున్నాడు. సుమారు ఆరు అడుగుల ఎత్తు, చామన చాయను మించిన రంగు అమాయకమైన ముఖం కలిగిన ఆయన ఎంతో హుందాగా గంభీరంగా ఉన్నాడు. ఎలాంటి భేషజాలు లేకుండా చాలా సర్వసాధారణంగా కనిపిస్తాడు. మితభాషి అయిన సత్యప్రసాద్ ఉదయం ఐదు గంటలకు లేచి ఆరు గంటలకు రన్నింగ్ లేక జాగింగ్ కు వెళ్లి ఏడు గంటలకు ఇంటికి వచ్చేవాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఇంట్లో కొన్ని వ్యాయామాలు చేసేవాడు. యోగా చేసేవాడు, అతనికి ఎలాంటి దురలవాట్లు లేవు. ప్రతిరోజు వ్యాయామం చేయటం వల్ల అతని శరీరం దృఢంగా చాలా

ఆరోగ్యంగా చూడటానికి అందంగా ఉండేది. 8:30 కి ఇంటి నుంచి బయలుదేరి హోటల్లో టిఫిన్ చేసి కళాశాలకు వెళ్లేవాడు. మధ్యాహ్నం కళాశాల క్యాంటీన్ లో భోజనం చేసేవాడు. ఖాళీ సమయంలో అతను ఎక్కువగా గ్రంథాలయంలో పుస్తకాలను చదువుకుంటూ ఉండేవాడు. మళ్ళీ సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇంటికి వచ్చేవాడు. సైకిల్ మీద కళాశాలకు వెళ్లి వచ్చేవాడు. అతను లెక్చరర్ ఉద్యోగం చేస్తూ సింపుల్ గా సైకిల్ మీద వెళ్ళటం ధరణికి బాగా నచ్చింది. డిగ్రీ చదువును మధ్యలోనే ఆపేసిన ధరణికి పిహెచ్.డి. చేసి డాక్టరేట్ పట్టా పొందిన కాలేజీ లెక్చరర్ అయిన సత్యప్రసాద్ ను ఆశ్చర్యంతో, ఆరాధనతో చూసేది. చదువు ఆపకుండా, పెళ్లి చేసుకోకుండా బాగా చదువుకొని ఉంటే తాను కూడా తప్పనిసరిగా కాలేజీ లెక్చరర్ అయ్యేదాన్ని అని ఆమె చాలాసార్లు అనుకుంది. బాగా చదువుకోవాలన్న తన కోరికను, ఆసక్తిని చంపివేసి, బలవంతంగా తనకు పెళ్లి చేసిన తల్లిదండ్రుల మీద మొదటిసారిగా ఆమెకు కొంత కోపం వచ్చింది.

నెల రోజుల తర్వాత సత్యప్రసాద్ తన భార్యను తీసుకొని వచ్చాడు. ఆమె చాలా అందంగా ఉంది, పేరు కమల, ఇరవైనాలుగు సంవత్సరాల వయసు ఉంటుంది. డిగ్రీ వరకు చదువుకుంది. మంచి రంగుతో సన్నగా మల్లెతీగ లాగా ఉంది. ధరణి కంటే నాలుగు సంవత్సరాలు చిన్నది. మంచి కలుపుగోలు మనిషి. పక్క పక్కన ఉండడం చేత కమల, ధరణి ఇద్దరూ త్వరలోనే మంచి స్నేహితులయ్యారు. కొత్త కాపురం కావడం చేత ఇంట్లోకి కావలసిన ముఖ్యంగా వంటకు కావలసిన పాత్రలు మొదలైనవి కొనడంలో ధరణి ఆమెకు చాలా సహాయం చేసింది. ఆమెకు వంట చేయడం పెద్దగా రాదు. ఏ కూర ఎలా చేయాలో ధరణే ఆమెకు చెప్పింది. ధరణి తాను చేసిన కూరలు సాంబారు మొదలైనవి ఆవిడకు ఇచ్చేది. ధరణి చేసిన వంటను ఆమె బాగా మెచ్చుకునేది. కొద్ది రోజుల్లోనే ఆమె అన్ని రకాల వంటలను చక్కగా చేయడం నేర్చుకుంది. కూరగాయలు కొనడానికి, ఇంకా ఇంట్లోకి అవసరమైన వస్తువులు కొనడానికి ఇద్దరూ కలిసి బజారుకు వెళ్ళేవారు.

సత్య ప్రసాద్ కమలను ఉదయం పూట తనతోపాటు వాకింగ్ కు రమ్మని బలవంతం చేసేవాడు. కానీ కమల వెళ్ళేది కాదు. ఆమెకు తెల్లవారుజామున లేవడం కష్టంగా ఉంటుంది, బద్ధకంగా ఉంటుంది. అందువల్ల సత్యప్రసాద్

ఎంతగా బలవంతం చేసినప్పటికీ ఆమె వాకింగ్ కు వెళ్ళేది కాదు. ధరణిని చూసి ఇంటి పనులన్నీ తానే చేసుకునేది. ఆమెకు ఇంటి పనులతో సరిపోయేది.

సత్యప్రసాద్ కళాశాల గ్రంథాలయం నుంచి నవలలు కథల పుస్తకాలు కమల కోసం తెచ్చేవాడు. ఆమె వాటిని కాలక్షేపం కోసం చదివేది. ఆమె దగ్గర నుంచి ధరణి ఆ పుస్తకాలను తీసుకొని చదివేది. అలా చదవటం వల్ల ధరణికి చదువు మీద ఆసక్తి పెరిగింది. దూరవిద్య ద్వారా డిగ్రీ చదవడానికి అవకాశం ఉంటుందేమో సత్యప్రసాద్ గారిని అడిగి తెలుసుకోమని ఆమె కమలను కోరింది. ధరణికి చదువు మీద గల ఆసక్తిని గురించి కమల భర్తకు చెప్పింది. ఆయన తాను చదివిన ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం నుంచి బీ.ఏ. డిగ్రీ దరఖాస్తు ఫారం తెప్పించి ధరణికి ఇచ్చాడు. అంతేకాకుండా దాన్ని ఎలా నింపాలో దానికి అవసరమైన ఇతర సర్టిఫికెట్లు ఏవేవి పంపాలో అన్ని వివరంగా చెప్పి దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేయించి దూరవిద్యా కేంద్రానికి పంపించాడు.

పదిహేను రోజుల్లో దూరవిద్యా కేంద్రం నుంచి బి.ఏ. మొదటి సంవత్సరం చదవడానికి అవసరమైన స్టడీ మెటీరియల్ మొత్తం ధరణికి వచ్చింది. ధరణి అది చదవడం ప్రారంభించింది. అర్థం కాని అంశాలను సత్యప్రసాద్ ద్వారా తెలుసుకోవడం మొదలుపెట్టింది. అతను అన్ని విషయాలను చాలా ఓపిగ్గా చక్కగా అర్థమయ్యేలాగా చెప్పేవాడు. ఆమెను ధరణి గారూ అని, మీరు అని పిలుస్తూ ధరణి పట్ల చాలా మర్యాదగా హుందాగా వ్యవహరించేవాడు. అతని ప్రవర్తన చూసిన తర్వాత ధరణికి అతని మీద చాలా గౌరవం, అభిమానం ఏర్పడ్డాయి. కమల స్నేహం వల్ల, బి.ఏ. చదువు మీద ఆసక్తి వల్ల ధరణికి పిల్లలు లేరన్న దిగులు కొంత తగ్గింది. అది చూసి పాండురంగరాజు చాలా సంతోషించాడు. తన భార్యలో మార్పు తెచ్చిన సత్య ప్రసాద్ దంపతుల పట్ల ఆయన చాలా అభిమానంతో, స్నేహంగా ఉంటాడు.

5 వ అధ్యాయం

ఇలా సుమారు ఆరు నెలలు గడిచింది. అప్పుడు కమల తనకు రెండవ నెల అనే విషయాన్ని ధరణికి చెప్పింది. ధరణి చాలా సంతోషించింది. సత్య

ప్రసాద్ గర్భవతి అయిన భార్య పట్ల చాలా శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు డాక్టర్ దగ్గరికి తీసుకొని వెళ్లి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆమెకు వేవిళ్ళు ప్రారంభమయ్యాయి. నోరు చాలా వికారంగా ఉండేది. ఏమి తినాలనిపించేది కాదు. ఏమి తిన్నా కడుపులో ఇమడకుండా వెంటనే వాంతి అయిపోయేది. దానితో ఆమె చాలా భయపడుతూ ఉండేది. ఆమె నీరసంతో బాగా చిక్కిపోయింది. మామూలుగానే సన్నగా ఉన్న ఆమె వేవిళ్ళ వల్ల మరింత సన్నబడింది. ఉదయం పూట నిమ్మకాయ రసంలో తేనె వేసుకుని తాగడం వల్ల కొంతవరకు వికారం వాంతి తగ్గింది. డాక్టరు మందులు ఇవ్వడం చేత వేవిళ్లు మెల్లగా తగ్గాయి. ధరణి ఆమెకు చాలా ధైర్యం చెబుతూ ఉంటుంది. ధరణి తన పనులన్నీ త్వరగా ముగించుకొని కమల ఇంట్లోకి వెళ్లి ఆవిడకు అన్ని రకాల సహాయాలు చేస్తూ వుంటుంది. వారి రెండిళ్ళనూ కలుపుతూ మధ్య గదిలో వాకిలి వుంది. ఆ వాకిలి తలుపులు తెరిచి వాళ్ళిద్దరూ ఒకరి ఇంట్లోకి ఒకరు రాకపోకలు చేసేవాళ్లు. తనకు చేసిన సహాయానికి కమల ధరణిని బాగా మెచ్చుకునేది. ధన్యవాదాలు తెలిపేది. వాళ్ళిద్దరూ అక్క చెల్లెలు లాగా ఎంతో కలిసిమెలిసి ఉండేవారు. వారి స్నేహాన్ని చూసి అటు సత్యప్రసాద్ ఇటు పాండురంగారావు ఎంతగానో సంతోషించేవారు.

ఏడవ నెలలో కమల పుట్టింటి వాళ్ళు వచ్చి ఆమెను కాన్పుకు తీసుకొని వెళ్ళారు. వెళ్ళే ముందు ఆమె ధరణి చేసిన సహాయాన్ని గురించి మరీ మరీ ప్రస్తావించి ధన్యవాదాలు తెలియజేసింది. కమల వెళ్లిపోయిన తర్వాత ధరణి, పాండురంగరాజు లు సత్యప్రసాద్ ను తమతో పాటు తమ ఇంట్లోనే భోజనం చేయమని చాలా రకాలుగా కోరారు. కానీ ఆయన చాలా మర్యాదగా తిరస్కరిస్తూ తనని ఇబ్బంది పెట్టవద్దని, ఇతరులకు ఏమాత్రం అసౌకర్యం కలిగించడం తనకిష్టం లేదని చాలా వినయంగా వారి కోరికను తిరస్కరించాడు. ఆయన సొంతంగా వంట చేసుకునేవాడు. ధరణి అప్పుడప్పుడు కూరలు ఇస్తూ వుంటుంది.

కమల వెళ్ళిపోయిన తర్వాత ధరణి ఒంటరితనంతో చాలా ఇబ్బంది పడుతూ వుంది. ఆ సమయంలో పిల్లలు లేరన్న దిగులు ఆమెను మరింతగా వేదించ సాగింది. ఆ దిగులుతో ఆమెకు బి.ఏ. చదువు మీద కూడా ఆసక్తి పోయింది. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లుగా విచారంగా ఉండేది. తన

స్నేహితురాలు కమల అదృష్టానికి సంతోషిస్తూనే తన దురదృష్టాన్ని తలుచుకుంటూ బాధపడుతూ ఉంది.

"నా స్నేహితురాలు కమల ఎంతో అదృష్టవంతురాలు. కాపురానికి వచ్చిన నాలుగు నెల్లకే ఆమె కడుపు పండింది. నేను ఏడు సంవత్సరాల నుంచి కాపురం చేస్తున్నా నా కడుపులో ఒక్క కాయ గూడా కాయలేదు. నేను ఎంత దురదృష్టవంతురాలిని? పిల్లల కోసం నోములు, వ్రతాలు దానాలు ధర్మాలు ఎన్నో చేశాను. అనేక పుణ్యక్షేత్రాలను దర్శించాను. ఎన్ని ప్రయత్నాలు చేసినా నాకు పిల్లలు కలగలేదు. ఏ దేవునికి నామీద దయ కలగలేదు. నేను గొడ్రాలుగానే మిగిలిపోవాల్సిందేనా? నా బతుకు ఇంతేనా? ఏమి చేస్తే నాకు పిల్లలు కలుగుతారు? ఎలాగైనా నేను కనీసం ఒక బిడ్డనైనా కనాలి. లేకపోతే నా జీవితం వ్యర్థం. బిడ్డలు లేని జీవితాన్ని ఊహించుకోలేకపోతున్నాను" అని ఆమె మదన పడసాగింది.

ధరణి సత్యప్రసాద్ పట్ల ఆకర్షితురాలవుతూ వుంది. అతని నిరాడంబరత్వం, సురూపం, ప్రవర్తన, వ్యక్తిత్వం ఆమెకు చాలా బాగా నచ్చడం చేత ఆమె మనసు అతని పట్ల మొగ్గుతూ వుంది. కమల అతని ద్వారా నాలుగు నెలల్లోనే గర్భవతి అయిన విషయం తలుచుకొని తాను కూడా ఆయన ద్వారా సంతానం పొందవచ్చుననే ఆలోచన ఆమెకు వచ్చింది. ఆ ఆలోచన రాగానే ఆమె చాలా కంగారు పడింది. "ఏంటి నేను ఇలా ఆలోచిస్తున్నాను, ఇది చాలా తప్పు" అని ఆమె అనుకుంది. అలాంటి ఆలోచన రాకుండా మనసును కట్టడి చేసింది. అది కొంచెం సేపు మాత్రమే. కాసేపటి తర్వాత ఆమెకు మళ్లీ అదే ఆలోచన వచ్చింది. ఆమె మళ్ళీ చాలా ప్రయత్నించి ఆ ఆలోచన రాకుండా చేసే ప్రయత్నం చేసింది. కానీ ఆ ప్రయత్నం ఫలించలేదు. ఆమె ప్రయత్నం చేసే కొద్దీ ఆ ఆలోచన మళ్లీ మళ్లీ రాసాగింది. దానితో ఆమె ఆ ఆలోచన రాకుండా కట్టడి చేసే ప్రయత్నం విరమించుకుంది. అంతేకాకుండా ఆ ఆలోచన గురించి ఆ మార్గంలో పిల్లలను కనడం గురించి తీవ్రంగా ఆలోచించింది. ఆ ఆలోచనను కార్యరూపంలో పెట్టాలని ఒక సారి, అది తప్పని ఒక సారి ఆమె మనసు సందిగ్ధంలో పడింది. చివరకు ఆ ఆలోచన తప్పయినా ఒప్పైనా దాన్ని కార్యరూపంలో పెట్టాలని ఆమె నిర్ణయించుకుంది.

అయితే ఆ ఆలోచనను కార్యరూపంలో పెట్టడం మామూలు విషయం కాదు. దానికి సాధారణంగా ఏ భర్త అంగీకరించడు. భర్తకు తెలియకుండా ఆలోచనను అమలు చేయడం సాధ్యం కాదు, అది మహా పాపం. అది చాలా క్లిష్టమైన సున్నితమైన అంశం. దానికి తన భర్తతో పాటు సత్య ప్రసాద్ గారు కూడా అంగీకరించాలి. మామూలుగా అయితే వాళ్ళిద్దరూ అంగీకరించే అవకాశం లేదు. ఆ ఇద్దరి అంగీకారం లేకుండా తన కోరిక నెరవేరే అవకాశం లేదు. తన ఆలోచన మొదట భర్త అంగీకరించాలి. కానీ తన ఆలోచన గురించి భర్తకు చెప్పడానికి ఆమె ధైర్యం చాలడం లేదు. ఎలా చెప్పాలో ఆమెకు తెలియడం లేదు. ధైర్యం చేసి చెబితే అతను ఎలా స్పందిస్తాడన్నది ఆమెకు అంతు పట్టలేదు . ఆ మాట వినగానే అతను కోపంతో ఉగ్రరూపం ధరించి తనను తిట్టవచ్చు కొట్టవచ్చు. తనను వదిలేయవచ్చు. ఇలా ఆలోచిస్తున్న ఆమెకు ఏం చేయాలో ఎలా చేయాలో ఏమీ అర్థం కాలేదు. అయితే ఏమీ చేయకుండా కూడా ఆమె ఉండలేక పోతూ వుంది. ఏదో ఒకటి చేసి తన అనుకున్న మార్గంలో సంతానాన్ని పొందాలని ఆమె తీవ్రమైన ఆలోచన చేసింది. ఆ ఆలోచనలో ఉండే సాధక బాధకాల గురించి మరింతగా దీర్ఘంగా ఆలోచించింది. ఎంత ఆలోచించినా అది నెరవేరుతుందనే ఆశ ఆమెకు కనిపించలేదు. తన బ్రతుకింతేనా? సంతానం లేకుండా గొడ్రాలుగా జీవచ్ఛవంలాగా బ్రతికినంత కాలం జీవించవలసిందేనా, ఏం చేయాలి, ఎలా చేయాలి అని ఆమె ఆలోచనలతో సతమతమవుతూ వుంది. ఆమెకు అన్నమూ నీరు సహించడం లేదు. నిద్ర పట్టడం లేదు. ఆ ఆలోచనలతో దిగులుతో ఆమె రోజు రోజుకు కృశించిపోతూ వుంది. ముఖం పాలిపోయి ఉంది. కళ్ళు గుంటలు పడ్డాయి. దేని మీద ఆమెకు శ్రద్ధ ఉండటం లేదు. రాత్రిపూట నిద్ర పట్టక శూన్యంలోకి చూస్తూ ఉంది. ఆమెకు కలత నిద్ర మాత్రమే పడుతూ వుంది. కలత నిద్రలో ఆమె “కమల చాలా అదృష్టవంతురాలు, కాపురానికి వచ్చిన నాలుగు నెల్లకే సత్య ప్రసాద్ గారి ద్వారా గర్భవతి అయింది. కమల లాగే నేను కూడా గర్భవతిని కావాలి” అని పలవరిస్తూ ఉంది

6 వ అధ్యాయం

పిల్లల కోసం ధరణి పడుతున్న బాధను, తీవ్రమైన వేదనను చూసి పాండురంగరాజు తట్టుకోలేకపోయాడు. ఎంతగా ఓదార్చిన ఆమె ఆ దిగులు

నుంచి బయటపడలేకపోతూ వుంది. అతనికి ఏం చేయాలో తోచడం లేదు. ఆమె చివరకు పిచ్చిదైపోతుందేమోనని అతను భయపడసాగాడు. ఆమె నిద్రలో పలవరిస్తున్న మాటలను కొద్ది రోజులుగా వింటూ వున్నాడు. ఆ మాటలు విన్న తర్వాత ధరణికి సంతానం కలగడానికి అతనికి ఒక మార్గం కనిపించింది. అది సత్య ప్రసాద్ ద్వారా ధరణి సంతానాన్ని కనే ప్రయత్నం చేయడం. దాన్ని గురించి అతను తీవ్రంగా ఆలోచించాడు.

ఆ మార్గంలో పిల్లలను కనడానికి ధరణి ఒప్పుకోవాలి. ఆమె అంగీకరించినప్పటికీ ఆ మార్గంలో పిల్లలను కనడానికి తాను పెద్దమనసుతో అంగీకరించాలి. అంత పెద్ద మనసు, విశాలమైన మనసు తనకుందా?ఒకవేళ ఇప్పుడు తన భార్య మీద ప్రేమతో ఆ మార్గానికి అంగీకరించి పిల్లలు పుడితే, పుట్టే పిల్లలను తన పిల్లలుగా తను స్వీకరించగలడా? వారిని ప్రేమతో సంతోషంగా ముద్దాడగలడా? తాను ధరణి అంగీకరించినప్పటికీ సత్యప్రసాద్ దీనికి అంగీకరిస్తాడా? అతను చాలా నైతిక నిష్ఠ కలిగిన వ్యక్తి. దీన్ని అతను తప్పనిసరిగా అనైతికమైనదిగా భావించే అవకాశం ఉంది. అదీ గాకుండా ఈ మార్గం నేడు చులకనగా పరిగణించబడుతూ వుంది. ఈ మార్గంలో పిల్లలను కంటే అది బయటికి తెలిస్తే తనను, తన భార్యను, పుట్టిన పిల్లలను కూడా లోకం చాలా నీచంగా చూస్తుంది. అలా అని ఏ ప్రయత్నం చేయకుండా వదిలేస్తే ప్రాణ సమానమైన తన ప్రియమైన భార్య ధరణి పిచ్చిదైపోయి తనకు దక్కకుండా పోయే అవకాశం ఉంది. అప్పుడు ఆమె లేకుండా తాను ఒంటరిగా జీవించగలడా? ఎట్టి పరిస్థితుల్లోనూ జీవించలేడు. కాబట్టి ఎవరేమనుకున్నా తాను పెద్ద మనసుతో ఆ మార్గంలో ధరణి పిల్లల్ని కనటానికి గట్టి ప్రయత్నం చేయాలని అతను నిశ్చయించుకున్నాడు. తన భార్యను బతికించుకోవడానికి ఆమెను సంతోష పెట్టడానికి ఆ మార్గంలో వెళ్లడం తప్ప తనకు మరొక దారి లేదని అతను ఒక నిర్ణయానికి వచ్చాడు. తన నిర్ణయాన్ని గురించి ధరణికి చెప్పాడు.

"ధరణీ, సంతానం కోసం నువ్వు పడుతున్న బాధను వేదనను నేను చూడలేకపోతున్నాను. ఇలాగే ఉంటే నీ ఆరోగ్యం పూర్తిగా చెడిపోతుంది. మానసికంగా నువ్వు ఏ స్థితికి వెళ్ళిపోతావోనని నాకు చాలా భయంగా వుంది. ఆలోచించగా ఆలోచించగా నీకు సంతానం కలగడానికి ఒక మార్గం కనిపిస్తూ

వుంది. ఆ మార్గం మామూలుది కాదు. భిన్నమైనది. దాన్ని గురించి చెప్పడానికి నాకు సంకోచంగా ఉంది. అది చెబితే నువ్వు ఎలా స్పందిస్తావోనని నేను ఆలోచిస్తున్నాను. నువ్వు చెప్పమంటే ఆ మార్గం గురించి చెబుతాను'' అని పాండురంగరాజు అన్నాడు.

“సంతానం కలుగుతుందంటే నేను ఎలాంటి కష్టమైనా భరించడానికి సిద్ధంగా ఉన్నాను. ఆ మార్గం ఎంత కష్టమైనదైనా నేను ఆచరిస్తాను. సంతానం కలుగుతుందంటే నేను చనిపోవడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. ఆ మార్గం ఏమిటో చెప్పండి, తప్పకుండా నేను ఆచరిస్తాను'' ధరణి చెప్పింది.

“గత ఏడు సంవత్సరాలుగా నాతో కాపురం చేస్తున్నావు. నా వల్ల నీకు సంతానం కలగలేదు. మన సత్యప్రసాద్ గారి వల్ల నీకు సంతానం కలగవచ్చు. నువ్వు అంగీకరిస్తే ఆ మార్గం ద్వారా మనం ప్రయత్నం చేద్దాం'' అన్నాడు పాండు.

అతని మాటలు విన్న ధరణి ఆశ్చర్యంతో నిశ్చేష్టురాలయింది. కాసేపు ఏమీ మాట్లాడలేకపోయింది. తన సంతోషం కోసం అతను అంత గొప్ప త్యాగానికి పూనుకోవడం ఆమెకు నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించింది. కన్నీరు కారుతూ ఉండగా ఆమె భర్త పాదాలకు సాష్టాంగ సంస్కారం చేసి గద్గద స్వరంతో ఇలా చెప్పింది.

“మీరు దేవుడు, నా సంతోషం కోసం నా ఆరోగ్యం కోసం మీరు ఈ నిర్ణయానికి వస్తారని నేనూహించలేదు. ఏ భర్త గూడా ఇంత విశాల హృదయంతో తన భార్యను గురించి ఆలోచించడు. నా మీద మీకు చాలా ప్రేమ ఉందని నాకు తెలుసు. కానీ ఇంత ఎక్కువ ప్రేమ ఉందని నేను ఇప్పుడే తెలుసుకున్నాను. మీరు చెప్పిన ఈ ఆలోచన నాకు కూడా వచ్చింది. దీన్ని చెబితే మీరు ఎలా స్పందిస్తారో అని చెప్పలేకపోయాను. కానీ ఈ మార్గం అనైతికమైనది. ఎవరికైనా తెలిస్తే మనల్ని గురించి నీచంగా మాట్లాడుకుంటారు. మన సంతానాన్ని గురించి కూడా నీచంగా మాట్లాడుతారు. అందువల్ల ఈ మార్గం నాకు మంచిదిగా అనిపించడం లేదు'' అని ఆమె చెప్పింది.

“ఇది నైతికమా, అనైతికమా, అనేది ముఖ్యం కాదు. దాన్ని గురించి మనం ఆలోచించనవసరం లేదు. ఇతరులు ఏమనుకుంటారు అన్నది కూడా

ముఖ్యం కాదు. మనకు ఏమి కావాలి అనేది ముఖ్యం. ఇతరులకు అపకారం కానంతవరకు మనం మన కోసం ఏదైనా చేసుకోవచ్చు. నీకు నీ కడుపున పుట్టిన పిల్లలు కావాలి. దానికి ఇది తప్ప వేరే మార్గం కనిపించడం లేదు. ఈ మార్గం కొత్తది కాదు. గతంలో మన దేశంలో ఉన్నదే, భారతంలో పాండవుల పుట్టుక ఈ పద్ధతిలోనే జరిగింది. ఒక ముని శాపం కారణంగా పాండురాజు తన భార్యలైన కుంతి, మాద్రీ లతో శారీరకంగా కలిసే అవకాశం లేకపోయింది. తన వంశోద్ధరణకు సంతానం కావాలని అతను తన భార్యలను కోరాడు. అతని కోరికననుసరించి కుంతీదేవి యమధర్మరాజు వల్ల ధర్మరాజును, వాయుదేవుని వల్ల భీమున్ని, దేవేంద్రుని వల్ల అర్జునున్ని కనింది. మాద్రీదేవి అశ్వినీ దేవతల వల్ల నకుల సహదేవులను కనింది. ఈ ఐదుగురు కుమారులను పాండురాజు తన సొంత కుమారులుగానే భావించాడు. కురుక్షేత్ర యుద్ధానంతరం వీరిలో పెద్దవాడైన ధర్మరాజు హస్తినాపుర సామ్రాజ్యానికి రాజు అయ్యాడు. ధృతరాష్ట్ర పాండు రాజుల పుట్టుక కూడా అలాంటిదే. అందువల్ల నైతికత, అనైతికత అనే విషయాలు పక్కన పెట్టి ఈ పద్ధతికి నువ్వు అంగీకరిస్తే తర్వాత జరగవలసిన విషయం గురించి మనం ఆలోచిద్దాం'' పాండురంగరాజు చెప్పాడు.

"సరే, మీరు చెప్పినట్లుగా నేను నైతికతను గురించి మాట్లాడను. కానీ ఈ పద్ధతిలో నాకు కలిగిన సంతానాన్ని మీరు సొంత బిడ్డలుగా స్వీకరించగలరా? వారిని ఎత్తుకొని ఎలాంటి అరమరికలు, సంకోచాలు లేకుండా ముద్దాడగలరా? ఈ పద్ధతిలో నాకు సంతానం కలిగిన తర్వాత మనిద్దరి మధ్య పొరపచ్చాలు, అభిప్రాయ భేదాలు, గొడవలు రావచ్చు. అది నాకు ఏమాత్రం ఇష్టం లేదు'' ఆమె చెప్పింది.

ధరణి చెప్పిన మాటలను విన్న తర్వాత పాండురంగరాజు ప్రేమతో ఆమెను దగ్గరగా తీసుకొని "ధరణీ,ఈ విషయంలో నీకు ఎలాంటి చింత అవసరం లేదు. నీకు కలిగిన సంతానాన్ని నా సొంత సంతానంగా భావిస్తానని ప్రమాణపూర్వకంగా చెబుతున్నాను. నా నుంచి ఈ విషయంలో ఎలాంటి సమస్యలు ఇప్పుడు గానీ భవిష్యత్తులో గానీ రావు. అంతే కాదు ఈ విషయం నీకు, నాకు, సత్యప్రసాద్ గారికి తప్ప నాలుగో మనిషికి తెలియకుండా నేను అన్ని జాగ్రత్తలు తీసుకుంటాను. నన్ను నమ్మ , నీవు సుఖంగా సంతోషంగా

ఉండటమే నాకు కావాల్సింది, పిల్లలంటే నాకు గూడా ఇష్టమే, నీకు పుట్టిన సంతానాన్ని నేను త్రికరణశుద్ధిగా సంతోషంగా నా సొంత సంతానంగా స్వీకరిస్తాను. ఇక దీని గురించి నువ్వు ఎలాంటి అనుమానాలు, దిగులు పెట్టుకోవద్దు. ఇంకొక కారణం చేత గూడా నేను ఈ ఆలోచనకు వచ్చాను. నేను నీకంటే ఆరు సంవత్సరాలు పెద్దవాన్ని. నా ఆరోగ్యం కూడా అంత మంచిగా లేదు. తప్పనిసరిగా నేను నీకంటే ముందుగానే చనిపోతాను. నా తర్వాత నీవు ఒంటరిగా జీవించడం కష్టం. నీ కడుపున పుట్టిన సంతానమైతేనే నిన్ను జాగ్రత్తగా చూడగలరు. ఈ కారణం చేత గూడా నీకు సంతానం కలగడానికి నేను ఈ మార్గాన్ని ఎంచుకున్నాను, కాబట్టి ఇంక నువ్వు ఏమీ ఆలోచించకుండా దీనికి సమ్మతి తెలియజేస్తే మనం తర్వాత విషయాల గురించి ఆలోచించకుందాం'' అని అతను చెప్పాడు.

“మీరు అలా అనవద్దు, నేనే మీకంటే ముందుగా పునిస్త్రీగా చనిపోవాలని కోరుకుంటాను. నా పట్ల మీరు చూపుతున్న ప్రేమ, ఆదరణ, అభిమానం నాకు చాలా సంతోషాన్ని కలిగిస్తూవుంది. జన్మ జన్మలకు మీ ఋణం తీర్చుకోలేను. మీరు చెప్పినట్లుగా సత్యప్రసాద్ గారి వల్ల సంతానాన్ని పొందే ప్రయత్నం చేద్దాం. కానీ మన ఈ ప్రతిపాదనకు సత్యప్రసాద్ గారు అంగీకరిస్తారా? నాకు అనుమానమే, ఎందుకంటే ఆయన చాలా నైతికనిష్ఠ గల వ్యక్తి. దీన్ని తప్పనిసరిగా ఆయన అనైతికంగా భావిస్తారు. అనైతికమైన పని ఆయన చేస్తారని నేను అనుకోను'' ధరణి చెప్పింది.

“నువ్వు చెప్పింది నిజమే, కానీ మనకు వేరే మార్గం లేదు. తప్పనిసరిగా ఆయన్ని ఒప్పించాల్సిందే. నేను ఆయనతో మాట్లాడి అతన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తాను'' అన్నాడు పాండురంగరాజు.

“మీరు మాట్లాడొద్దు, ఇది చాలా సున్నితమైన అంశం. మీరు మాట్లాడినప్పుడు ఆయన కాదంటే మీకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. అందువల్ల నేనే ఆయనతో మాట్లాడుతాను. స్త్రీగా ఈ విషయం గురించి మాట్లాడటం నాకు కొంచెం ఇబ్బందే, అయితే ఆయన నాకు బీ.ఏ పాఠాలు చెప్పారు కాబట్టి ఆయనతో మాట్లాడే చనువు నాకుంది. కాబట్టి నేనే మాట్లాడుతాను. సాధారణంగా స్త్రీలు ఏదైనా కోరితే పురుషులు కాదనలేరు.

ఎలాగైనా అతన్ని ఒప్పిస్తాను. ఒప్పిస్తాననే నమ్మకం నాకుంది, ఈ విషయం నాకు వదిలేయండి.'' అన్నది ధరణి.

పాండురంగరాజు దానికి అంగీకరించాడు. ధరణి దిగులు వదిలివేసి సంతోషంతో ఉత్సాహంగా ఉంది. ఆమె కళ్ళు మెరిసాయి. ఆమె సంతోషంగా ఉన్నందుకు అతను ఊపిరి పీల్చుకున్నాడు, సంతోషించాడు. అతను తన వ్యాపార పనుల్లో మునిగిపోయాడు.

తన ఆలోచనకు, తన కోరికకు అనుగుణంగా తన భర్త పాండురంగరాజు స్పందించినందుకు, ఆ ప్రస్తావన అతనే తెచ్చినందుకు ధరణి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయింది. తనను, తన కోరికను, తన మనస్సును అర్థం చేసుకున్న మంచి భర్త లభించినందుకు ఆమె దేవునికి అనేక ధన్యవాదాలు తెలియజేసింది. భర్త మీద ఆమెకు గౌరవం ప్రేమ అభిమానం రెట్టింపు అయ్యాయి. అదంతా కలలో జరిగినట్లుగా ఆమెకు అనిపించింది. ఎంతో కాలంగా సంతానం కోసం తపిస్తున్న తనకు తన భర్త ఒక మార్గాన్ని చూపించినందుకు ఆమె మనస్సు తన భర్త పట్ల మాటల్లో చెప్పలేనంత కృతజ్ఞతా భావంతో నిండిపోయింది.

ఈ విషయం గురించి సత్యప్రసాద్ గారితో ఎలా మాట్లాడాలి అనే విషయం గురించి ఆమె సుదీర్ఘంగా ఆలోచించింది. సత్య ప్రసాద్ ఆడవాళ్ళతో చనువుగా ఉండేవాడు కాదు. అతను స్త్రీలకు సాధ్యమైనంత దూరంగా ఉంటాడు. ధరణి కమలతో చాలా చనువుగా ఉండి వారి ఇంట్లోకి వెళ్ళి వంట గదిలోను మధ్య గదిలోను తిరుగుతూ స్నేహంగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఆ సమయంలో సత్యప్రసాద్ ఇంట్లో ఉంటే అతను మొదటి గదిలో కూర్చుని చదువుకుంటూ ఉంటాడు. వారిద్దరి మధ్య సంభాషణలో పాల్గొనేవాడు కాదు. అతను ధరణితో ఎప్పుడు చనువుగా మాట్లాడలేదు. బి.ఏ. చదువుకు సంబంధించిన విషయాలను ఆమెకు బోధించేటప్పుడు అతను చాలా జాగ్రత్తగా ఆమెను మీరు అని ధరణి గారు అని సంబోధిస్తూ పాఠాలు చెప్పేవాడు. అప్పుడప్పుడు ధరణి చనువు తీసుకుని మాట్లాడినా ఆయన పెద్దగా స్పందించేవాడు కాదు. ధరణి ఇదంతా గుర్తు చేసుకుంది. ఏది ఏమైనా ఎలాగైనా సత్యప్రసాద్ గారిని ఒప్పించి తన కోరిక నెరవేర్చుకోవాలని ధరణి గట్టిగా నిర్ణయించుకుంది.

7 వ అధ్యాయం

సత్యప్రసాద్ కళాశాల నుంచి వచ్చిన తర్వాత ధరణి తమ ఇంటికి వారి ఇంటికి మధ్యలో ఉన్న తలుపు తెరుచుకుని ఆయన దగ్గరికి వెళ్లింది. ఆమెను చూసి సత్యప్రసాద్ కంగారు పడ్డాడు. ధరణి సత్య ప్రసాద్ తో ఇలా మాట్లాడింది. ఆమె సత్యప్రసాద్ ను మాస్టారూ అని పిలుస్తూ ఉంటుంది.

" మాష్టారూ, కమల గారు ఎలా ఉన్నారు, ఆమె ఆరోగ్యం ఎలా ఉంది, కమల గారు వెళ్ళిపోయిన తర్వాత స్వయం పాకం వల్ల మీరు బాగా చిక్కిపోయారు. మా ఇంట్లో భోజనం చేయమని ఎంతగా చెప్పినా మీరు మామాట వినలేదు. మీకు మొహమాటం చాలా ఎక్కువ. ఇలా అయితే మీ ఆరోగ్యం బాగా దెబ్బతింటుంది" అన్నది.

"కమల బాగానే ఉంది, ఆమె ఆరోగ్యం కూడా బాగుంది. ఫోన్ చేసి ప్రతిరోజు ఆమె బాగోగులు తెలుసుకుంటున్నాను. మీరు రాజుగారు చాలా మంచివారు. మీ ఇంటి పక్కన మాకు ఇల్లు దొరికినందుకు నేను కమల చాలా సంతోషిస్తూ వున్నాం. మీరిద్దరూ చాలా సాయం చేసే గుణమున్నవారు. అందువల్ల మీరు నన్ను మీ ఇంట్లో భోజనం చేయమని అడిగారు. కానీ ఇతరులను ఇబ్బంది పెట్టడం నాకు ఏమాత్రం ఇష్టం ఉండదు. అందువల్ల నేను మీ కోరికను కాదన్నాను" అతను చెప్పాడు.

"మాష్టారు, నాకు ఒక పెద్ద సమస్య ఉంది. ఆ సమస్య వల్ల నేను చాలా బాధపడుతున్నాను. సతమతమవుతున్నాను. మనశ్శాంతి లేకుండా కృంగిపోతున్నాను. నా యీ సమస్య వల్ల మా వారు కూడా చాలా బాధపడుతున్నారు. మా వారికి తన వ్యాపార సంబంధమైన సమస్యలున్నాయి. వాటితోనే ఆయన ఇబ్బంది పడుతున్నారు. దానితోపాటు నా సమస్య వల్ల ఆయన ఆరోగ్యం పాడవుతూ వుంది. మేమిద్దరం ఈ సమస్య నుంచి బయటపడితేనే సుఖంగా సంతోషంగా ఉండగలం. మీరు నా యీ సమస్యను పరిష్కరించాలి. దాన్ని మీరు తీర్చాలి. అది మీరు తీర్చగలిగినదే, మీ చేతిలో ఉన్నదే, మీరు తీర్చగలిగిన, మీచేతనైన, మీచేతిలో ఉన్న నా యీ సమస్యను పరిష్కరిస్తానని మీరు మాట ఇస్తే ఆ సమస్య ఏంటో నేను మీకు చెబుతాను." అన్నది ధరణి.

“ధరణి గారూ, మీరు చాలా మంచివారు. మీలో ఇతరులకు సహాయం చేసే గుణం చాలా ఉంది. మా ఆవిడ కమలకు మీరు చాలా సహాయం చేశారు. మా ఆవిడ మీ మంచితనం గురించి, సాయం చేసే గుణం గురించి నాతో చాలా సార్లు చెప్పింది. మీవారు రాజుగారు కూడా చాలా మంచివారు. ఎంతో మంచి వారైనా మీ ఇద్దరికీ సమస్య రావడం నాకు చాలా బాధగా ఉంది. మీ సమస్యను నేను తీర్చగలిగితే అంతకంటే నాకు కావలసింది ఏముంది. మీ సమస్యను పరిష్కరించటం నా చేతిలో ఉంటే నిమిషాల్లో నేను మీ సమస్యను పరిష్కరించగలను. దయచేసి మీ సమస్య ఏమిటో చెప్పండి. మీ సమస్యను తీరుస్తానని మీకు మాట ఇస్తున్నాను.” అన్నాడు సత్యప్రసాద్.

“మాస్టారూ, నా సమస్యను తీరుస్తానని మాట ఇచ్చారు. నేను సమస్యను గురించి చెప్పిన తర్వాత మీరు ఇచ్చిన మాట తప్పకూడదు. ఇచ్చిన మాట తప్పకుండా మీరు తప్పనిసరిగా నా యీ సమస్యను తీర్చాలి. అది మంచిదైనా చెడ్డదైనా మీరు తప్పనిసరిగా తీర్చాలి. మీరు నా సమస్యను తీర్చడం వల్ల ఇతరులు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది గానీ నష్టం గానీ లేదు. అది మన ఇద్దరికి సంబంధించినది మాత్రమే. ఇతరులకు సంబంధించినది కాదు. అందువల్ల నా సమస్యను పరిష్కరించండంలో మీకు ఎలాంటి ఇబ్బంది అవసరం లేదు.” అన్నది.

“ధరణి గారూ, మళ్ళీ చెబుతున్నాను, మీరు చాలా మంచివారు, చాలా సింపుల్ గా ఉంటారు, మీలాగా సింపుల్ గా ఉండే వాళ్లంటే నాకు చాలా ఇష్టం. మీ మీద నాకు చాలా గౌరవముంది, అభిమానముంది. మీరు నా చేత చెడ్డ పని చేయిస్తారని నేను అనుకోవడం లేదు. మీ సమస్య చెడ్డదిగా నేను భావించడం లేదు. మీ సమస్య ఏంటో చెప్పండి, అది నా చేతనైతే ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలిగించినదీ నష్టం కలిగించినదీ అయితే తప్పనిసరిగా ఆ సమస్యను పరిష్కరిస్తాను” అన్నాడు సత్యప్రసాద్.

“మాస్టారూ, మీరు నాకు గట్టి హామీ ఇచ్చారు కాబట్టి నా సమస్యను చెబుతున్నాను. నాకు పెళ్లై దాదాపు ఏడు సంవత్సరాలు అవుతూ వుంది. ఇంతవరకు నాకు పిల్లలు కలగలేదు. పెళ్లయిన రెండో సంవత్సరం నుంచి సంతానం కోసం నేను అనేక రకాల ప్రయత్నాలు చేశాను. దానాలు ధర్మాలు

నోములు వ్రతాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్ళటం, ఆ క్షేత్రాల్లో స్నానం చేయటం, ఎన్నో రకాల మొక్కులు మొక్కుకోవడం మొదలైనవి ఎన్నో నేను మావారు చేశాం. సంతానం కోసం ఎవరు ఏమి చెప్పినా ఆ ప్రయత్నాలన్నీ చేశాం. అది కాకుండా ఐ.యు.ఐ ద్వారా ఐ.వీ.ఎఫ్ ద్వారా కూడా ప్రయత్నించాం. నా యీ ప్రయత్నంలో మా వారు రాజుగారు కూడా నాకు పూర్తిగా సహకరించారు. పిల్లలంటే నాకు చాలా ఇష్టం, మా వారికి కూడా పిల్లలంటే చాలా ఇష్టం. పిల్లలు లేని జీవితాన్ని నేను మా వారు కూడా ఊహించుకోలేకపోతున్నాం. ముఖ్యంగా నేను పిల్లలు లేకపోవడం చేత మానసికంగా చాలా కృంగిపోయి ఒక్కొక్కసారి ఆత్మహత్య చేసుకుని చనిపోదామనుకుంటున్నాను. కానీ ఆత్మహత్య మహాపాపమని ఆ ప్రయత్నం చేయడం లేదు. కమల గారు సంసారానికి వచ్చిన నాలుగు నెలల్లోనే మీవల్ల గర్భవతి అయ్యారు. అది చూసిన తర్వాత నేను కూడా మీ ద్వారా సంతానం పొందాలని చాలా కోరుకుంటున్నాను. మీ ద్వారా ప్రయత్నిస్తే నాకు సంతానం కలుగుతుందని చాలా నమ్మకంతో ఉన్నాను. నా ఈ కోరికను మన్నించి నాతో సంసారం చేసి నాకు సంతాన బిక్షపెట్టండి. సంతానం లేకపోవడమే నా సమస్య. మీరు నాతో శారీరకంగా కలిసి నాకు సంతానాన్ని కలిగించడమే మీరు నా సమస్యను పరిష్కరించడం. నేను మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నా ఆశను అడియాశ చేయకుండా నాకు సంతానాన్ని కలిగించండి. నా కోరికను నెరవేరుస్తారని, నెరవేర్చాలని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. దయచేసి నా యీ కోరికను మన్నించండి'' అని దైన్యంగా చెప్పింది ధరణి.

ఆమె మాటలు విన్న తర్వాత సత్యప్రసాద్ మొదట చాలా ఆశ్చర్య పోయాడు. ఆతర్వాత చాలా విచారంగా మొహం పెట్టి మౌనంగా ఉండి పోయాడు. ఏం మాట్లాడాలో అతనికి అర్థం కాలేదు. ఆమె ఇలాంటి కోరిక కోరుతుందని అతను అస్సలు ఊహించలేదు. ఆమె కోరిన కోరిక అతని దృష్టిలో చాలా అనైతికం. అలాంటి అనైతికమైన పని చేయడానికి అతను సిద్ధంగా లేడు. కానీ ఆమె సమస్య తీరుస్తానని మాట ఇచ్చాడు. ఇచ్చిన మాట నెరవేర్చకపోవడం కూడా అతని ఇష్టం లేదు. అతను చాలా సందిగ్ధంలో పడ్డాడు. అదే విషయాన్ని ఆమెకు చెప్పాడు.

“ధరణి గారూ, మీరు కోరరాని కోరిక కోరారు. మీరు ఇలాంటి కోరిక కోరుతారని నేను కలలో కూడా భావించలేదు. అసలు ఏ స్త్రీ కూడా ఇలాంటి కోరిక కోరుతుందని నేను అనుకోను. మీరు కోరిన కోరిక చాలా అనైతికం. అనైతికమైన పని చేయడానికి నా మనసు ఒప్పుకోదు, అంగీకరించదు. దయచేసి మీ కోరికను వెనక్కి తీసుకోండి. ఇంతకంటే నేను ఏమీ మాట్లాడలేను” అన్నాడు సత్యప్రసాద్.

అతని మాటలకు ధరణి పెద్దగా ఆశ్చర్యపోలేదు. అతని మనస్తత్వం ఆమెకు బాగానే తెలుసు. ఆమె అడిగిన కోరిక అతని మనస్తత్వానికి పూర్తిగా విరుద్ధమైనది. ఆమె కోరికను తీర్చడానికి అతను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఆమె నిరుత్సాహ పడకుండా మరింత ధైన్యంగా ఆమె తన కోరికను అతని మనస్సుకు ఎక్కేటట్లుగా చెప్పింది.

“మాస్టారూ, మీరు ఇలా అంటారని నాకు తెలుసు. మీరు చాలా నిజాయితీపరులు, నీతివంతులు, నేను అడిగిన ఈ కోరిక మీకు అనైతికంగా కనిపిస్తుందని నాకు తెలుసు. అయినప్పటికీ నాకు వేరే మార్గం లేకపోవడం చేత మిమ్మల్ని ఈ కోరిక కోరుతున్నాను. పిల్లలంటే నాకు చచ్చేంత ఇష్టం. పిల్లలు లేకుండా నేను జీవించలేను. పిల్లలు లేరనే బాధ నన్ను రోజు రోజుకు దహించి వేస్తూ వుంది. నాకు పిచ్చెక్కుతోంది. నన్ను ఈ పరిస్థితుల్లో చూసి నా భర్త రాజు గారు చాలా బాధపడుతున్నారు. ఏం చేయాలో ఆయనకు కూడా ఏమీ తెలియడం లేదు. మేమిద్దరం ఇలా కావడం మీకు నచ్చుతుందా? మీకు ఇష్టమేనా ?చెప్పండి. మాస్టారు దయచేసి నా బాధను అర్థం చేసుకోండి, నా పట్ల కనికరం చూపండి, నా ఆరోగ్యాన్ని మా వారి ఆరోగ్యాన్ని కాపాడండి. నాకు సంతాన బిక్షపెట్టమని మిమ్మల్ని మరీ మరీ బ్రతిమాలుతున్నాను” ధరణి చెప్పింది.

“ధరణి గారూ, నా మనసుకు విరుద్ధమైన కోరరాని కోరిక కోరి నన్ను చాలా ఇబ్బంది పెడుతున్నారు. నేను మీ బంధువును కాదు, మీ కులస్తున్ని గూడా కాదు. మనకు ఎలాంటి సంబంధమూ లేదు. అలాంటి నన్ను మీరు ఈ కోరిక కోరడం నాకు చాలా ఆశ్చర్యంగా, తగనిదిగా కనిపిస్తూ వుంది. మీ బంధువులు చాలా మంది ఇక్కడున్నారు, మీ కులస్తులు కూడా చాలామంది

ఇక్కడ ఉన్నారు. వాళ్ళందర్నీ వదిలేసి నన్ను మాత్రమే ఎందుకు ఈ కోరిక కోరుతున్నారు" అన్నాడు సత్యప్రసాద్.

"మీరు మా కులస్తులు కాకపోవచ్చు, బంధువులు కాకపోవచ్చు. నాకు తెలిసినంతలో మా బంధువుల్లో గానీ మా కులస్తుల్లో గానీ మీలాంటి ఉత్తములు, నిజాయితీపరులు, నీతివంతులు ఎవరూ లేరు. మన మధ్య బంధుత్వం లేకపోయినా స్నేహబంధం ఉంది. నా దృష్టిలో కుల బంధువుల కంటే స్నేహబంధం చాలా గొప్పది. మీరు నా ప్రియమైన స్నేహితురాలు కమల గారి భర్త. చాలా తక్కువ కాలంలోనే నేను కమల మంచి స్నేహితులమయ్యాం. ఒకే మనస్తత్వం కలిగిన వాళ్లు చాలా తక్కువ కాలంలోనే మంచి స్నేహితులవుతారు. కమల గారు నేను ఒకే మనస్తత్వం ఉన్నవాళ్లం. అందువల్లనే చాలా తక్కువ కాలంలోనే మేమిద్దరం చాలా మంచి స్నేహితులమయ్యాం. మీ మీద కూడా నాకు చాలా స్నేహభావముంది. మీ తెలివితేటలు, మంచితనం, నిరాడంబరత్వం నాకు చాలా ఇష్టం. మీరంటే నాకు చాలా అభిమానం. నేను కమలతోపాటు మీతో కూడా స్నేహం చేయాలని చాలా ప్రయత్నించాను. నేను స్త్రీని కావడం చేత మీరు నన్ను దూరంగా ఉంచుతున్నారు. మీరు ఇక్కడికి వచ్చినప్పటి నుంచి మిమ్మల్ని చాలా బాగా గమనిస్తున్నాను. నిజంగా మీలాగా ఇంత మంచిగా ఇంత నిరాడంబరంగా, నిజాయితీగా ఎవరైనా ఉండగలరా అని నేను ఆశ్చర్యపోతూ ఉంటాను. నేను ముఖస్తుతి కోసం ఈ మాటలు చెప్పడం లేదు. మిమ్మల్ని చాలా దగ్గరగా గమనించి మనస్ఫూర్తిగా చెబుతున్న మాటలు ఇవి. నేనే కాదు మిమ్మల్ని దగ్గరగా చూసిన వాళ్లు, గమనించిన వాళ్ళు మీ మంచితనానికి ప్రవర్తనకు మీ నడకకు మిమ్మల్ని ఇష్టపడకుండా, అభిమానించకుండా ఉండలేరు. అంత ఉన్నతమైన వ్యక్తిత్వం మీది. అంతేకాకుండా నేను కోరిన కోరిక చాలా రహస్యంగా ఉండాలి. మన మధ్య జరగబోతున్న సంబంధాన్ని మీరు రహస్యంగా ఉంచుతారని నేను నూటికి నూరుపాళ్ళు నమ్ముతున్నాను. అందువల్ల మాస్టారు దయచేసి నా కోరిక మన్నించండి. నాకు సంతానాన్ని ప్రసాదించి నా సమస్యను పరిష్కరించండి. నన్ను సంతోష పెట్టండి, తద్వారా మా వారిని కూడా సంతోషపడేలాగా చేయండి. నా సమస్యను పరిష్కరిస్తానని మాట ఇచ్చారు, ఇచ్చిన మాట తప్పుతారా ?

మీలాంటి మంచివాళ్లు ఇచ్చిన మాట తప్పరు. తప్పకుండా మాట నిలబెట్టుకుంటారు'' అన్నది ధరణి.

“మీరు ఇలాంటి కోరిక కోరతారని తెలిసి ఉంటే నేను మాట ఇచ్చేవాన్నే కాదు. నా ముందరి కాల్లకు బంధం వేశారు మీరు. ఒకవేళ నేను మీ కోరిక ప్రకారం మీతో సంబంధం పెట్టుకుంటే లోకులు దాన్ని అక్రమ సంబంధం అంటారు. అయితే నేను ఆ మాట అనను, ఇలాంటి సంబంధాన్ని వివాహేతర సంబంధం అంటాను. మన సంబంధం మీ వారు రాజు గారికి తెలిస్తే మనిద్దరి గురించి వారు ఏమనుకుంటారు? ఎంతగా బాధపడతారు? మనల్ని ఎంత నీచంగా చూస్తారు, ఆలోచించారా'' అన్నాడు సత్యప్రసాద్.

“మాస్టారూ, మీరు మా వారి గురించి ఆలోచించనవసరం లేదు. నిజానికి ఈ ఆలోచన మా వారిదే. నాకు కూడా ఈ ఆలోచన వచ్చింది కానీ, మీ ద్వారా సంతానం పొందాలన్న విషయం గురించి నేను వారికి చెబితే వారు ఎలా స్పందిస్తారో అని నేను వారితో చెప్పలేదు. సంతానం లేకపోవడం చేత నేను పడుతున్న బాధను గమనించి, నా మీద ఎంతో ప్రేమ ఉన్న మావారు మీ ద్వారా సంతానం పొందాలని ఆయనే నాకు చెప్పారు. ఈ విషయం గురించి ఆయనే మిమ్మల్ని అడుగుతామన్నారు. కానీ నేనే వద్దన్నాను. నేనే అడుగుతానని వారికి చెప్పాను. వారి అనుమతి తీసుకునే నేను మిమ్మల్ని ఈ కోరిక కోరుతున్నాను'' అన్నది ధరణి.

ఆమె చెప్పింది విన్న తర్వాత భార్య కోరికను ఇంతగా మన్నించేవాళ్లు, ఇంత విశాల హృదయం గల భర్తలు ఉంటారా అని అతను చాలా ఆశ్చర్యపోయాడు. అదే విషయాన్ని ఆమెతో చెప్పాడు.

“ధరణి గారూ, మీరు చాలా అదృష్టవంతులు, మిమ్మల్ని ఇంతగా ప్రేమించే విశాలమైన హృదయం కల మంచి భర్త లభించడం నిజంగా మీ అదృష్టం. నేను మగవాన్ని కాబట్టి మగవాళ్ళ మనస్తత్వం నాకు బాగా తెలుసు. తనకు పుట్టని సంతానం మీద సాధారణంగా ఏమగవాడికి ప్రేమ పుట్టే అవకాశం లేదు. ఈర్ష్య, ద్వేషం, అసూయ కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రాజుగారు మీ బాధ చూడలేక ఇప్పుడు మన ఈ సంబంధానికి అంగీకరించినా మీకు సంతానం కలిగిన తర్వాత ఆ సంతానాన్ని అతను సంతోషంగా

మనస్ఫూర్తిగా స్వీకరించగలడా? అనేది నాకు అనుమానంగా ఉంది. ఆ సంతానం తనకు పుట్టలేదని స్పష్టంగా తెలిసిన తర్వాత పైకి మామూలుగా కనిపించినా లోలోపల అతను కృంగిపోయే అవకాశం ఉంది. సంతానం కలిగిన తర్వాత ఇలాంటి సమస్య వస్తే మీరు, మీ భర్త భరించలేరు. మీమధ్య గొడవలు రావచ్చు. ఆ పుట్టిన సంతానం కూడా సమస్యల్లో పడవచ్చు. అన్నెం పుణ్యాం తెలియని ఆ సంతానం సమస్యల పాలు కావడం, నా కారణంగా మీ భార్య భర్తల మధ్య తగాదా రావటం నాకు ఇష్టం లేదు. ఇందులో ఉన్న సమస్య మీకు తెలియంది కాదు. ఈ సమస్య ఇప్పుడు పెద్ద సమస్యగా కనపడకపోవచ్చు. కానీ సమస్య అంటూ వస్తే ఇది చాలా తీవ్రమైన సమస్య . ఈ సమస్య వల్ల రహస్యంగా ఉన్న మన సంబంధం బట్టబయలవుతుంది. దానివల్ల మరిన్ని సమస్యలు వస్తాయి. దీనికి పరిష్కారం కూడా దాదాపుగా లభించదు. అందువల్ల ఇది ఆచరణ యోగ్యం కాదని నాకు అనిపిస్తూ ఉంది. దీన్ని గురించి మనం చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి'' అన్నాడు సత్యప్రసాద్.

“మాస్టారూ, మీరు నిజంగా చాలా గొప్పవారు, మీరు ఈ సమస్య గురించి ప్రస్తావించడం వల్ల నా మనసులో మీ స్థానం మరింత ఉన్నతంగా పెరిగిపోయింది. సాధారణంగా నాలాంటి అందమైన స్త్రీ వచ్చి పొందు కోరితే వేరే ఏ మగవాడైనా వెంటనే సంతోషంతో ఎగిరి గంతులేస్తాడు. కానీ మీరు ఇలాంటి సంబంధాల వల్ల వచ్చే సమస్యలను గురించి, పుట్టబోయే సంతానానికి కలిగే సమస్యల గురించి ఎంతో లోతుగా ఆలోచిస్తున్నారు. నిజంగా మీ లాంటి మంచివాడు మగవాళ్ళల్లో ఉండడం చాలా అరుదు. కానీ మాస్టారు మీకు ఈ విషయంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. మీతో సంబంధాన్ని గురించి మా వారు నాతో ప్రస్తావించినప్పుడు నేను ఈ సమస్యను గురించి చాలా కూలంకషంగా మా వారితో చర్చించాను. ఇప్పుడు మీరు చెప్పిన సమస్యలన్నింటినీ నేను ఆయన ముందు పెట్టాను. మా వారు ప్రమాణ పూర్వకంగా నాకు చాలా గట్టిగా హామీ ఇచ్చారు. మీ ద్వారా నాకు కలగబోతున్న సంతానాన్ని తనకు పుట్టిన సంతానంగా త్రికరణశుద్ధిగా స్వీకరిస్తానని ఆయన నాకు ప్రమాణం చేసి చెప్పారు. తన వల్ల భవిష్యత్తులో ఎలాంటి సమస్య రాదని చాలా గట్టిగా నాకు బోధ చేశారు. హామీ ఇచ్చారు. ఆయన చెప్పిన మీదటనే మీతో సంబంధానికి నేను అంగీకరించాను. కాబట్టి మీరు ఈ

విషయంలో నిశ్చింతగా ఉండవచ్చు. భవిష్యత్తులో దీనివల్ల ఎలాంటి సమస్యలు రావని నేను గట్టిగా హామీ ఇస్తున్నాను. అలాంటి హామీ మా వారు నాకు ఇచ్చారు. కాబట్టి మీరు దీని గురించి ఎలాంటి చింత పెట్టుకోవద్దు'' అని ఆమె చెప్పింది.

"మన ఈ సంబంధం గురించి నాలుగో వ్యక్తికి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియకూడదు. నా నుంచి ఈ విషయం బయటికి పొక్కే అవకాశమే లేదు. నేను ఎవరికీ చివరకు కమలకు కూడా చెప్పను. అలాగే మీరు కూడా దీని గురించి ఎవరికీ చెప్పకూడదు. ఈ విషయం గురించి మీ భర్త రాజు గారికి కూడా గట్టిగా చెప్పండి. అంతేకాకుండా మీకు బాబు గానీ పాప గానీ ఎవరో ఒకరు పుట్టేంతవరకు మాత్రమే మీతో ఈ సంబంధాన్ని కొనసాగిస్తాను. ఆ తర్వాత ఈ సంబంధాన్ని నేను వదిలి వేస్తాను. ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించను. దీనికి మీరు అంగీకరించాలి'' ఉన్నాడు సత్యప్రసాద్.

"మీకు, నాకు, మా రాజు గారికి తప్ప మన ఈ సంబంధం గురించి ఎవరికీ తెలియనివ్వనని నేను ఒట్టుపెట్టి చెబుతున్నాను. ఈ విషయం గురించి కూడా నేను మా వారు మాట్లాడుకున్నాం. మా నుంచి మన సంబంధం విషయం బయటికి పొక్కే అవకాశమే లేదు. కాబట్టి దీని గురించి కూడా మీరు ఎలాంటి అనుమానం పెట్టుకోవద్దు. మీరు చెప్పినట్లుగా నాకు అబ్బాయి గానీ అమ్మాయి గానీ ఎవరో ఒకరు చాలు. అంతకంటే ఎక్కువ సంతానం నాకు అవసరం లేదు. మీ వల్ల ఒకరు పుట్టిన తర్వాత మీరు నాతో ఈ సంబంధాన్ని కొనసాగించినవసరం లేదు. ఆ మాట కూడా నేను మీకు ఇస్తున్నాను'' అని ధరణి చెప్పింది.

"ఈ విషయం గురించి మీరు నా సందేహాలన్నీ తీర్చారు. మన ఈ సంబంధానికి ముఖ్యంగా మీ వారి అనుమతి ఉంది కాబట్టి నేను మీతో సంబంధం పెట్టుకోవడానికి అంగీకరిస్తున్నాను. కానీ మీ మీద ఇష్టం లేకుండా, ప్రేమ లేకుండా మీతో శారీరకంగా కలవడం ఎలాగా?'' అన్నాడు సత్యప్రసాద్.

"ఏం, నేను అందంగా లేనా? మీ ఆవిడ కమల గారి లాగా నేను కూడా సన్నగా అందంగానే ఉన్నాను. మేమిద్దరం బజార్లో నడుస్తుంటే కొంతమంది మమ్మల్ని ఇద్దరినీ అక్కా చెల్లెళ్ళు అనుకున్నారు. నేను ముసలి దాన్ని కాదు,

మీ కంటే ఒక సంవత్సరం చిన్నదాన్ని, యవ్వనంలో ఉన్నాను, నన్ను చూస్తే మీకు ప్రేమ పుట్టదా? కోరిక కలగదా?'' అన్నది సిగ్గుతో అతని వైపు కొంటెగా చూస్తూ.

ఆమె మాటలకు చూపుకు సత్యప్రసాద్ చిరునవ్వు నవ్వి సరే అన్నాడు. తన కోరికను మన్నించి తనతో సంసారం చేయడానికి అతను అంగీకరించినందుకు ధరణి చాలా సంతోషించింది. సత్యప్రసాద్ గారితో తాను చేసిన సంభాషణ మొత్తం ఆమె భర్తకు చెప్పింది. ఆయన కూడా చాలా సంతోషించాడు. పాండురంగరాజు వారిద్దరికీ ఏకాంతం కలిగించడానికి ఆ రోజే వ్యాపారం పని మీద వేరే ఊరికి వెళ్ళిపోయాడు.

8 వ అధ్యాయం

ఆ రోజు నుంచే ధరణి సత్యప్రసాద్ తో పక్క పంచుకుంది. మొదటి రోజు అతని ధాటికి ఆమెకు మూర్ఛ వచ్చినంత పని అయింది. తన్మయత్వంతో వొళ్ళు మరచి పరవశించిపోయింది. చూడడానికి అమాయకంగా కనిపించే అతను శృంగారంలో మంచి ఉద్దండుడని ఆమె గ్రహించింది. అతని మనస్తత్వానికి విరుద్ధంగా కోరరాని కోరిక కోరడం చేత అతను కోపంతో శృంగారంలో తన మీద ఆవిధంగా ఉద్దండంగా విజృంభిస్తున్నాడని ఆమె భావించి అదే విషయాన్ని అడిగింది. దానికి అతను ఆమె మీద తనకు ఎలాంటి కోపం లేదని, శృంగారంలో తన ప్రవర్తన అలాగే ఉంటుందని చెప్పాడు. అతనితో సంభోగం ఆమెకు చాలా సుఖాన్ని, సంతృప్తిని పరమానందాన్ని ఇచ్చింది. ఆమె కొత్త కొత్తగా అలంకరించు కోవడం మొదలు పెట్టింది. ఆమె ముఖంలో శరీరంలో ఒక వింత మార్పు వచ్చింది. అసలే ఎర్రగా ఉన్న ఆమె శరీరం మరింత ఎరుపు దేలింది. ఆమె ముఖం కళకళలాడుతూ వుంది. బుగ్గలు ఎరుపెక్కాయి. కళ్ళల్లో వింత మెరుపు వచ్చింది. అతనితో శృంగారం వల్ల తన జీవితం ధన్యమైనట్లుగా ఆమె భావించింది. తనకు తానుగా కోరి ఆమె రోజుకు ఒకటి కంటే ఎక్కువ సార్లు అతనితో శృంగారంలో పాల్గొంది. ఆమె కోరినప్పుడల్లా అతను ఆమె కోరికను తీర్చాడు. ఇది నైతికమా అనైతికమా అని ఆమె ఆలోచించలేదు. ఆమెకు కావలసింది సంతానం, దాన్ని గురించి

మాత్రమే ఆమె ఆలోచించింది. ఆ ఆలోచన ప్రకారం ఆమె నడుచుకుంది. దానికి ఆమె భర్త సహకారం సంపూర్ణంగా లభించింది. సత్య ప్రసాద్ కూడా అది నైతికమా అనైతికమా అని ఆలోచించలేదు. ఒక స్త్రీ తనకు తానుగా వచ్చి తనకు సంతానం కలిగించమని కోరితే దాన్ని అంగీకరించకపోవడం మంచిది కాదు అనే ఉద్దేశంతోనూ, దానికి ఆమె భర్త అనుమతి ఉండడం చేత, ఆమె సమస్య తీరుస్తానని ముందుగా మాట ఇచ్చిన కారణం చేత తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ఆమెకు సంతానం కలిగించడానికి ఆమెతో ఆ సంబంధాన్ని కొనసాగించాడు.

ఆ రోజు నుంచి ఆమె సత్యప్రసాద్ ను వంట చేసుకోనివ్వలేదు. ఆమె ఎంతో ప్రేమతో అతనికి నచ్చిన వంటకాలతో అతనికి భోజనం పెడుతూ వచ్చింది. ఆమె ఎంతో ప్రేమతో చేసిన రుచికరమైన వంటకాలను అతను చాలా సంతోషంగా తింటూ వచ్చాడు. వారి యీ సంబంధం ఎవరికీ తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే వారి రెండిళ్ల మధ్య మధ్యగదిలో ఉన్న తలుపు ద్వారా ఆమె తన కార్యక్రమాలన్నీ చేస్తూ వచ్చింది. వారి మధ్య ఆ సంబంధం ఏర్పడిన తర్వాత కూడా సత్యప్రసాద్ ఆమెను "మీరు అని, ధరణి గారు" అని ఎంతో గౌరవంగా పిలిచేవాడు. అతను ఏనాడు ఆమెను ఏకవచనంతో పిలువలేదు. అతని ఆ సంస్కారం మంచితనం ధరణికి అతని మీద మరింత గౌరవాన్ని కలిగించింది. సత్య ప్రసాద్ ఆ సంబంధాన్ని గురించి ఎవరికీ చెప్పలేదు, చివరకు తన భార్యకు కూడా.

తొమ్మిదో నెల గడిచి పదో నెల ప్రారంభమైన పది రోజులకు కమల మగ పిల్లవాణ్ణి కనింది. ధరణి చాలా సంతోషించింది, సత్యప్రసాద్ సంతోషానికి హద్దులు లేవు. పాండురంగరాజు కూడా చాలా సంతోషించాడు. సత్యప్రసాద్ వెళ్లి తన కుమారున్ని చూసి వచ్చాడు. కుమారునికి సత్య ప్రకాశ్ అనే పేరు పెట్టాడు. బాబుకు మూడో నెల ముగుస్తున్నప్పుడు కమల బాబును తీసుకొని వచ్చింది. బాబు చాలా అందంగా ముచ్చట గొలుపుతూ ఉన్నాడు. ఆ బాబును చూసి ధరణి తన సొంత కుమారుని లాగానే భావించి ఎత్తుకొని ముద్దులాడింది. "మీ బాబు చాలా ముద్దొస్తున్నాడు, నాకు ఇవ్వండి, " అని ధరణి కమలతో సరదాగా పలికింది. "అలాగే తీసుకోండి" అని కమల కూడా సరదాగా చెప్పింది. "మీరు మాట వరసకు అలాగే అంటున్నారు కానీ నిజంగా ఇస్తారా" అని

ధరణి కమలతో చెప్పింది. ఆమె మాటలకు కమల నవ్వి ఊరుకుంది. కమల వచ్చినప్పటి నుంచి ధరణి మామూలుగా కమల ఇంటికి వస్తూపోతూ ఆమెకు అన్ని రకాలుగా సహాయం చేస్తూ బాబును సంతోషంగా ముద్దులాడుతూ ఆనందంగా ఉంది. ధరణి ఆ ప్రవర్తన కమలకు చాలా సంతోషాన్ని ఆనందాన్ని కలిగించింది.

ధరణి అప్పటికి సత్యప్రసాద్ తో సంబంధాన్ని ఆరు నెలల పాటు కొనసాగింది. ఆమె నెలతప్పి రెండు నెలలు అయింది. డాక్టర్ దగ్గరికి వెళ్లి పరీక్ష చేయించుకుంది. ఆమెకు రెండు నెలల గర్భం ఉందని డాక్టర్ చెప్పింది. ఆమె సంతోషానికి మేరలేదు. తన ప్రయత్నం ఫలించినందుకు ఎంతగానో ఆనందించింది. పాండురంగరాజు కూడా చాలా సంతోషించాడు. తాను ఇచ్చిన మాట ప్రకారం ఆమె సమస్యను తాను తీర్చగలిగినందుకు సత్యప్రసాద్ చాలా సంతోషించాడు.

అదే సమయంలోనే సత్యప్రసాద్ కు విశాఖపట్నం లో ఉన్న విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం వచ్చింది. అతను కుటుంబంతో సహా విశాఖపట్నం వెళ్లిపోయాడు.

9 వ అధ్యాయం

పిల్లల కలగాలన్న తన చిరకాల వాంఛ నెరవేరబోతున్నందుకు ధరణి చాలా సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతూ వుంది. ఆమెకు ఆనందంతో ఆకాశంలో విహరిస్తున్నట్టుగా ఉంది. భూమి మీద కాళ్ళు నిలవడం లేదు. తనకు ఇంత పరమానందం కలిగించిన సత్యప్రసాద్ మీద ఆమెకు చెప్పలేనంత ప్రేమ అభిమానం కృతజ్ఞత కలిగాయి. మనసులో ఎన్నోసార్లు అతనికి కృతజ్ఞతలు తెలియజేసుకుంది.

ధరణి గర్భవతి అన్న విషయం ఆమె తల్లిదండ్రులు తెలుసుకొని చాలా సంతోషంగా ఆమె దగ్గరకు వచ్చి ఆమెకు తోడుగా ఉన్నారు. ధరణి తల్లి గర్భవతిగా ఆమె తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెబుతూ వచ్చింది. ధరణి తన తల్లి చెప్పిన జాగ్రత్తలను, డాక్టర్ చెప్పిన జాగ్రత్తలను బాగా పాటిస్తూ తన గర్భాన్ని చాలా జాగ్రత్తగా చూసుకుంటూ ఉంది. ఆమెకు వేవిళ్ళు

ప్రారంభమయ్యాయి. తరచుగా నోట్లో నీళ్లు ఊరుతూ ఉండేవి. నోరంతా వికారంగా ఉండేది. ఏమి తిన్నా ఎక్కువగా వాంతులు అయ్యేవి. సన్నగా ఉన్న ఆమె మరింతగా సన్నబడింది. కమలకు వేవిళ్ళు వచ్చినప్పుడు ఆమె నిమ్మకాయ రసంలో తేనె కలుపుకొని ఉదయం పూట తీసుకున్నట్లుగా ధరణి గూడా తీసుకుంది. దానివల్ల, డాక్టరు చెప్పిన మందులు వాడటం చేత మెల్లగా వేవిళ్ళు తగ్గాయి. ఆమె ఎప్పటికప్పుడు డాక్టర్ ను కలిసి ఆమె సూచించిన మందులను వాడుతూ జాగ్రత్తలను పాటిస్తూ ఉంది.

పాండురంగరాజు ధరణి పూర్తిగా విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. ఇల్లు తుడవడానికి అంట్లు తోమడానికి ఒక పని మనిషిని, వంట చేయడానికి ఒక వంట మనిషిని ఏర్పాటు చేశాడు. బజారుకు వెళ్లి ఇంట్లోకి అవసరమైన కూరగాయలు బియ్యం పప్పు మొదలైన ఇతర వస్తువులను పాండురంగరాజు స్వయంగా తెస్తున్నాడు. ధరణి ప్రతిరోజు విశాఖపట్నంలో ఉన్న కమలతో మాట్లాడుతూ గర్భవతి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఆమె ద్వారా తెలుసుకుంటూ వాటిని పాటిస్తూ సంతోషంగా ఉంది. అప్పుడప్పుడు సత్యప్రసాద్ తో కూడా మాట్లాడుతూ ఉంది. సత్య ప్రసాద్ ఆమెతో చాలా క్లుప్తంగా మాట్లాడి ఫోన్ పెట్టేసేవాడు. అతని అభిప్రాయాన్ని ఆలోచనను గ్రహించిన ధరణి అతని మంచితనానికి ముందుచూపుకు ఎంతగానో సంతోషించేది. పాండురంగరాజు సత్యప్రసాద్ తో మాట్లాడుతూ అతని ఉద్యోగాన్ని గురించి క్షేమ సమాచారం గురించి తెలుసుకుంటూ ఉండేవాడు. సత్యప్రసాద్ కూడా పాండురంగరాజు వ్యాపారాన్ని గురించి తెలుసుకుంటూ ఉండేవాడు.

తొమ్మిది నెలలు నిండిన తర్వాత ధరణికి అందమైన పాప పుట్టింది. అమ్మాయికి ఎక్కువగా ధరణి పోలికలే వచ్చాయి. మంచి రంగుతో చూడ ముచ్చటగా ఉన్న తన పాపను చూసుకొని ధరణి ఎంతగానో మురిసిపోయేది. లేకలేక కలిగిన పాపను ధరణి చాలా జాగ్రత్తగా చూసుకునేది. పాపను వదిలిపెట్టి ఒక క్షణం కూడా ఉండేది కాదు. పాప యొక్క చిన్న కాళ్ళు చేతులు పాప శరీరం ఆమెను తాకుతూ వుంటే ఆస్పర్శ ఆమెకు వింత అనుభూతిని అపరిమితమైన ఆనందాన్ని కలిగించేది. ఆమెను చూడగానే పాప కళ్ళు వింతగా మెరిసేవి. పాండురంగరాజు కూడా పాపను చూసి చాలా సంతోషించేవాడు.

పాప పట్ల ధరణి చూపుతున్న ప్రేమకు, ఆమె ఆనందంగా సంతోషంగా ఉంటున్నందుకు పాండురంగరాజు చాలా సంతోషించాడు. పాపకు సవిత అనే పేరు పెట్టారు. తమ కూతురుకు పాప పుట్టినందుకు తాము అమ్మమ్మ , తాత అయినందుకు ధరణి తల్లిదండ్రులు చాలా సంతోషించారు.

ధరణి పాపను చాలా జాగ్రత్తగా చూసుకుంటూనే భర్త పట్ల చాలా కృతజ్ఞతతో అతనికి అవసరమైన అన్ని పనులు తానే చేస్తూ ఉంది. పాండురంగ రాజు కూడా ధరణికి ఏ విషయంలోనూ బాధ కలిగించకుండా చాలా జాగ్రత్తగా ఆమె పట్ల వ్యవహరించేవాడు. పాపను ఎత్తుకొని వాత్సల్యంతో ముద్దు చేసేవాడు. అలా ధరణి పాండురంగరాజులు సవితను ముద్దుగా పెంచుతూ ఉండగా పాప మెల్లగా పాకటం, కూర్చోవడం, లేచి నిలుచోవటం నేర్చుకుంది. పాప ఒక్కొక్క దశను దాటుతూ ఉంటే ధరణి ఆశ్చర్యంతో పాప వైపు చూస్తూ ఎంతో సంతోషిస్తూ ఉండేది. పాప వన్నెలు చిన్నెలు ఆమెకు అపరిమితమైన ఆనందాన్ని కలిగించేది. వచ్చీ రాని పాప మాటలు వింటుంటే ఆమె సంతోషానికి హద్దులుండేవి కావు. పాప ఏడిస్తే ఆమె ఏమాత్రం తట్టుకునేది కాదు. పాపను ఏడ్పించకుండా చాలా జాగ్రత్తగా ఆమె ఆడిస్తూ ఉండేది. పాప పక్కన పడుకొని, పాపను తన మీద పడుకోబెట్టుకొని పాపతో పాటు తాను చిన్న పాపాయి అయిపోయి ఆడుకునేది. పాప రంగును, చిన్నచిన్న చేతులను, కాళ్ళను, ముద్దొచ్చే ముఖాన్ని చూసి ఆమె పరవశించిపోయేది. పాప పుట్టకముందు ధరణికి కాలం చాలా భారంగా గడుస్తూ ఉండేది. పాపతో ఆడుకుంటూ ఉండగా ఆమెకు రోజులు క్షణాల లాగా చాలా త్వరగా గడిచిపోతూవున్నాయి. 11వ నెల దాటి 12 నెలలోకి ప్రవేశించగానే పాప మెల్లగా నడవడం ప్రారంభించింది. పాండురంగరావు పాప కాళ్లకు వెండి గజ్జలు చేయించాడు. చిన్నకాల్లతో బుజ్జి బుజ్జి పాదాలతో గజ్జల సవ్వడితో పాప నడుస్తూ ఉంటే ధరణికి పాండురంగరాజుకు పండుగ లాగా ఉండేది. ధరణి తల్లిదండ్రులు వాళ్ళ సొంత ఊరికి వెళ్ళిపోయారు. అప్పుడప్పుడు వచ్చి కూతురును మనమరాలిని చూసి వెళ్ళిపోతున్నారు.

ఇలా రోజులు క్షణాల లాగా సంతోషంగా గడుస్తూ ఉండగా పాపకు సంవత్సరం గడిచింది. ధరణికి ఆర్భాటంగా పుట్టినరోజు చేయటం ఇష్టం

లేదు. ఆమె అభిప్రాయం ప్రకారం పాండురంగరాజు పాప మొదటి పుట్టినరోజు పండుగను ఆ ఊర్లో ఉన్న అనాథ శరణాలయంలో ఏర్పాటు చేశాడు. శరణాలయంలోని పిల్లలందరికీ కేకులు పంచిపెట్టారు. ఆరోజు మధ్యాహ్నం పిల్లలందరికీ ప్రత్యేకమైన వంటకాలతో భోజనాలు పెట్టారు. శరణాలయంలోని పిల్లలు పెద్దలు ధరణి పాండురంగరాజుల అభిమానానికి ఆప్యాయతకు చాలా సంతోషించారు. వారి సంతోషాన్ని చూసి ధరణి పాండురంగరాజు లు కూడా చాలా ఆనందించారు. ప్రతి సంవత్సరం సవిత పుట్టినరోజును ఏదో ఒక అనాథ శరణాలయంలోని పిల్లల సమక్షంలో నిర్వహించాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు.

పాప పుట్టిన తర్వాత పాండురంగరాజుకు వ్యాపారంలో బాగా కలిసి వచ్చింది. వాళ్లు సొంతంగా స్థలం కొని ఇల్లు కట్టుకున్నారు. పాండురంగరాజు ముందు చూపుతో ఇంటిని ధరణి పేరుతో చేయించాడు. ఇంటికి "సవితా నివాసం" అని పేరు పెట్టుకున్నారు. గృహప్రవేశానికి కమల సత్యప్రసాదులను ఆహ్వానించారు. వారు వచ్చి కొత్త ఇంటిని కట్టుకున్నందుకు ధరణి పాండురంగరాజులకు శుభాకాంక్షలు తెలియజేసి రెండు రోజులుండి వెళ్ళిపోయారు. రెండవ సంవత్సరం ప్రారంభంలోనే సవిత చక్కగా మాట్లాడటం నేర్చుకుంది. ముద్దు ముద్దు మాటలతో పాప ధరణికి పాండురంగరాజుకు చాలా సంతోషాన్ని కలిగిస్తూ వుంది.

మూడో సంవత్సరం దాటిన తర్వాత పాపను స్కూల్లో చేర్పించారు. సవిత చాలా తెలివైనది. స్కూల్లో చెప్పిన ఇంగ్లీష్ రైమ్స్ తెలుగు హిందీ పాటలను, మిగిలిన పాఠాలను చాలా సులభంగా నేర్చుకునేది. పాండురంగ రాజు ధరణికి స్కూటర్ కొనిచ్చాడు. ధరణి స్కూటర్ లో పాపను స్కూల్లో దింపి మళ్ళీ స్కూల్ నుంచి ఇంటికి తీసుకుని వస్తూ వుంది. పాఠశాలలో సాయంత్రం పూట వారానికి మూడు రోజులు భరతనాట్యం నేర్పిస్తారు. ధరణి సవితను భరతనాట్యంలో చేర్పించింది. సవిత భరతనాట్యం కూడా చక్కగా అభ్యసించింది. పాఠశాలలో జరిగే సభలు సమావేశాల్లో ఆమె మిగిలిన అమ్మాయిలతో కలిసి చక్కగా భరతనాట్య ప్రదర్శన చేస్తూ వుంది.

10 వ అధ్యాయం

విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరిన సత్యప్రసాద్ జీవితం సుఖంగా సాఫీగా సాగుతూ వుంది. అతనికి విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం చాలా కాకతాళీయంగా వచ్చింది. సత్యప్రసాద్ కు బాగా తెలిసిన శ్రీ రమణ అనే ప్రొఫెసర్ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా నియమితులయ్యారు. శ్రీరమణగారు నిజాయితీ గలవారు. మంచి అకడమీషియన్. త్రికరణశుద్ధిగా విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేసే వ్యక్తి. సాధ్యమైనంత వరకు విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లుగా మంచి విద్యావంతులను, నిజాయితీ పరులను నియమించాలని భావిస్తున్న వ్యక్తి. అలాంటి రమణ గారికి సత్యప్రసాద్ వ్యక్తిత్వం కష్టపడే మనస్తత్వం నిజాయితీ మొదలైనవి బాగా తెలుసు. ఇలాంటి వారు విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ గా ఉంటే విశ్వవిద్యాలయాలు బాగా అభివృద్ధి చెందుతాయని ఆశించి సత్యప్రసాద్ కు ఆయన విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా అవకాశం కలిగించారు.

సత్యప్రసాద్ విశ్వవిద్యాలయం క్వార్టర్ లో నివాసముంటున్నాడు. విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన, పర్యవేక్షణ చేస్తూ మంచి పేరు సంపాదించుకున్నాడు. విశ్వవిద్యాలయంలో కొంతమంది ప్రొఫెసర్లు స్వార్థపరులై ధన సంపాదన ప్రధానమైన ధ్యేయంగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇలాంటివారు విశ్వవిద్యాలయంలో పాఠాలు చెప్పకుండా, పరిశోధన చేయకుండా సొంత వ్యాపారాల మీద శ్రద్ధ పెట్టి ధనం సంపాదించుకుంటూ ఉంటారు. వీరు వడ్డీ వ్యాపారం, రియల్ ఎస్టేట్ వ్యాపారం, సొంతంగా స్కూల్లు పెట్టి ధనం సంపాదిస్తూ ఉంటారు. వీరు విశ్వవిద్యాలయానికి ఒకసారి వచ్చి సంతకం పెట్టి వెళ్ళిపోయి తమ వ్యాపారాలు చేసుకుంటూ ఉంటారు. మరికొంతమంది ఆచార్యులు రిజిస్ట్రార్, డీన్, హాస్టల్ వార్డెన్ మొదలైన పాలనా సంబంధమైన పోస్టుల కోసం వెంపర్లాడుతుంటారు. కానీ సత్యప్రసాద్ అలాంటివాడు కాదు. అతను ప్రధానంగా అధ్యయనం, అధ్యాపనం, పరిశోధన మీద తన దృష్టిని కేంద్రీకరించాడు. అంతేకాకుండా తన శాఖలో చదువుతున్న బీద విద్యార్థులకు ఫీజు కట్టడం, మెస్ బిల్లులు చెల్లించడం మొదలైన ఆర్థిక సాయం చేస్తూ

ఉంటాడు. అతను మంచి అధ్యాపకుడుగా, ఉత్తమ పరిశోధకుడుగా, పరోపకారిగా, గొప్ప నిజాయితీపరుడుగా పేరు తెచ్చుకున్నాడు.

సత్య ప్రసాద్ తన కుమారుడు సత్య ప్రకాష్ మొదటి జన్మదినాన్ని విశ్వవిద్యాలయానికి దగ్గర్లో ఉన్న అనాధాశ్రమంలో జరిపించాడు. ఆ సందర్భంలో సత్యప్రసాద్ కమల దంపతులు తమ బాబును తీసుకొని అనాధాశ్రమానికి వెళ్లి ఆశ్రమంలోని పిల్లలందరికీ మంచి చాక్లెట్లు పంచిపెట్టారు. కేకులు ఇచ్చారు, మధ్యాహ్నం పూట ప్రత్యేకమైన వంటకాలతో భోజనం పెట్టారు. అక్కడ పిల్లలందరికీ జత కొత్త బట్టలు కుట్టించి ఇచ్చారు. ఆ సంవత్సరమే కాదు ప్రతి సంవత్సరం సత్య ప్రకాశ్ జన్మదినం నాడు సత్యప్రసాద్ దంపతులు ఏదో ఒక అనాధాశ్రమానికి వెళ్లి తమ కుమారుని జన్మదినాన్ని ఆ పిల్లల మధ్యలో జరిపిస్తూ వారికి చాక్లెట్లు కేకులు మంచి భోజనం పెట్టిస్తూ కొత్త బట్టలు కూడా కుట్టిస్తున్నారు.

ధరణి దాదాపుగా ప్రతిరోజు కమలతో మాట్లాడుతూ ఉంది. ఆమెకు అక్కచెల్లెళ్ళు ఎవరూ లేకపోవడం చేత కమలను చెల్లెలుగా భావించి ఎంతో ప్రేమతో మాట్లాడుతూ ఉంటుంది. ఆమె అభిమానానికి ఆప్యాయతకు మంచితనానికి కమల ముగ్ధురాలై తాను కూడా ధరణితో చాలా ప్రేమాభిమానాలతో మాట్లాడుతూ ఉంటుంది. పెళ్లయిన కొత్తలో ఆమె తనకు చేసిన సహాయాన్ని, గర్భవతిగా ఉన్నప్పుడు చేసిన సహాయాన్ని తలుచుకొని ఆమెను అక్కగా భావించడమే గాకుండా ఆమెను అక్కా అని పిలవడం మొదలు పెట్టింది. తాను కూడా రోజూ ఫోన్ చేసి మాట్లాడుతూ ఉంటుంది. కమల తనను అక్కా అని పిలుస్తున్నందుకు ధరణి ఎంతగానో పొంగిపోయి సంతోషిస్తూ ఉంది.

సత్య ప్రకాశ్ కు మూడు సంవత్సరాలు దాటిన తర్వాత సత్యప్రసాద్ అతన్ని విశ్వవిద్యాలయానికి దగ్గరగా ఉన్న పాఠశాలలో చేర్పించాడు. అతను స్కూటర్లో ఉదయం ప్రకాశ్ ను స్కూల్లో దింపి విశ్వవిద్యాలయానికి వెళ్లేవాడు. సాయంకాలం మళ్ళీ స్కూలుకు వెళ్లి కుమారున్ని ఇంటికి తీసుకొని వచ్చేవాడు. అదే పాఠశాలలో సాయంత్రం వారానికి మూడు రోజులు గాత్ర సంగీతం చెప్పేవారు. సత్యప్రసాద్ ప్రకాశ్ ను గాత్ర సంగీతంలో చేర్పించాడు. సత్య

ప్రకాశ్ చాలా తెలివైనవాడు. తన తరగతిలో అన్ని సబ్జెక్టులలోనూ అతనే మొదటగా ఉన్నాడు. అతని గాత్రం మధురంగా ఉంటుంది. గాత్ర సంగీతం కూడా అతను చాలా బాగా నేర్చుకున్నాడు. పాఠశాలలో జరిగే సభలు సమావేశాల్లో అతను చక్కగా పాటలు పాడేవాడు. అంతే కాదు ఆటల్లో కూడా ముందుండేవాడు. అతను తన పాఠశాలలో జరిగే సాహిత్య, సాంస్కృతిక, విద్య, క్రీడా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మంచి పేరు తెచ్చుకున్నాడు. తల్లిదండ్రుల పట్ల వినయ విధేయతలతో మసలుకునేవాడు. పెద్దలపట్ల గౌరవంగా వ్యవహరించేవాడు.

విశ్వవిద్యాలయంలో కొంతమంది ఆచార్యులు తమ విధి నిర్వహణలో పడి కుటుంబం గురించి పట్టించుకునే వారు కాదు. అలాంటి వారి కొంత మంది పిల్లలు సరిగ్గా చదువకుండా దుర్వ్యాశనాలకు లోను కావడం, జీవితంలో పైకి రాలేకపోవడం జరుగుతూ ఉండేది. అంతేకాకుండా అలాంటివాళ్లు సొంత ఇల్లు కూడా కొనుక్కోకుండా ఉద్యోగ విరమణ అనంతరం చాలా ఇబ్బందులు పడేవారు. సత్యప్రసాద్ అలాంటివాడు కాదు. అతను దూర దృష్టి కలవాడు. అతను విశ్వవిద్యాలయంలో తన విధులు సక్రమంగా నిర్వర్తిస్తూనే కుటుంబం గురించి కూడా జాగ్రత్తగా ఆలోచించేవాడు. విశ్వవిద్యాలయంలో అతను ఉద్యోగంలో చేరేనాటికి విశాఖపట్నంలో ఇళ్ల స్థలాల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అంత ఎక్కువ ధర పెట్టి స్థలం కొనుక్కొని ఆ స్థలంలో ఇల్లు కట్టుకునేంత ఆర్థిక స్థోమత అతనికి లేదు. అందుకని అతను విశాఖపట్నానికి దూరంగా తనకు అందుబాటులో ఉన్న ధరలో వచ్చిన 400 గజాల స్థలాన్ని తన భార్య కమల పేరుతో కొనుక్కున్నాడు. ఉద్యోగ విరమణ తర్వాత ఆ స్థలంలో ఇల్లు కట్టుకొని ప్రశాంతంగా జీవించాలని అతను అనుకున్నాడు. సెలవు రోజుల్లో సత్యప్రసాద్ భార్యను కుమారున్ని తీసుకొని విశాఖపట్నం చుట్టుపక్కల ఉన్న చూడదగ్గ ప్రాంతాలకు వెళ్లేవాడు. భార్య, కుమారునితో కలిసి సినిమాలకు, షికార్లకు వెళ్లేవాడు. దానితో ఆ కుటుంబమంతా అభిమానంతో ఆప్యాయంగా, సంతోషంగా ఉండేవారు.

ప్రకాశ్ ఆరవ తరగతికి వచ్చినప్పుడు సత్యప్రసాద్ అతనికి సైకిల్ తొక్కడం నేర్పించాడు. ఏడవ తరగతి నుంచి సత్య ప్రకాశ్ సైకిల్ మీద స్కూలుకు వెళ్లి వచ్చేవాడు. వేసవి సెలవుల్లో సత్యప్రసాద్ ప్రతిరోజు తానే

ప్రకాశ్‌ను ఈతకొలను తీసుకుని వెళ్లి ఈత నేర్పించాడు. ఇలా సత్యప్రసాద్ తన కొడుకు పట్ల చాలా శ్రద్ధ వహిస్తూ ఏ వయసులో ఏమి నేర్పించాలో అవన్నీ నేర్పిస్తూ ఉన్నాడు. చూస్తూ ఉండగానే సత్య ప్రకాశ్ ఒక్కొక్క తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణుడవుతూ పదో తరగతి 95% పైగా మార్కులతో అతని తరగతిలో అందరికంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. పాఠశాలలో అతనికి ఘనంగా సన్మానం కూడా చేశారు. ఇంటర్మీడియట్లో ఎం.పీ.సి. గ్రూప్ లో చేరి అందులో కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణు డయ్యాడు. వేసవి సెలవుల్లో సత్య ప్రసాద్ తన కుమారునికి స్కూటర్ నడపడం, కారు నడపడం నేర్పించాడు.

అదే సమయంలోనే సత్యప్రసాద్ బ్యాంకు లోన్ తీసుకొని విశ్వవిద్యాలయానికి దగ్గర్లో ఒక అపార్ట్మెంట్ ఫ్లాట్ కొనుక్కున్నాడు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సింపుల్ గా గృహప్రవేశం చేశాడు. గృహప్రవేశానికి ధరణి పాండురంగరాజులను ఆహ్వానించాడు. వారిద్దరూ సవితతో కలిసి వచ్చి కమలా సత్యప్రసాదులతో కలిసి విశాఖపట్నం లో రెండు రోజులుండి వెళ్ళిపోయారు.

సత్య ప్రకాశ్ ఎంసెట్ లో మంచి ర్యాంకు సంపాదించాడు. అతను విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ లో చేరాడు. సత్య ప్రసాద్ తన కారులో గానీ, స్కూటర్లో గానీ కుమారున్ని యూనివర్సిటీలో అతని డిపార్ట్మెంట్ దగ్గర దింపేవాడు.

సవిత సత్య ప్రకాశ్ కంటే ఒక సంవత్సరం చిన్నది. అందువల్ల ఆమె చదువులో సత్య ప్రకాశ్ కంటే ఒక సంవత్సరం వెనుక ఉంది. సవిత కూడా పదో తరగతి, ఇంటర్మీడియట్ మంచి మార్కులతో ఉత్తీర్ణురాలయింది. విశాఖపట్నంలోని విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ లో ఆమె కూడా చేరింది. సవిత సత్య ప్రకాశ్ కు ఇంజనీరింగ్ లో ఒక సంవత్సరం జూనియర్. సత్య ప్రకాశ్ రెండవ సంవత్సరం చదువుతూ ఉండగా, సవిత మొదటి సంవత్సరం చదువుతూ ఉంది.

విశాఖపట్నంలో ఇంజనీరింగ్ కోర్సు పూర్తయ్యే వరకు సవితను తమ ఇంట్లోనే ఉంచుకుంటామని కమల సత్యప్రసాదులు ధరణిని పాండురంగరాజును ఎంతగానో బ్రతిమాలారు. కానీ వాళ్ళు ఎంతో మర్యాదగా

అలా వద్దని, సవితకు హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టమని చెప్పి ఒప్పించి హాస్టల్ లో చేర్పించారు. సవిత, సత్య ప్రకాశ్ లు సొంత అన్న చెల్లెలు లాగా ఉంటున్నారు. ప్రకాశ్ ప్రతి ఆదివారం సవితను హాస్టల్ నుంచి తమ ఇంటికి తీసుకుని వచ్చేవాడు. సవిత కమలను చిన్నమ్మ అని, సత్యప్రసాద్ ను బాబాయ్ అని ఎంతో ప్రేమగా పిలిచేది. కమల ఆమెను సొంత కూతురు లాగా ఎంతో ప్రేమగా అభిమానంగా చూసేది.

11 వ అధ్యాయం

పాండురంగరాజు వ్యాపారంలో బాగానే సంపాదించాడు. కానీ అతని ఆరోగ్యం దెబ్బతినింది. అతనికి వాకింగ్ చేయడం, వ్యాయామం చేయడం, యోగా చేయటం మొదలైనవేవీ అలవాటు లేదు. అతనికి సిగరెట్ కాల్చే అలవాటుంది. అప్పుడప్పుడు తోటి వ్యాపారస్తులతో కలిసి మందు తాగేవాడు. కాలం గడిచే కొద్దీ అది రోజు తాగే అలవాటుగా మారిపోయింది. వీటితోపాటు వ్యాపారంలో ఉండే ఒత్తిడి వల్ల అతనికి బీ.పి, షుగర్ వ్యాధులు చిన్న వయసులోనే వచ్చాయి. వాటికి చాలా కాలంగా మందులు వాడుతున్నాడు. ఒక్కొక్కసారి మధుమేహం అదుపులో ఉండేది కాదు. అప్పుడు ఆసుపత్రిలో చేరవలసి వచ్చేది. ఆస్పత్రిలో చేరి డాక్టర్ల పర్యవేక్షణలో షుగర్ అదుపులోకి వచ్చిన తర్వాత ఇంటికి వచ్చేవాడు. ధరణి అతని ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ తీసుకునేది. ప్రతిరోజు సమయానికి మందులు ఇవ్వడం, ఎప్పటికప్పుడు షుగర్ టెస్ట్ లు చేయించడం, షుగర్ అదుపులోకి రాకపోతే వెంటనే అతన్ని హాస్పిటల్లో చేర్పించడం చేస్తూ వుంది. సిగరెట్లు, మందు మానివేయమని అతన్ని బ్రతిమాలుతూ ఉంటుంది. ఆమె బ్రతిమాలటం వల్ల అతను మెల్లమెల్లగా సిగరెట్లు తగ్గిస్తూ చివరకు మానేశాడు. అలాగే మందు కూడా చాలా వరకు తగ్గించాడు. తోటి వ్యాపారస్తులు బలవంతం చేయడం వల్ల అప్పుడప్పుడు తాగుతూ ఉంటాడు. దురలవాట్లు మానివేసినప్పటికీ వ్యాపారంలో ఉండే ఒత్తిడి వల్ల అతని ఆరోగ్యం పూర్తిగా బాగుపడలేదు. అప్పుడప్పుడు షుగర్, బి.పి లను అదుపులో ఉంచడానికి ఆసుపత్రిలో చేరుతూ వున్నాడు.

ధరణికి ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. ఆమె తన ఇంటి పనులన్నీ తానే చేసుకుంటూ ఉండటం వల్ల అది ఆమెకు మంచి వ్యాయామంగా

ఉండేది. సవిత పుట్టకముందు ఆమెకు పిల్లలు లేరన్న బెంగ, దిగులు చాలా ఎక్కువగా ఉండేది. సవిత పుట్టిన తర్వాత ఆమె చాలా సంతోషంగా ఉంది. సంతోషమే సగం బలం అంటారు కదా పెద్దలు, ఆ సంతోషం వల్ల ధరణికి మంచి బలం చేకూరింది. ఆబలమే ఆమెకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా చేసింది. అయితే ఆమె భర్త అనారోగ్యం ఆమెకు కొంత దిగులు కలిగిస్తూ వుంది.

విశాఖపట్నంలో ఉన్న సత్యప్రసాద్ కు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. అతను క్రమం తప్పకుండా ప్రతిరోజు నడక, ఇతర వ్యాయామాలు, ప్రాణయామం చేస్తూ వున్నాడు. వీటివల్ల అతను పరిపూర్ణమైన ఆరోగ్యంతో ఉండటమే కాకుండా వయసుతో పాటు వచ్చే మార్పులు కూడా అతనిలో పెద్దగా రాలేదు. అతను తనతో పాటు తన కొడుకు సత్యప్రకాశ్ ను పొద్దున్నే లేపి వ్యాయామానికి తీసుకొని వెళ్తుంటాడు. చాలాసార్లు కమలను కూడా వాకింగ్ కు రమ్మని బలవంతం చేసేవాడు. కానీ ఆమె వెళ్ళేది కాదు. కమల నాన్నగారికి షుగర్ ఉంది. కమలకు కూడా **35** ఏళ్ల వయసులో మొదట షుగర్ వ్యాధి వచ్చింది. తర్వాత బి.పి వచ్చింది. ఆ తర్వాత థైరాయిడ్ సమస్య వచ్చింది. ఈ ఆరోగ్య సమస్యలన్నింటికీ ఆమె చాలా రోజుల నుంచి మందులు వాడుతూ ఉంది. దానితోపాటు యుటిరస్ సమస్య వచ్చింది. ఆమెకు బ్లీడింగ్ ఎక్కువ అవుతూ వుంది. దానికి కూడా చాలా కాలం మందులు వాడవలసి వచ్చింది. ఈ మందులతో ఆమెకు చాలా విసుగ్గా ఉండేది. శారీరకంగా ఆమెలో చాలా మార్పు వచ్చింది. బాగా చిక్కిపోయింది. వయసుకు మించి చాలా పెద్దావిడ లాగా కనిపిస్తూ వుంది.

12 వ అధ్యాయం

సత్య ప్రకాశ్ ఇంజనీరింగ్ చదువు పూర్తయింది. ఇంజనీరింగ్ మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. యూ.ఎస్ వెళ్లి ఎం.ఎస్ చేస్తానని తల్లిదండ్రులకు చెప్పాడు. వాళ్ళు దానికి అంగీకరించారు. యూ.ఎస్ లో ఎం.ఎస్ చదవడానికి అవసరమైన జీ.ఆర్.ఇ, టోఫెల్ పరీక్షల్లో అతను మంచి మార్కులు సంపాదించాడు. దానితో అతనికి టెక్సాస్ రాష్ట్రంలోని క్లియర్ లేక్ అనే

పట్టణంలో వున్న యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో స్కాలర్షిప్ తో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎమ్.ఎస్. లో ప్రవేశం లభించింది. ఫేస్బుక్ ద్వారా అతను క్లియర్ లేక్ లో తాను ఉండడానికి వసతిని బుక్ చేసుకున్నాడు.

సత్య ప్రకాశ్ పుట్టినప్పటినుంచి ఇంతవరకు తల్లిదండ్రులను వదిలిపెట్టి ఎక్కడికీ వెళ్ళలేదు. అతని చదువు అంతా విశాఖపట్నంలోనే జరిగింది. మొదటిసారి విశాఖపట్నం వదిలిపెట్టి వెళ్తున్నాడు. మొదటిసారి విమానం ఎక్కుతున్నాడు. అమెరికాకు వెళుతున్నానన్న సంతోషం ఒకవైపు వున్నా తల్లిదండ్రులను వదిలిపెట్టి వెళ్ళిపోతున్నందుకు అతనికి చాలా బాధగా ఉంది. కమలకు ఏడుపు ఒకటే తక్కువ. అంతవరకు ఆమె కుమారున్ని వదిలిపెట్టి ఉండలేదు. కొడుకు మొదటిసారిగా విమానం ఎక్కి అమెరికాకి వెళ్ళిపోతున్నాడు. మళ్ళీ ఎప్పుడు వస్తాడో అని, కొడుకుని ఎప్పుడు చూస్తానో అని ఆమె బెంగ పెట్టుకుంది. సత్యప్రసాద్ కూడా ఇంచుమించు అదే పరిస్థితిలో ఉన్నాడు. కాకపోతే అతను బయటపడలేదు.

సత్య ప్రకాశ్ అమెరికాకు వెళ్లడానికి విమానం టికెట్లు తీసుకున్నాడు. అప్పటినుంచి కమల మరింతగా బెంగ పెట్టుకుంది. కుమారునికి ఎప్పటికప్పుడు అనేక రకాల జాగ్రత్తలు చెబుతూ ఉంది. హైదరాబాదు నుంచి దుబాయ్ మీదుగా హ్యూస్టన్ సిటీకి సత్య ప్రకాశ్ వెళ్ళవలసి ఉంది. ఒకరోజు ముందుగానే సత్య ప్రకాశ్ కమల సత్యప్రసాదులు హైదరాబాద్ కు వెళ్లి లాడ్జిలో దిగారు. ధరణి పాండురంగరాజులు సవితతో కలిసి సత్య ప్రకాశ్ కు సెండాఫ్ ఇవ్వడానికి హైదరాబాదుకు వచ్చి సత్య ప్రసాద్ కుటుంబం దిగిన లాడ్జిలోనే దిగారు. అందరూ కలిసి రెండు టాక్సీల్లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లారు. ఎయిర్ పోర్టు అమెరికాకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో, బంధుమిత్రులతో చాలా రద్దీగా సందడిగా ఉంది. కొంతమంది తల్లులు అమెరికాకు వెళ్తున్న తమ పిల్లలను పట్టుకొని దుఃఖిస్తూ ఉన్నారు. వారిని చూసి వారి బంధువులు మిత్రులు బాధపడుతున్నారు. కొంతమంది అమెరికాకు వెళ్తున్న విద్యార్థులతో ఫోటోలు తీసుకుంటున్నారు.

కమల చాలా దిగులుగా ఉంది. ధరణి సవితలు ఆమెకు మంచి మాటలు చెప్పి ఓదార్చారు. ఎయిర్ పోర్టులో బయట సత్యప్రకాశ్ తో అందరూ కలిసి

ఫోటో తీయించుకున్నారు. సత్య ప్రకాశ్ తన లగేజీ తీసుకొని ఎయిర్ పోర్ట్ లోకి వెళ్లి వెళ్ళాడు. మామూలుగా అయితే సెండాఫ్ ఇవ్వడానికి వచ్చిన వాళ్లను విజిటర్స్ లాంజీలోకి అనుమతిస్తారు. కానీ ఆరోజు విజిటర్స్ చాలా మంది ఉండడంతో ఎవరిని విజిటర్స్ లాంజీలోకి అనుమతించలేదు. దానితో సత్యప్రసాద్ కమలలు, పాండురంగరాజు ధరణి సవితలు విమానాశ్రయం బయటనే ఉండవలసి వచ్చింది. సత్య ప్రకాశ్ లోపలికి వెళ్లి బోర్డింగ్ పాస్ తీసుకున్నాక సత్య ప్రసాద్ కు ఫోన్ చేసి వాళ్ళందర్నీ లాడ్జికి వెళ్ళమని చెప్పాడు. అందరూ దిగులుగా లాడ్జికి వెళ్లిపోయి మరుసటి రోజు తమ ఊర్లకు వెళ్లిపోయారు.

సత్యప్రకాశ్ అమెరికా వెళ్ళిపోయి ఎం.ఎస్.లో చేరాడు. ఎమ్.ఎస్. లో చేరినట్లుగా తల్లిదండ్రులకు, ధరణి రంగరాజులకు ఫోన్ చేసి చెప్పాడు. ఆ విశ్వవిద్యాలయంలో 90% పైగా తెలుగు విద్యార్థులే ఉన్నారు. అమెరికాలో ఉన్నప్పటికీ అక్కడ పూర్తిగా తెలుగు వాతావరణమే ఉంది. విశాఖపట్నం, రాజమండ్రి కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలుగు వాళ్ళు ఎక్కువగా ఎలా ఉంటారో అదేవిధంగా ఆ విశ్వవిద్యాలయంలో కూడా తెలుగు విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. అక్కడే కాదు అమెరికాలోని చాలా విశ్వవిద్యాలయాల్లో తెలుగు విద్యార్థులు చాలా ఎక్కువ మంది చదువుకుంటున్నారు. తెలుగు విద్యార్థులు అమెరికాకు వెళ్లకపోతే అమెరికాలోని చాలా విశ్వవిద్యాలయాలు మూసి వేయవలసి ఉంటుంది. అక్కడ ఎమ్.ఎస్. చేసే వాళ్ళు ఎమ్.ఎస్. చదువుకుంటూ ఏదో ఒక పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ ఉంటారు. దగ్గరలో ఉన్న హెూటల్లలో సర్వర్ గా పనిచేయటం, పెట్రోల్ బంకుల్లో పనిచేయటం, సూపర్ బజార్లలో, మాల్స్ లో పనిచేయడం ఇలా అనేక రకాలుగా పనిచేస్తూ ఉంటారు.

సత్య ప్రకాశ్ అమెరికాలోని విశ్వవిద్యాలయానికి వెళ్ళినప్పుడు అక్కడ అతనికి తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు. అక్కడికి వెళ్ళటం మొదటిసారి కావడం చేత అక్కడ ఎవరు, ఏమిటి, ఎలా నడుచుకోవాలి, ఎలా ఫీజు కట్టాలి, మొదలైన అనేక విషయాలు తెలియకపోవడం చేత అతను చాలా ఇబ్బంది పడ్డాడు. కొంతమంది తెలుగు విద్యార్థులు అతనికి సాయం చేశారు. తాను పడిన

ఇబ్బంది కొత్తగా వచ్చే తెలుగు విద్యార్థులు పడకూడదని ప్రకాశ్ భావించి సీనియర్ విద్యార్థులను సంప్రదించి తెలుగు విద్యార్థులతో "హ్యూస్టన్ విశ్వవిద్యాలయ తెలుగు విద్యార్థి సంఘం'' (Telugu students association of Huston University) అనే పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేశాడు. అందులో సేవా దృక్పథమున్న కొందరు సీనియర్ విద్యార్థులను, కొందరు జూనియర్ విద్యార్థులను అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సభ్యులు మొదలైన విధంగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రకాశ్‌కు పదవుల మీద ఎలాంటి ఆసక్తి లేదు. అందువల్ల అతను ఎలాంటి పదవి స్వీకరించకుండా కార్యకర్తగా ఉన్నాడు. ఈ సంఘం కొత్తగా వచ్చిన తెలుగు విద్యార్థులకు వసతితో పాటు పార్ట్ టైం ఉద్యోగం, ఇంకా ఇతర సమస్యల విషయంలో సహాయం చేస్తుంది. అంతేకాకుండా ఉగాది, శ్రీరామనవమి, దసరా, సంక్రాంతి, వినాయక చవితి, బతుకమ్మ మొదలైన పండుగలను తెలుగు విద్యార్థులందరూ కలిసి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీని వల్ల తెలుగు విద్యార్థులు తమ మాతృభూమికి దూరంగా ఉన్నప్పటికీ అక్కడ తెలుగు వారందరితో కలిసిమెలిసి ఉండటం వల్ల తెలుగు వాతావరణాన్ని కల్పించడం వల్ల మాతృభూమికి దూరంగా ఉన్నామన్న భావన ఆ విద్యార్థులకు లేకుండా చేయాలన్నది వారి ఉద్దేశ్యం. అప్పుడప్పుడు ఈ సంఘం సమావేశాలు ఏర్పాటు చేసుకుని వనభోజనాలు, పిక్నిక్ లు మొదలైనవి కూడా ఏర్పాటు చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ కార్యక్రమాలకు ఆ విశ్వవిద్యాలయంలో చదువుతున్న అమెరికా దేశ విద్యార్థులతో పాటు ఇతర దేశాల విద్యార్థులను, విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులను పాల్గొనేటట్లుగా చేయాలని వారు నిర్ణయించుకున్నారు. అంతేకాకుండా "హ్యూస్టన్ విశ్వవిద్యాలయ తెలుగు విద్యార్థి సంఘం'' ను నిరంతరంగా కొనసాగించాలని కూడా వారు నిర్ణయించుకున్నారు. అలాగే కొనసాగించారు కూడా.

సత్యప్రకాశ్ ఒక పెట్రోల్ బంక్ లో అకౌంట్స్ రాసే ఉద్యోగంలో చేరాడు. రోజు సాయంత్రం మూడు గంటలు అక్కడ పని చేసేవాడు. అతనికి స్కాలర్షిప్ వస్తుంది. దానితో పాటు పార్ట్ టైమ్ ఉద్యోగం చేయటం వల్ల ఇంటి దగ్గర నుంచి డబ్బులు తెప్పించుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ సొంతంగా డబ్బు సంపాదించుకుంటూ చదువుకోవడం

అతనికి బాగా నచ్చింది. అమెరికాలో ఎంత ధనవంతుల పిల్లలైనా చదువుకునేటప్పుడు పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ తమ చదువుకు కావలసిన డబ్బును వాళ్లే సంపాదించుకుంటూ ఉంటారు. అక్కడ డిగ్నిటీ ఆఫ్ లేబర్ (శ్రమకు గౌరవం) బాగా ఉంది. అక్కడ ఎంత చిన్న పని చేసినా చిన్నతనముండదు. అవమానముండదు. శ్రమ దోపిడీ లేదు. పనికి తగిన వేతనముంటుంది. అవినీతి లంచగొండితనం లేదు. అమెరికాలోని ఆ పద్ధతి అతనికి బాగా నచ్చింది.

ఆ పద్ధతి భారతదేశంలో లేనందుకు అతను బాధపడ్డాడు. చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగం చేయటం భారతదేశంలో చాలా తక్కువ. ఇండియాలో తల్లిదండ్రులు తాము తినీ తినక కష్టపడి సంపాదిస్తూ పిల్లలను చదివిస్తూ ఉంటారు. భారతదేశంలో శ్రమించే వాళ్లకు విలువలేదు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ ఇక్కడ లేదు. లేబర్ అనే మాట నిందార్థంలో ఉపయోగిస్తుంటారు. ఇక్కడ వైట్ కలర్ ఉద్యోగం వాళ్లకు విలువ ఎక్కువ. వాళ్ళు చేసే అవినీతి లంచగొండితనం చాలా ఎక్కువగా ఉంటున్నందుకు సత్య ప్రకాశ్ చాలా బాధపడ్డాడు.

అమెరికాలోని మరి రెండు పద్ధతులు కూడా సత్యప్రకాశ్ కు బాగా నచ్చాయి. అక్కడ స్కూల్ పిల్లలకు చాలా విలువ ఇస్తారు. వాళ్ల ప్రయాణిస్తున్న బస్సులను చాలా గౌరవిస్తారు. స్కూల్ పిల్లల బస్సులు ఆగితే ట్రాఫిక్ మొత్తం ఎక్కడిదక్కడ ఆగిపోతుంది. స్కూల్ బస్సు వెనకాల వస్తున్న కార్లు బస్సులు ఇతర వాహనాలు అన్నీ , ఎదురుగా వస్తున్న వాహనాలు అన్నీ ఎక్కడివక్కడ ఆగిపోతాయి. మళ్లీ స్కూల్ బస్సు కదిలి బయలుదేరిన తర్వాతనే వాహనాలు కదులుతాయి. స్కూల్ పిల్లల రక్షణ కోసం వారి బాగు కోసం అమెరికాలో ఆ పద్ధతి ఏర్పాటు చేశారు. అలా ఆగకుండా ఏ వాహనమైన వెళ్ళిపోతే ఆ వాహనానికి చాలా జరిమానా వేస్తారు.

అలాగే సైరన్ తో వస్తున్న అంబులెన్స్ లను కూడా అమెరికాలో చాలా గౌరవిస్తారు. సైరన్ తో అంబులెన్స్ వస్తూ ఉంటే వాహనాలన్నీ దానికి దారి ఇచ్చి ఆగిపోతాయి. అంబులెన్స్ వెళ్లిపోయిన తర్వాతనే మళ్లీ ట్రాఫిక్ కదులుతుంది. అంబులెన్స్ లోని రోగుల ప్రాణ రక్షణ కోసం అమెరికాలో

ఈ పద్ధతిని ఏర్పాటు చేశారు. అంబులెన్స్ కు దారి ఇవ్వకుండా ఆగకుండా ఏ వాహనమైన వెళ్ళటం జరిగితే ఆ వాహనానికి చాలా జరిమానా వేస్తారు.

స్కూల్ పిల్లలను, రోగులను ఇంతగా గౌరవిస్తున్న అమెరికా తమ దేశంలోని గన్ కల్చర్ (తుపాకుల సంస్కృతి) ని అరికట్టలేకపోతున్నందుకు సత్యప్రకాశ్ చాలా బాధపడుతూ ఉంటాడు. అమెరికాలో తుపాకులు కూరగాయల మార్కెట్లో కూరగాయల లాగా లభిస్తూ ఉంటాయి. అక్కడ తుపాకి తీసుకోవడానికి ఎలాంటి లైసెన్స్ అక్కర్లేదు. అమెరికాలోని చాలా మంది దగ్గర తుపాకులుంటాయి. కోపం వచ్చినప్పుడు, మనసు బాగా లేనప్పుడు తుపాకులతో ఎదుటి వ్యక్తులను విచక్షణారహితంగా కాలుస్తూ ఉంటారు. స్కూల్లో చదువుతున్న చిన్నపిల్లలు కూడా తుపాకీ తీసుకొని వచ్చి తనకిష్టం లేని పిల్లలను టీచర్లను కాలుస్తూ ఉంటారు. తుపాకుల సంస్కృతి కారణంగా అక్కడ నేరాలు దారుణంగా జరుగుతూ ఉంటాయి. నేరస్తులు తుపాకీ గురిపెట్టి డబ్బులు గుంజుతూ ఉంటారు. డబ్బులు ఇవ్వకపోతే వారు వెంటనే తుపాకితో కాల్చి చంపుతారు. దుర్మార్గమైన అలాంటి తుపాకీ సంస్కృతి భారతదేశంలో లేనందుకు అతను చాలా సంతోషిస్తూ ఉంటాడు.

సత్యప్రకాశ్ శ్రద్ధగా తన ఎం.ఎస్. కోర్స్ చదువుతున్నాడు. అతని క్లాసులో ఎమేలియా అనే అమెరికా అమ్మాయి చదువుతూ వుంది. ఆ అమ్మాయి తల్లిదండ్రులు భారతదేశం పట్ల, భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల పట్ల, హిందూ మతం పట్ల చాలా అభిమానం, ఆసక్తి ఉన్నవాళ్లు. తల్లిదండ్రుల లాగానే ఎమేలియా కూడా భారతదేశ ప్రజల పట్ల అభిమానం కలది. తన తరగతిలో అందరికంటే బాగా చదువుతూ ప్రథమ శ్రేణిలో ఉన్న సత్యప్రకాశ్ అంటే ఆమెకు చాలా ఇష్టం. సత్య ప్రకాశ్ చాలా సౌమ్యంగా ఉండటం, స్నేహంగా ఉండటం, మంచి విద్యార్థిగా ఉండటం, బాగా చదువుతూ ఉండటం మొదలైన లక్షణాలు ఆమెకు బాగా నచ్చాయి. ఆమె తనకు తానుగా సత్యప్రకాశ్ తో పరిచయం పెంచుకొని స్నేహంగా ఉంటూ వచ్చింది. సత్య ప్రకాశ్ మొదట ఆమెకు దూరంగా ఉన్నా తర్వాత ఆమె అభిప్రాయాలు భారతదేశం పట్ల ఆమెకు ఆమె తల్లిదండ్రులకు ఉన్న ఇష్టం గమనించిన తర్వాత ఆమెతో స్నేహంగా ఉండటం మొదలు పెట్టాడు.

సత్య ప్రకాశ్ తరచుగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన చదువును గురించి అక్కడ పరిస్థితులను గురించి వివరిస్తూ ఉన్నాడు. అలాగే ధరణి రంగరాజులతో సవితతో మాట్లాడుతూ ఉంటాడు. వాళ్లకు ఫోన్ చేసినప్పుడు సవితను ఎమ్.ఎస్. చేయడానికి అమెరికాకు పంపించమని కోరాడు. సవితతో మాట్లాడుతూ అమెరికాకు వచ్చి ఎమ్.ఎస్. చేయమని సలహా ఇచ్చాడు. దానికి ఆమె అలాగే చేస్తానని చెప్పింది. ఆమె తల్లిదండ్రులు కూడా ఆమెను అమెరికాకు పంపించడానికి అంగీకరించారు.

మరుసటి సంవత్సరం సవిత ఇంజనీరింగ్ చదువు పూర్తయింది. ఆమె యూ.ఎస్ వెళ్లి ఎం.ఎస్. చేస్తానని తల్లిదండ్రులను కోరింది. వారు దానికి అంగీకరించారు. సవిత సత్య ప్రకాశ్ సలహాలు తీసుకొని జీ.ఆర్.ఈ, టోఫెల్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి యూ.ఎస్ లో సత్యప్రకాశ్ చదువుతున్న విశ్వవిద్యాలయంలో స్కాలర్షిప్ తో ఎమ్.ఎస్. లో సీటు సంపాదించింది.

సవిత అమెరికాకు రావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సత్యప్రకాశ్ చేశాడు. ఆమె అమెరికాకు వెళ్ళటం ఇష్టంగా ఉన్నప్పటికీ సవితను వదిలిపెట్టి ఉండడానికి ధరణి చాలా బాధపడుతూ ఉంది. ఇండియాలో ఉన్నప్పుడు ప్రతి సెలవులకు సవిత తల్లిదండ్రుల దగ్గరకు వచ్చేది. లేకపోతే ధరణి పాండురంగరాజులు ఆమెను చూడాలనుకున్నప్పుడల్లా విశాఖపట్నం వెళ్లి చూసి వచ్చేవారు. ఆమె అమెరికాకు వెళ్తే ఆమెను చూడడం అంత సులభంగా వీలు కాదు. అది తలుచుకొని ధరణికి చాలా విచారంగా ఉంది.

సవితను అమెరికాకు పంపించడానికి ఆమె తల్లిదండ్రులతో పాటు కమల సత్యప్రసాద్ లు కూడా హైదరాబాదుకు వెళ్లారు. విమానాశ్రయం దగ్గర ధరణి సవితను పట్టుకొని దుఃఖించడం మొదలుపెట్టింది. సవిత, కమల ఆమెకు మంచి మాటలు చెప్పి ఓదార్చారు. అందరూ కలిసి అక్కడ ఫోటో తీయించుకున్నారు. సవిత తల్లిని తండ్రిని కౌగిలించుకొని వారి పాదాలకు నమస్కరించి, కమల సత్యప్రసాద్ ల దగ్గర సెలవు తీసుకుని ఎయిర్ పోర్టులోపల్లికి వెళ్ళిపోయి విమానం ఎక్కింది. ఆమె అమెరికా వెళ్ళిపోయింది. సత్య ప్రకాశ్ హ్యూస్టన్ ఎయిర్ పోర్టుకు వెళ్లి ఆమెను రిసీవ్ చేసుకున్నాడు. ఆమెకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతి తో పాటు పార్ట్ టైం ఉద్యోగం కూడా చూపించాడు.

సత్య ప్రకాశ్ "నూతన విద్యార్థులకు స్వాగతం" అనే బ్యానర్ ను తెలుగులో ఏర్పాటు చేయించాడు. దాన్ని చూసి కొత్తగా ఆ విశ్వవిద్యాలయంలో చేరడానికి వచ్చిన విద్యార్థులకు చాలా సంతోషంతో పాటు ధైర్యం కూడా కలిగింది. సీనియర్ విద్యార్థులు వంతుల వారీగా విధులు ఏర్పాటు చేసుకుని కొత్తగా వచ్చిన విద్యార్థులకు అన్ని రకాల సహాయాలు చేశారు. ఈ విషయం తెలుసుకొని అమెరికాలో తెలుగు వాళ్ళు ఎక్కువగా ఉన్న ఇతర విశ్వ విద్యాలయాల్లోని విద్యార్థులు కూడా తెలుగు విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసుకుని కొత్తగా వచ్చిన విద్యార్థులకు సహాయం చేయడం మొదలు పెట్టారు.

సత్య ప్రకాశ్ తెలుగు సంఘం విధులు నిర్వహిస్తూనే తన ఎమ్.ఎస్. చదువు కూడా బాగా చదువుతూ పరీక్షల్లో మంచి మార్కులు సంపాదిస్తున్నాడు. రెండో సంవత్సరానికి వచ్చేనాటికి ఎమేలియా తో అతని స్నేహం ప్రేమగా మారింది. ఎమేలియా తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించారు. ప్రకాశ్ తన ప్రేమ వ్యవహారాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. వారు కూడా ప్రకాశ్ ప్రేమను అంగీకరించారు. వారు ప్రకాశ్ ప్రేమ వ్యవహారాన్ని గురించి ధరణి పాండురంగరాజులకు చెప్పారు. వాళ్లు సంతోషించారు.

సత్య ప్రకాశ్ ఎమ్.ఎస్. లో మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. అతనికి సియాటెల్ లోని మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఎమేలియాకు కూడా అక్కడే ఉద్యోగం వచ్చింది. వాళ్ళిద్దరూ ఉద్యోగంలో చేరిపోయారు. కమల సత్య ప్రసాదులు, ధరణి పాండురంగరాజులు చాలా ఆనందించారు.

13వ అధ్యాయం

అమెరికాలో విశ్వవిద్యాలయాలు గ్రాడ్యుయేషన్ సెరమనీని (Graduation seremony) చాలా ఘనంగా ఒక ఉత్సవంగా నిర్వహిస్తాయి. దాన్ని మనదేశంలో కాన్వకేషన్ అంటారు. మన దేశంలో కాన్వకేషన్ ను విశ్వవిద్యాలయాలు మాత్రమే నిర్వహిస్తాయి. అమెరికాలో పాఠశాలలు కూడా గ్రాడ్యుయేషన్ సెర్మనీని నిర్వహిస్తాయి. అమెరికాలో చదువుకు చాలా విలువ ఉంది. అమెరికాలో పాఠశాల యాజమాన్యం వారు తమ పాఠశాలలో 12వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెరమని నిర్వహించి సర్టిఫికెట్ లు

ఇస్తారు. విశ్వవిద్యాలయాలు తమ దగ్గర బి.స్.(బి.టెక్), ఎమ్.ఎస్. (ఎమ్.టెక్), పిహెచ్.డి. పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయడానికి గ్రాడ్యుయేషన్ సెర్మనీని నిర్వహిస్తాయి. అది నిర్వహించడానికి విద్యార్థుల నుంచి కొంత ఫీజు వసూలు చేస్తారు. డిగ్రీలు తీసుకునే విద్యార్థినీ విద్యార్థులు తమ తల్లిదండ్రులను, బంధువులను, మిత్రులను ఆ ఉత్సవానికి ఆహ్వానిస్తారు. ఆ ఉత్సవానికి హాజరు కావడానికి విదేశీ విద్యార్థుల తల్లిదండ్రులకు అమెరికా ప్రభుత్వం విజిటింగ్ వీసా ఇస్తుంది.

కమల, సత్యప్రసాదులు సత్య ప్రకాశ్ కాన్వకేషన్ లో డిగ్రీ తీసుకునే ఉత్సవానికి హాజరుకావాలని నిశ్చయించుకున్నారు. వారికి అమెరికా ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు విజిటింగ్ వీసా ఇచ్చింది. హైదరాబాదు నుంచి డైరెక్ట్ గా హ్యూస్టన్ కు ఒకే విమానం లేదు. హైదరాబాదు నుంచి దుబాయ్ వరకు ఒక విమానంలో వెళ్లి, దుబాయ్ నుంచి వేరొక విమానం ఎక్కి హ్యూస్టన్ కు వెళ్లాలి. హైదరాబాదు నుంచి దుబాయ్ కి నాలుగు గంటల ప్రయాణం, దుబాయ్ నుంచి హ్యూస్టన్ కు 18 గంటల సుదీర్ఘ ప్రయాణం. సత్య ప్రసాద్ అప్పుడప్పుడు హైదరాబాదు నుంచి ఆఫీస్ పని మీద ఢిల్లీకి వెళ్తూ వుంటాడు. అతనికి విమాన ప్రయాణం కొత్త కాదు. కమల అంతవరకు విమానం ఎక్కలేదు. ఇదే మొదటి సారి ఆమె విమానం ఎక్కడం. విదేశీ విమానంలో సీటు ముందు టీవీ తెర ఉంటుంది. టీవీలో అన్ని భాషల సినిమాలు పెట్టుకోవచ్చు. వాళ్ళిద్దరూ హైదరాబాదులో విమానం ఎక్కి దుబాయ్ కి వెళ్లారు. విమానంలో ఒక తెలుగు సినిమా చూశారు. అంతవరకు ప్రయాణం పెద్దగా ఇబ్బంది అనిపించలేదు.

దుబాయిలో మరొక పెద్ద విమానం ఎక్కారు. సత్య ప్రసాద్ తన ముందున్న టీవీ తెర మీద విమానం గురించి శోధించాడు. ఆ విమానం ఆకాశంలో 35000 అడుగుల ఎత్తులో ఇంచుమించు 900 కిలోమీటర్ల వేగంతో వెళుతూ ఉంది. కానీ విమానం అసలు కదులుతున్నట్టుగా కూడా లేదు. ఎలాంటి కుదుపులూ లేవు. సత్య ప్రసాద్ విమానం వేగం గురించి కమలకు చెప్పాడు. ఆ మాటలు విని కమల ఆశ్చర్యపోయింది. వాళ్ళిద్దరూ18 గంటలు అలాగే కూర్చొని ఉన్నారు. కాళ్ళు చాపుకోవడానికి పెద్దగా అవకాశం లేదు.

ఇద్దరూ కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. కాసేపు సినిమాలు చూశారు. కాసేపు నిద్రపోయారు, కూర్చొని కూర్చొని కాళ్లు పట్టుకుపోయాయి. ప్రయాణం దీర్ఘంగా సాగుతూనే ఉంది. ఎంతకు గమ్యస్థానం రాలేదు. వాళ్లకు ప్రయాణం చాలా విసుగనిపించింది. 18 గంటల తర్వాత చివరకు విమానం హ్యూస్టన్ విమానాశ్రయంలో దిగింది. ప్రకాశ్, సవిత, ఎమేలియా ముగ్గురు విమానాశ్రయానికి వచ్చి వాళ్ళను రిసీవ్ చేసుకున్నారు. ప్రకాశ్ , ఎమేలియా ముందుగానే సియాటెల్ నుంచి క్లియర్ లేక్ కు వచ్చివున్నారు. హ్యూస్టన్ నుంచి క్లియర్ లేక్ పట్టణానికి కారులో గంట లోపు ప్రయాణం. సత్య ప్రసాద్ తల్లిదండ్రులను క్లియర్ లేక్ పట్టణంలో ఒక హొటల్ లో ఉంచాడు. ఆ హొటల్లోనే ఎమేలియా తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఎమేలియా కూడా ఆ సెర్మనీలో ఎమ్.ఎస్. డిగ్రీ తీసుకుంటూవుంది. అందువల్ల ఆమె తల్లిదండ్రులు కూడా గ్రాడ్యుయేట్ సెర్మనీకి హాజరు కావడానికి వచ్చి ఉన్నారు. వారితో కమల సత్యప్రసాదులు మాట్లాడారు.

హ్యూస్టన్ విశ్వవిద్యాలయం వారు గ్రాడ్యుయేట్ సెర్మనీని ఒక పెద్ద హాలులో నిర్వహించారు. పట్టాలు తీసుకునే విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ ఏర్పాటు చేశారు. బి.ఎస్. పట్టా తీసుకొనే వాళ్లకు వేరుగా, ఎమ్.ఎస్. వాళ్లకు వేరుగా, పిహెచ్.డి. వాళ్లకు వేరుగా డ్రెస్ కోడ్ ఉంది. ఆ ఉత్సవానికి పట్టాలు తీసుకునే విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు బంధువులు మిత్రులు సుమారు పదివేల మంది వరకు హాజరయ్యారు. సత్య ప్రకాశ్, ఎమేలియా వేదికను ఎక్కి ఎమ్.ఎస్. డిగ్రీ తీసుకుంటూ ఉండగా చూసి కమల సత్య ప్రసాదులు, ఎమేలియా తల్లిదండ్రులు చాలా ఆనందించారు. ఆ వుత్సవం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు సాగింది. డిగ్రీల ప్రదాన కార్యక్రమం అయిపోయిన తర్వాత అందరూ హాల్ నుంచి బయటకు వచ్చాక సందడి మొదలైంది. విద్యార్థినీ విద్యార్థులందరూ తమ కోసం వచ్చిన బంధుమిత్రులతో ఫోటోలు తీసుకున్నారు. నృత్యాలు చేశారు. అందరికీ చక్కటి భోజనాలు ఏర్పాటు చేశారు. సత్య ప్రకాశ్ తన తల్లిదండ్రులకు సవితకు ఎమేలియాకు, ఆమె తల్లిదండ్రులకు మరికొందరి మిత్రులకు హొటల్ లో భోజనాలు ఏర్పాటు చేశాడు.

కమల సత్య ప్రసాదులు అక్కడ వారం రోజులు పాటు ఉన్నారు. టెక్సాస్ రాష్ట్రంలో చూడదగ్గ ప్రదేశాలను వారు చూడాలనుకున్నారు. సత్య ప్రకాశ్ తన ఉద్యోగానికి వారం రోజులు సెలవు పెట్టి తల్లిదండ్రులతో పాటు ఉన్నాడు. టెక్సాస్ రాష్ట్రంలో డాలస్, హ్యూస్టన్ లు ప్రధానమైన నగరాలు. పెద్ద నగరాలు. కానీ రెండింటిలో ఏ ఒక్కటి కూడా టెక్సాస్ రాష్ట్రానికి రాజధాని కాదు. టెక్సాస్ రాష్ట్రానికి ఆస్టిన్ అనే చిన్న నగరం రాజధానిగా ఉంది. అమెరికాలోని చాలా రాష్ట్రాలకు ఆ రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన పెద్ద నగరాలు రాజధానిగా లేవు. చిన్న నగరాలను రాజధానిగా చేశారు. ఈ పద్ధతి సత్య ప్రసాద్ కు బాగా నచ్చింది. దీనివల్ల అభివృద్ధి కేంద్రీకరించబడకుండా అన్నిచోట్ల జరుగుతుంది.

కమల సత్యప్రసాదులు సత్య ప్రకాశ్ తో కలిసి మొదట హ్యూస్టన్ నగరానికి వెళ్లి నాసా కేంద్ర కార్యాలయాన్ని దర్శించారు. తర్వాత డాలస్ నగరంలోని జాన్ ఫిట్జీరాల్డ్ కెనడి స్మారక కేంద్రాన్ని సందర్శించారు. కెన్నడి **1961- 63** మధ్యకాలంలో తన **43** సంవత్సరాల చిన్న వయసులో అమెరికాకు **35**వ అధ్యక్షునిగా పనిచేశాడు. అతను డాలస్ నగరంలోనే హత్యకు గురయ్యాడు. అతని సమాధిని స్మారక కేంద్రంగా అక్కడే ఏర్పాటు చేశారు. అమెరికాను పాలించిన గొప్ప అధ్యక్షుల్లో కెనడీ ఒకడు. న్యూయార్క్ లోని అంతర్జాతీయ విమానాశ్రయం, ఫ్లోరిడాలో ఉన్న నాసా అంతరిక్ష ప్రయోగ కేంద్రం అతని పేరుతోనే ఉన్నాయి.

అమెరికాకు వెళ్ళిన వాళ్ళు తప్పనిసరిగా చూడాలనుకునేవి రెండు. అవి నయాగరా జలపాతం, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ . నయాగరా జలపాతం న్యూయార్క్ రాష్ట్రంలో ఉంది. డాలస్ నగరం నుంచి న్యూయార్క్ రాష్ట్రంలోని బఫెలో పట్టణానికి వాళ్లు విమానంలో వెళ్లారు. అక్కడికి **30** కిలోమీటర్ల దూరంలో నయాగరా జలపాతం ఉంది. అక్కడి నుంచి కారులో వెళ్తుంటే నయాగరా నది కనిపిస్తూ ఉంది. నదిని చూస్తూ వారు జలపాతం దగ్గరికి వెళ్లారు. దాదాపు **57** మీటర్ల ఎత్తు నుంచి నీళ్లు కిందకి దూకుతూ ఉన్నాయి. అది గొప్ప అద్భుతమైన దృశ్యం. నీళ్లు కిందికి దూకుతున్న జలపాతం హోరు, నీళ్లు కింద పడిన దగ్గర తెల్లటి నురగ, జలపాతం నుంచి వెలువడుతున్న తెల్లటి

నీటి తుంపురులు మేఘాల మాదిరిగా ఏర్పడిన దృశ్యం చూసి అద్భుతమైన అనుభూతికి లోనయ్యారు. నయాగరా జలపాతం అందం చూసి అనుభూతి పొందాలే గానీ దాని అందం గురించి చెప్పడానికి మాటలు సరిపోవని వాళ్ళు భావించారు. ప్రపంచంలోని అన్ని జలపాతాల్లో కెల్లా పెద్దది, ఎత్తైన ఆజలపాతాన్ని చూసి కమల సత్యప్రసాద్ ప్రకాశ్ ఆశ్చర్యంతో పాటు గొప్ప ఆనందానికి లోనయ్యారు.

ఆ తర్వాత వాళ్లు న్యూయార్క్ రాష్ట్రంలోనే ఉన్న స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహాన్ని చూడ్డానికి వెళ్లారు. అది న్యూయార్క్ హార్బర్ కు సమీపంలో అట్లాంటిక్ మహాసముద్రంలోని ఒక చిన్న ద్వీపంలో 93 అడుగుల ఎత్తులో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహముంది. ప్రపంచంలోని ఎత్తయిన విగ్రహాల్లో ఇది ఒకటి. ఎత్తయిన విగ్రహాల్లో మొదటిది మన దేశంలోని గుజరాత్ రాష్ట్రంలో సబర్మతి నది వద్ద నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో ప్రతిష్ఠించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం. దీని ఎత్తు 182 మీటర్లు. దీన్ని ప్రధాని మోడీ నిర్మింప జేశారు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహానికి ప్రపంచవ్యాప్తంగా చాలా గొప్ప పేరుంది. ప్రతి ఏటా కొన్ని లక్షల మంది పర్యాటకులు ఆ విగ్రహాన్ని చూడడానికి వస్తూ ఉంటారు. విగ్రహం నిలబెట్టిన గద్దె ఎత్తు 27 మీటర్లు, విగ్రహం కాలి నించి కాగడ చివరిదాకా ఎత్తు 46 మీటర్లు, మొత్తం విగ్రహం ఎత్తు 93 మీటర్లు. ఆ విగ్రహం చాలా గంభీరంగా ఉంటుంది. మొదటిసారి ఆ విగ్రహాన్ని చూసిన వారు సంభ్రమాశ్చర్యాలను పొందుతారు. విగ్రహం పైకి వెళ్ళడానికి బాల్కనీ లాంటి దారి ఉంది. వాళ్ళు ముగ్గురు పైకి వెళ్లి చూశారు. సత్య ప్రకాష్ ఆ విగ్రహాన్ని అనేక కోణాల నుంచి చాలా ఫోటోలు తీశాడు. విగ్రహం కింద అందమైన పెద్ద పార్కు ఉంది. ముగ్గురు పార్కులో చాలాసేపు తిరిగారు. ఆ పార్కులోనే మ్యూజియముంది. ఆ మ్యూజియంలో విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన చరిత్ర, విగ్రహ నిర్మాణ సాంకేతికత మొదలైన అంశాలను వివరించే పుస్తకాలున్నాయి. సత్యప్రసాద్ విగ్రహ నిర్మాణానికి సంబంధించిన పుస్తకాన్ని కొనుక్కున్నాడు.

ఆ తర్వాత సత్య ప్రకాశ్ తల్లిదండ్రులను తీసుకొని తాను ఉద్యోగం చేస్తున్న సియాటెల్ నగరానికి వెళ్ళాడు. సియాటెల్ వాషింగ్టన్ రాష్ట్రంలో ఉంది. దీన్ని ఎమరాల్డ్ సిటీ అని కూడా అంటారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్

లాంటి పెద్ద పెద్ద ఐటీ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. బోయింగ్ విమానాల తయారీ కేంద్రం కూడా ఇక్కడే ఉంది. ఇక్కడే ఎమేలియా కూడా పని చేస్తూ వుంది. కమల సత్యప్రసాదుల నగర సందర్శనలో ఆమె కూడా పాల్గొంది. ఆకాశాన్నంటే బహుళ అంతస్తుల భవనాలు, వేల రకాల మొక్కలతో అందంగా ఉండే పార్కులు, అమెజాన్ కంపెనీ ఏర్పాటుచేసిన గొప్పదైన అందమైన అద్దాల భవనం మొదలైనవి తల్లిదండ్రులకు చూపిస్తూ సత్య ప్రకాశ్ సియాటెల్ డౌన్ టౌన్ లో తిరుగుతూ ఫోటోలు తీశాడు. అమెరికాలో ప్రధాన నగరాన్ని డౌన్ టౌన్ అంటారు. దాని చుట్టూ కొన్ని శాటిలైట్ టౌన్స్ ఉంటాయి. ఈ డౌన్ టౌన్ లోనే ముఖ్యమైన ప్రధానమైన కార్యాలయాలు పెద్ద పెద్ద భవనాలు ఉంటాయి.

సియాటిల్ నగరానికి ప్రధానమైన ఆకర్షణ స్పేస్ నీడిల్ టవర్. పారిస్ నగరానికి ఐఫిల్ టవర్ ఎలాగో సియాటిల్ కి స్టీల్ తో నిర్మించిన స్పేస్ నీడిల్ టవర్ అలాంటిది. దీని ఎత్తు 605 అడుగులు. దీని పైకి వెళ్లడానికి మూడు లిఫ్ట్ లు ఉన్నాయి. ఈ లిఫ్ట్ లు చాలా వేగంగా సందర్శకులను పైకి కిందకి చేరుస్తూ ఉంటాయి. ప్రకాశ్ ఎమేలియా తో కలిసి తల్లిదండ్రులతో సూర్యాస్తమయం సమయంలో టవర్ పైకి వెళ్లాడు. టవర్ పైనుంచి సూర్యాస్తమయం చాలా అద్భుతమైన దృశ్యం. దాన్ని చూసి కమల సత్యప్రసాద్ లు చాలా ఆనందించారు. రాత్రి వేళ లైట్ల వెలుతురులో వెలిగిపోతున్న సియాటిల్ నగర అద్భుతసౌందర్యాన్ని చూసి వారు సంతోషించారు.

ఆ తర్వాత సత్య ప్రకాశ్ తల్లిదండ్రులతో కలిసి సముద్రమట్టానికి 30 అడుగుల లోతులో ఉన్న భూగర్భ నగరానికి వెళ్లాడు. సియాటెల్ నగరంలో ఇది కూడా మంచి పర్యాటక కేంద్రం. భూగర్భంలో ఉన్నప్పటికీ అందులో చక్కటి దారులు, లైట్లు ఉన్నాయి. గాలి బాగా రావడానికి వెంటిలేటర్ లు ఏర్పాటు చేశారు. భూగర్భ నగర చరిత్రను విశేషాలను తెలియజేయడానికి గైడ్ లు ఉన్నారు. సత్య ప్రసాద్ గైడ్ ద్వారా దాని నిర్మాణాన్ని తెలుసుకొని సంతోషించాడు.

కమల సత్యప్రసాదులు ప్రకాశ్ వివాహాన్ని చేయాలని నిశ్చయించుకుని ఎమేలియా తల్లిదండ్రులను సంప్రదించారు. ఆ సమయంలో ఎమేలియా

తల్లిదండ్రులు సియాటెల్ లోనే ఉన్నారు. వివాహం విశాఖపట్నంలో హిందూ వివాహ పద్ధతిలో జరపడం తమకిష్టమని వారు చెప్పారు. దానికి కమల సత్య ప్రసాదులు దానికి అంగీకరించారు. కమల సత్యప్రసాదులు అమెరికా నుంచి భారతదేశానికి వచ్చారు.

సత్య ప్రకాశ్ ఎమేలియాల వివాహానికి ముహూర్తం నిర్ణయించి అమెరికాలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు సత్యప్రసాద్ తెలియజేశాడు. వారం రోజులు ముందుగానే ప్రకాష్ ఎమేలియా లు విశాఖపట్నానికి వచ్చారు. కమల సత్య ప్రసాదుల ఆహ్వానాన్ని మన్నించి ధరణి పాండురంగరాజులు వివాహానికి రెండు రోజులు ముందుగానే వచ్చారు. వివాహానికి ఎమేలియా తల్లిదండ్రులతో పాటు వారి ముఖ్యమైన బంధువులు విశాఖపట్నం వచ్చారు. సత్య ప్రసాద్ వాళ్ళందరికీ మంచి వసతి ఏర్పాటు చేశాడు. వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో పెద్దగా ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా జరిపించారు. ఎమేలియా తల్లిదండ్రులు చాలా ఆసక్తిగా వివాహాన్ని తిలకించారు, సంతోషించారు. వివాహ సమయంలోని మంత్రాల అర్థాలను అడిగి తెలుసుకున్నారు. ఇంత మంచి సంస్కృతీ సంప్రదాయాలున్న హిందూ మతంలో కుల వ్యవస్థ అనే దుర్మార్గమైన ఆచారం ఉందని తెలుసుకుని వారు చాలా విచారించారు. ఎమేలియా తల్లిదండ్రులు ఆమె బంధువులు వారం రోజులపాటు విశాఖపట్నంలో ఉండి చుట్టుపక్కల ఉన్న సింహాచలం, శ్రీ కూర్మం, అరసవిల్లి సూర్యదేవాలయం, శ్రీ ముఖలింగం, అన్నవరం దేవస్థానాలను దర్శించి అమెరికాకు వెళ్లిపోయారు. రెండు వారాల తర్వాత సత్య ప్రకాశ్ భార్యను తీసుకొని అమెరికాలోని సియాటెల్ నగరానికి వెళ్ళిపోయాడు. ప్రకాశ్ అమెరికా దేశపు అమ్మాయిని పెళ్లి చేసుకోవడం వల్ల అతనికి సంవత్సరం లోగానే అమెరికా దేశపు గ్రీన్ కార్డు లభించింది.

మరుసటి సంవత్సరం సవిత కూడా ఎమ్.ఎస్. లో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలు అయింది. ఆమెకు డాలస్ లోని మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. సత్య ప్రకాశ్ సవితలు సొంత అన్నా చెల్లెలు లాగా చాలా ప్రేమతో అభిమానంతో ప్రతిరోజు మాట్లాడుకుంటూ ఉన్నారు.

గ్రాడ్యుయేషన్ సెర్మనీలో తాను ఎమ్.ఎస్. డిగ్రీ తీసుకునే ఉత్సవానికి రావాలని సవిత తల్లిదండ్రులను కోరింది. వాళ్లు కూడా వస్తానని చెప్పారు.

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి అమెరికా ప్రభుత్వం పది సంవత్సరాలపాటు విజిటింగ్ వీసా ఇచ్చింది. కానీ గ్రాడ్యుయేషన్ సెరమనీ జరిగే సమయంలో పాండురంగరాజుకు షుగర్, బీపీ ఎక్కువై ఆసుపత్రిలో చేరవలసి వచ్చింది. దానితో వాళ్లు సవిత గ్రాడ్యుయేషన్ సెర్మనీకి హాజరు కాలేకపోయారు. అమెరికాలో ఉన్న సత్య ప్రకాశ్ ఎమేలియా లు సవిత గ్రాడ్యుయేషన్ సెర్మనీకి హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

14 వ అధ్యాయం

వ్యాపారవత్తిడిలో పాండురంగరాజు ఆరోగ్యం మరింతగా దిగజారి పోతుండడంతో వ్యాపారం మానేసి ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోమని ధరణి అతన్ని బ్రతిమాలుతూ వచ్చింది. ఆమె మాటలు మన్నించి అతను తన వ్యాపారాన్ని మంచి గుడ్ విల్ కు వేరే వాళ్లకు అమ్మేసి ఇంటిదగ్గర ఉంటున్నాడు.

ధరణి పాండురంగరాజులు సవితకు వివాహ ప్రయత్నం చేస్తున్నారు. సవితకు మంచి సంబంధం చూడమని ధరణి పాండురంగరాజులు సత్యప్రకాశ్ కు చెప్పారు. సత్య ప్రకాశ్ తన కంపెనీలో తనతో పాటు పని చేస్తున్న తనకు మంచి మిత్రుడైన రాజేంద్ర అనే అతని సంబంధాన్ని కుదిర్చాడు. రాజేంద్ర తండ్రి చాలాకాలంగా అమెరికాలో ఉంటున్నాడు. రాజేంద్ర అమెరికాలోనే పుట్టాడు. అతనికి అమెరికా పౌరసత్వం కూడా ఉంది. తమ కుమార్తెకు మంచి సంబంధం కుదిరినందుకు ధరణి పాండురంగరాజులు చాలా సంతోషించారు. పెళ్లి అమెరికాలో జరిగింది. పెళ్ళికి ధరణి పాండురంగరాజులు, కమల సత్యప్రసాదులు వెళ్లారు. కమల సత్యప్రసాదులు అమెరికాలో పది రోజులు మాత్రమే ఉండి విశాఖపట్నం కు తిరిగి వచ్చారు. ధరణి పాండురంగ రాజులు నెల రోజులపాటు కూతురు అల్లుడు దగ్గర ఉండి నయాగరా జలపాతం, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ మొదలైన దర్శనీయ స్థలాలను చూసి ఇండియాకు వచ్చారు.

పాండురంగరాజుకు ఒక తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయాడు. విశాఖపట్నం నుంచి కమల సత్యప్రసాద్ లు వెంటనే వచ్చి ధరణి ఓదార్చారు. ధరణి తల్లిదండ్రులు వచ్చారు. అమెరికా నుంచి సవిత రాజేంద్రలు వచ్చారు. సత్య ప్రసాద్ సవిత చేత అంత్యక్రియల

కార్యక్రమాన్ని జరిపించాడు. చిన్న దినం, పెద్దదినం అయిపోయిన తర్వాత సవిత ఆమె భర్త రాజేంద్ర అమెరికాకు వెళ్లిపోయారు. ధరణి తల్లిదండ్రులు కొన్ని రోజులుండి వారి స్వగ్రామానికి వెళ్లిపోయారు. సత్యప్రసాద్ కమలను ధరణి దగ్గరే ఉంచి తాను విశాఖపట్నానికి వెళ్ళిపోయాడు. కమల ధరణిని ఓదారుస్తూ నెలరోజులు పైగా ఆమె దగ్గరే ఉంది. ధరణి భర్త పోయిన దుఃఖం నుంచి మెల్లగా కోలుకుంది. కమల విశాఖపట్నం వెళ్లిపోయింది. సవిత అమెరికా నుంచి ప్రతిరోజు తల్లికి ఫోన్ చేస్తూ అమెరికాలో తన దగ్గరకు వచ్చి ఉండమని బ్రతిమాలుతూ ఉంది. కమల సత్య ప్రసాదులు కూడా ఆమె కొంతకాలం అమెరికాలో ఉంటే స్థలం మార్పిడి వల్ల ప్రశాంతత వస్తుందని చెబుతూ వచ్చారు. ధరణికి అమెరికాకు వెళ్లడం ఇష్టం లేదు. అయినప్పటికీ కూతురు బాగా బ్రతిమాలుతూ ఉండడం చేత, కమల సత్యప్రసాదులు చెబుతూ ఉండడం చేత అమెరికాకు వెళ్ళింది. అక్కడ కూతురు అల్లుడు ఆఫీసుకు వెళ్లిపోయేవారు. ధరణి ఒంటరిగా ఇంట్లో ఉంటూ వుంది. చుట్టుపక్కల ఎవరు మాట్లాడే వాళ్ళు కూడా లేరు. ఒంటరిగా ఆమెకు చాలా విసుగ్గా ఉండేది. శని ఆదివారాలు మాత్రం కూతురు అల్లుడు ధరణిని అమెరికాలోని ఇతర ప్రాంతాలకు తీసుకొని వెళ్తున్నారు. అక్కడ జీవితం ధరణికి ఏమాత్రం నచ్చలేదు. ఆమె అక్కడ ఉండలేక నెల రోజులకు ఇండియాకు తిరిగి వచ్చింది.

ధరణి తల్లిదండ్రులు ధరణి వద్దకు వచ్చి కొన్ని రోజులున్నారు. అల్లుడు చనిపోయినందుకు ధరణి ఒంటరిదైనందుకు వాళ్లు చాలా బాధపడ్డారు. ధరణి తల్లిదండ్రులతో పాటు వెళ్లి స్వగ్రామంలో కొన్ని రోజులుంది. అక్కడ ఎక్కువ రోజులు ఉండలేకపోయింది. ఆమె తిరిగి పట్నంలో ఉన్న తన సొంత ఇంటికి వచ్చింది. ధరణి తల్లిదండ్రులు అప్పుడప్పుడు ఆమె దగ్గరకు వచ్చి రెండు మూడు రోజులుండి ఆమెను ఓదారుస్తూ తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తున్నారు. ధరణికి చాలా భారంగా రోజులు గడుస్తూ ఉన్నాయి. ఆమెకు ప్రతిరోజు కమల ఫోన్ చేస్తూ కొద్దిరోజులపాటు విశాఖపట్నం వచ్చి తమతో పాటు ఉండమని చెబుతూ వుంది. అప్పుడప్పుడు సత్యప్రసాద్ కూడా ఫోన్ చేసి ఆమెను ఓదారుస్తున్నాడు.

సవిత అమెరికా నుంచి ధరణికి ఫోన్ చేసి తన దగ్గరకు వచ్చి ఉండమని పోరుతూ ఉంది. కానీ అక్కడ జీవితం ఆమెకు ఏమాత్రం నచ్చకపోవడం చేత

తాను అమెరికా రాలేనని ఆమె కూతురికి చెప్పింది. అప్పుడు సవిత తల్లిని మళ్లీ పెళ్లి చేసుకోమని చెప్పింది. మారుతున్న కాలం ప్రకారం మనమూ మారాలని ఒంటరిగా జీవితాన్ని భారంగా గడిపే కంటే తోడు కోసం మళ్ళీ పెళ్లి చేసుకోవడం మంచిదని, అది తప్పు కాదని తల్లికి చెబుతూ వచ్చింది. కానీ ధరణి దానికి అంగీకరించలేదు.

15 వ అధ్యాయం

విశాఖపట్నంలో కమల ఆరోగ్యం బాగా దెబ్బతినింది. రోజురోజుకు ఆమె చిక్కిపోతూ వుంది. అనేక రకాల పరీక్షలు చేయించగా ఆమెకు క్యాన్సర్ వచ్చిందని, అది చివరి దశలో ఉందని, ఆమె ఎంతో కాలం బతకదని డాక్టర్లు చెప్పారు. ఆ విషయాన్ని సత్య ప్రసాద్ ధరణికి చెప్పాడు. ధరణి వెంటనే విశాఖపట్నం వెళ్లి కమలకు సత్యప్రసాద్ కు ధైర్యం చెప్పే ప్రయత్నం చేసింది. ఆమె రెండు రోజులుండి తిరిగి తన ఊరికి వచ్చింది. సత్యప్రసాద్ కమలకు మంచి వైద్యం చేయిస్తూ ఆమెను బతికించుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశాడు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కమల చివరకు మంచం మీదనే నెల రోజుల పాటు ఉండి చనిపోయింది. చనిపోవడానికి ముందు ఆమె సత్యప్రసాద్ తో మాట్లాడింది.

“మీలాంటి ఉత్తముడైన భర్త లభించడం నా అదృష్టం. మీ వల్ల ఉత్తముడైన మీలాంటి కొడుకు పుట్టాడు. బతికినంత కాలం మీతో నేను చాలా సంతోషంగా జీవించాను. మీ దగ్గర నేను ఏనాడూ కొంచెం కూడా బాధపడలేదు. అలాంటి మీతో చివరిదాకా నడిచే అదృష్టం నాకు లేకపోయింది. పుట్టడం చనిపోవడం మన చేతుల్లో లేదు. నేను చనిపోతున్నాను. చనిపోతున్నందుకు నాకు పెద్దగా బాధ లేదు. కానీ మిమ్మల్ని ఒంటరివాన్ని చేసి వెళ్ళిపోతున్నందుకే నాకు చాలా బాధగా ఉంది. నేను చనిపోతున్నందుకు మీరు నా గురించి ఎక్కువగా బాధపడొద్దు. మీరు బాధపడితే నేను చూడలేను. నా మనసుకు శాంతి ఉండదు. నేను చనిపోయిన తర్వాత మీరు ఒంటరిగా జీవించలేరు. ఒంటరితనంతో మీరు బాధపడొద్దు. మీరు ఒంటరితనంతో బాధపడుతూ జీవిస్తే నా మనసుకు శాంతి లభించదు. ఒంటరితనంతో మీరు బాధపడకుండా ఉండడానికి నేను ఒక మాట చెబుతాను, మీరు వింటారా?” అన్నది కమల.

"కమలా, నీకు ఏమీ కాదు. నువ్వు అధైర్య పడవద్దు. బాధపడవద్దు. నీకు తప్పనిసరిగా బాగవుతుంది. నాతో కలిసి ఇంకా చాలా సంవత్సరాలు సంతోషంగా జీవిస్తావు'' అన్నాడు సత్యప్రసాద్.

"లేదండి, నా సంగతి నాకు తెలుస్తూ వుంది. నేను ఇంకా వారం కంటే ఎక్కువ రోజులు బతకను. నా చివరి కోరిక మీరు తీర్చాలి, తీరుస్తానని మాట ఇవ్వండి'' అన్నది కమల.

అలాగే తీరుస్తాను, నేను చేయగలిగినదైతే తప్పనిసరిగా చేస్తాను. ఏంటో చెప్పు'' అన్నాడు సత్యప్రసాద్.

"ధరణి అక్క చాలా మంచిది. ఎంతో ఉత్తమురాలు, మనకు మన కుటుంబానికి చాలా సాయం చేసింది. త్రికరణ శుద్ధిగా మన మేలును కోరిన గొప్ప వ్యక్తి ఆమె. ఆమె భర్త కూడా చాలా మంచివారు. అలాంటి వ్యక్తులు మనకు కుటుంబ స్నేహితులు కావడం మన అదృష్టం. భర్త చనిపోయిన తర్వాత ఆమె ఒంటరిగా కష్టంగా కాలం గడుపుతూ వుంది. మీరంటే ఆమెకు చాలా అభిమానం, గౌరవం. నేను చనిపోయిన తర్వాత మీరు ఒంటరిగా ఉండకుండా ధరణి అక్కని పెళ్లి చేసుకోండి. దానివల్ల ఆమెకు చాలా మేలు చేసిన వారవుతారు. మీకూ ఒంటరితనం తప్పుతుంది'' అన్నది కమల.

"కమలా, నువ్వు ఇలా మాట్లాడకూడదు. ఏ స్త్రీ కూడా ఇలా మాట్లాడదు. సాధారణంగా స్త్రీలు తాము చనిపోయిన తర్వాత తన భర్త మళ్లీ పెళ్లి చేసుకోకూడదని, చనిపోయిన తననే స్మరిస్తూ కాలం గడపాలని కోరుకుంటారు. కానీ నీవు దానికి భిన్నంగా నా క్షేమాన్ని కోరి నేను కష్టపడకుండా ఉండాలని, సుఖంగా జీవించాలని నన్ను మళ్లీ పెళ్లి చేసుకోమని కోరుతున్నావు. భర్త మీద గాఢమైన ప్రేమానురాగాలు, నిస్వార్థపరమైన ప్రేమతత్వం ఉన్నవాళ్లే ఇలా కోరగలరు. నిస్వార్థపరత్వం, గాఢమైన ప్రేమానురాగాలు కలిగిన నువ్వు నాకు భార్యగా లభించడం నిజంగా నా అదృష్టం. అలాంటి నీ స్థానంలో నేను మరొకరిని ఊహించుకోలేను, నేను ధరణి గారిని పెళ్లి చేసుకోలేను. నువ్వు ఇలా మాట్లాడటం నాకు చాలా ఇబ్బందిగా ఉంది. దీన్ని గురించి ఇంక మాట్లాడవద్దు'' అన్నాడు సత్యప్రసాద్.

"మీరు ఇలా మాట్లాడతారని నాకు తెలుసు, అందుకనే నేను మీతో నా చివరి కోరిక తీర్చాలని మాట తీసుకున్నాను. ఒకసారి కుటుంబ జీవనానికి అలవాటు పడ్డవారు జీవిత భాగస్వామిని కోల్పోతే ఒంటరిగా బతకటం చాలా కష్టం. మీరు వంట చేసుకోలేరు, హోటల్ భోజనం ఏమాత్రం మంచిది కాదు. ఇంటికి వచ్చిన తర్వాత మీతో మాట్లాడటానికి మీ కష్టసుఖాలు పంచుకోవడానికి ఒక జీవిత భాగస్వామి తప్పనిసరిగా అవసరం. ధరణి అక్కకు కూడా జీవిత భాగస్వామి చాలా అవసరం. మీరిద్దరూ ఒకరినొకరు బాగా తెలిసినవారు, పరస్పరం బాగా అర్థం చేసుకున్నవారు, ఆమె మీ మంచిని మీ ఆరోగ్యాన్ని మీ సుఖాన్ని త్రికరణశుద్ధిగా కోరుతున్న వ్యక్తి. అలాంటి వ్యక్తి భార్యగా లభిస్తే మీ శేష జీవితం చాలా సంతోషంగా సాగుతుంది. నా చివరి కోరిక తీరుస్తానని మీరు మాట ఇచ్చారు. కాబట్టి మీరు ఇంక ఏమీ మాట్లాడకుండా ధరణి అక్కను పెళ్లి చేసుకుంటానని నాకు మాట ఇవ్వండి" అన్నది కమల.

"చివరి కోరిక అంటున్నావు కాబట్టి నువ్వు కోరినట్లుగా ఆమెను పెళ్లి చేసుకుంటాను. కానీ నాకు నేనుగా ఆమెను అడగను. ఆమె నన్ను కోరితే ఆమెను పెళ్లి చేసుకునే విషయం గురించి ఆలోచిస్తాను. నువ్వు యీ విషయం గురించి ఆమెతో మాట్లాడకూడదు" అన్నాడు సత్యప్రసాద్.

"మీరు ఆ మాట చెప్పారు చాలు, మీరు చెప్పినట్లుగా నేను ఆమెతో ఈ విషయం గురించి మాట్లాడను. ఆమె కోరితేనే మీరు పెళ్లి చేసుకోండి. ఆమె తప్పనిసరిగా మిమ్మల్ని కోరుతుందని నేను అనుకుంటూ ఉన్నాను. నేను మన బాబు ప్రకాశ్ ను చూడాలనుకుంటున్నాను. వాడిని రమ్మని చెప్పండి" అన్నది కమల.

"అలాగే మన అబ్బాయిని, కోడలును కూడా రమ్మని చెబుతాను. నువ్వు ఇలాంటి విషయాల గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండు" అన్నాడు సత్య ప్రసాద్.

చెప్పినట్లుగానే సత్య ప్రసాద్ కమల అనారోగ్యం విషయం చెప్పి కొడుకును కోడలును వెంటనే ఇండియాకి రమ్మని చెప్పాడు. సత్య ప్రకాశ్ వెంటనే భార్యను తీసుకొని వచ్చాడు. వారు వచ్చిన రెండు రోజుల్లోనే కమల చనిపోయింది.

ధరణి వెంటనే విశాఖపట్నం వెళ్లి సత్య ప్రసాద్ ను ఓదార్చే ప్రయత్నం చేసింది. అంత్యక్రియలు అయిపోయిన తర్వాత ధరణి తన ఊరికి వెళ్లిపోయింది. పెద్దకర్మకు సత్యప్రకాశ్ వర్తమానం పంపించాడు. ధరణి వెళ్ళింది. సత్య ప్రసాద్ ను చూసి ఆమె చాలా కంగారు పడింది. అతను నిద్రాహారాలు సరిగా లేకుండా భార్యనే తలుచుకొని బాధపడుతూ చిక్కి శల్యమైపోయాడు. భార్య మరణానికి అతను ఎంతగా తల్లడిల్లుతున్నాడో ఆమె అర్థం చేసుకుంది. అతని పరిస్థితి చూసి ఆమె చాలా బాధపడి తనకు చేతనైన మాటలతో అతన్ని ఓదార్చే ప్రయత్నం చేసింది.

"మాస్టారూ, కమల చనిపోవడం చాలా బాధాకరం, చావు పుట్టుకలు మన చేతుల్లో లేవు. జీవిత భాగస్వామిని కోల్పోవడం చాలా కష్టమే, అయినప్పటికీ మన చేతుల్లో లేని విషయాలను గురించి మనం నిద్రాహారాలు మానేసి బాధపడటం వల్ల ఏమీ ప్రయోజనం లేదు. మీరు ఇలా నిద్రాహారాలు మానేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటే చనిపోయిన కమల ఆత్మ శాంతిస్తుందా? మిమ్మల్ని గాఢంగా ప్రేమించే అభిమానించే మీ మీదనే ఆశలు పెట్టుకున్న అబ్బాయి, కోడలు మిమ్మల్ని ఈ స్థితిలో చూసి తట్టుకోగలరా? మీరు ఇలా ఉంటే అమెరికాలో వాళ్ళు సుఖంగా సంతోషంగా ఎలా ఉంటారు? సత్య ప్రకాశ్ ఈ స్థితిలో మిమ్మల్ని వదిలిపెట్టి అమెరికాకు ఎలా వెళ్ళగలడు? ఇదంతా ఆలోచించి పిల్లల కోసమైనా మీరు చనిపోయిన కమలను మరిచిపోవాలి. ఎప్పుటి లాగా జీవితాన్ని గడపాలి. చనిపోయే వరకు మనిషి తన బాధ్యతలు విధులు నిర్వహిస్తూ జీవించాలి. అంతేతప్ప చనిపోయిన వారిని తలచుకొని ఇలా బాధపడుతూ కూర్చోవడం ఏమాత్రం మంచిది కాదు. ఇవన్నీ మీకు తెలియని విషయాలు కాదు. జాగ్రత్తగా ఆలోచించండి. ప్రకాశ్ ను బాధ పెట్టకండి. మీలో మార్పు వస్తే ప్రకాశ్ సంతోషంగా అమెరికాకు వెళ్ళగలడు. లేకపోతే కష్టం. ఆలోచించండి'' అన్నది ధరణి.

సత్యప్రసాద్ ఆమె మాటలు విన్నాడు కానీ, అవి పెద్దగా పనిచేయలేదు. పెద్దకర్మ అయిపోయిన తర్వాత ధరణి మళ్లీ సత్య ప్రసాద్ కు కొన్ని ఓదార్పు మాటలు చెప్పి తన ఊరికి వెళ్లిపోయింది.

ఎమేలియా సత్యప్రసాద్ ను చూసి చాలా ఆశ్చర్యపోతూవుంది. భార్యను అంత గాఢంగా ప్రేమించే వాళ్ళు, భార్య మరణానికి అంత ఎక్కువగా బాధపడేవాళ్లను ఆమె అంతకు ముందు చూడలేదు. మొదటిసారి సత్యప్రసాద్ లో ఆ లక్షణం చూసింది. ఆమె దగ్గరుండి సత్య ప్రసాదుకు భోజనం పెట్టడం, అతనికి అవసరమైన వస్తువులు ఇవ్వడం మొదలైనవన్నీ ఎంతో గౌరవంతో చేస్తూ ఉంది.

సత్యప్రకాశ్ తండ్రి పరిస్థితిని చూసి తట్టుకోలేకపోతున్నాడు. చాలా రకాలుగా ఓదార్చే ప్రయత్నం చేశాడు, కానీ సత్యప్రసాద్ లో పెద్దగా మార్పు రాలేదు. అతను సున్నిత హృదయుడు కావడం చేత భార్య మరణించిన దుఃఖం నుంచి బయటకు రాలేకపోతున్నాడు. చనిపోయిన భార్యను తలుచుకుంటూ చాలా విచారంలో మునిగి ఉన్నాడు. ప్రకాశ్ అమెరికా నుంచి వచ్చి 20 రోజులు పైగా అయింది. అతను నెలరోజులు మాత్రమే సెలవు పెట్టి ఇచ్చాడు. తను తిరిగి అమెరికాకు వెళ్ళవలసి ఉంది. ముందుగా టికెట్ బుక్ చేసుకోవాలి. కానీ తండ్రిని ఆ పరిస్థితులు వదిలిపెట్టి వెళ్ళటం అతనికి ఇష్టం లేదు. చిన్నప్పటి నుంచి తండ్రి తనను ఎలా పెంచాడో, ఏ వయసులో ఏమి నేర్పించాలో అవన్నీ నేర్పించి బాధ్యతాయుతంగా నిజాయితీగా మంచి మనిషిగా నడుచుకునే లాగా తయారుచేసిన తండ్రిని ఈ పరిస్థితుల్లో చూసి అతను భరించలేక పోతున్నాడు. తండ్రి తన పట్ల చూపించిన ప్రేమను ఆదరణను అభిమానాన్ని శ్రద్ధను గుర్తుకు చేసుకున్నాడు. అలాంటి తండ్రిని భార్యా దుఃఖసాగరంలో వదిలిపెట్టి వెళ్ళటం ఇష్టం లేక అతను అమెరికాలోని కంపెనీ వారితో మాట్లాడి నెల రోజుల పాటు విశాఖపట్నం నుంచి పని చేసేటట్లుగా అనుమతి చేసుకున్నాడు. తండ్రికి మూడు పూటలా ఆహారం తయారు చేసి పెట్టడానికి ఒక వంట మనిషిని, ఇంట్లో అంట్లు తోమడం ఇల్లు శుభ్రం చేయడానికి ఒక పని మనిషిని కుదిర్చాడు. ఇంట్లోనే ఉంటే తండ్రి మరింతగా విచారంలో మునిగిపోతాడని భావించి ప్రతిరోజు తండ్రిని విశ్వవిద్యాలయానికి కారులో తీసుకొని వెళ్ళి సాయంత్రం మళ్ళీ తీసుకొని వస్తున్నాడు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠాలు చెప్పడం పరిశోధకులతో పరిశోధన గురించి మాట్లాడటం ఇతర సహధ్యాపకులతో మాట్లాడటం వల్ల సత్యప్రసాదులో కొంత మార్పు వచ్చింది. అలా 20 రోజులు గడిచాయి. కానీ

సత్యప్రసాద్ లో పూర్తిగా మార్పు రాలేదు. అతను ఇంకా ఒంటరిగా విచారంగానే కనిపిస్తున్నాడు. ప్రకాశ్ తండ్రి తో చెప్పాడు.

"నాన్నా, నేను నెల రోజులు సెలవు పెట్టి వచ్చాను. మరొక నెల రోజులు ఇక్కడి నుంచి పని చేసేటట్లుగా అనుమతి తీసుకున్నాను. అది కూడా అయిపోతూ ఉంది. నేను తొందరలో అమెరికాకు వెళ్ళవలసి ఉంది. కానీ మీరు అమ్మ చనిపోయిన దుఃఖంలో ఉన్నారు. మిమ్మల్ని ఈ స్థితిలో వదిలిపెట్టి వెళ్ళటం నాకు ఇష్టం లేదు. కాబట్టి నేను అమెరికాకు వెళ్ళను. ఇక్కడే ఉంటాను, కొద్దిరోజులు మీతో పాటు ఉండి తర్వాత ఇండియాలోనే ఏదైనా ఉద్యోగం చూసుకుంటాను'' అన్నాడు.

"వద్దు నాన్నా, నువ్వు నాకోసం అమెరికా ఉద్యోగాన్ని మానుకోవద్దు. నువ్వు అమెరికాకు వెళ్ళు, నేను తొందరలోనే అమ్మ చనిపోయిన దుఃఖం నుంచి బయట పడతాను. ప్రతిరోజు యూనివర్సిటీకి వెళుతున్నాను. అక్కడ విధి నిర్వహణలో ఉండటం వల్ల కొంత ప్రశాంతంగానే ఉంటున్నాను. నువ్వు ఎంతో ఇష్టంతో అమెరికాకు వెళ్లావు. అమెరికా అమ్మాయిని పెళ్లి చేసుకున్నావు. నాకోసం నువ్వు అమెరికా జీవితాన్ని ఉద్యోగాన్ని వదులుకోవద్దు'' అని సత్యప్రసాద్ మరీ మరీ కొడుకుతో చెప్పాడు. దానితో సత్యప్రకాశ్ తండ్రికి అనేక జాగ్రత్తలు చెప్పి ప్రతిరోజు ఫోన్ చేసి మాట్లాడుతుంటానని చెప్పి భార్యను తీసుకొని అమెరికాకు వెళ్ళిపోయాడు.

16 వ అధ్యాయం

సత్య ప్రసాద్ ఒంటరి వాడయ్యాడు. విశ్వవిద్యాలయానికి వెళ్ళినప్పుడు అక్కడ ఉన్నంత సేపు అతనికి భార్య జ్ఞాపకాలు పెద్దగా గుర్తుకు వచ్చేవి కాదు. ఇంటికి వచ్చినప్పటి నుంచి అవే జ్ఞాపకాలు పదేపదే వచ్చి అతన్ని చాలా బాధ పెట్టేవి. ఎంత వద్దనుకున్నా అతనికి ఆ బాధ తప్పడంలేదు. సత్య ప్రకాష్ అమెరికా నుంచి ప్రతిరోజు ఫోన్ చేసి తండ్రితో మాట్లాడుతూ అతన్ని సంతోషంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ ఆ ప్రయత్నం కూడా పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు.

ధరణి ఊరికి వచ్చిన తర్వాత తరచుగా సత్యప్రసాద్ కు ఫోన్ చేసి అతన్ని ఓదార్చే ప్రయత్నం చేసింది. అలాగా ఆరు నెలలు గడిచాయి. ఆ తర్వాత ఒక రోజు ధరణి సత్య ప్రసాద్ కు ఫోన్ చేసి “మా అమ్మాయి నన్ను మళ్ళీ పెళ్లి చేసుకోమంటూ బలవంతం చేస్తూ ఉందని'' సత్యప్రసాద్ తో చెప్పింది.

“మాస్టారూ, ఒంటరి జీవితం చాలా భారంగా కష్టంగా ఉంది. దీన్నుంచి ఎలా బయటపడాలో నాకు అర్థం కావడం లేదు. సవిత నన్ను అమెరికాకు వచ్చేయమని శత విధాలుగా పోరుతూ వుంది. కానీ అక్కడ జీవితం నాకు ఏమాత్రం నచ్చలేదు. అందువల్ల నేను అక్కడికి వెళ్ళదలుచుకోలేదు. ఒంటరిగా నేను పడుతున్న బాధను గమనించి సవిత నన్ను మళ్ళీ పెళ్లి చేసుకోమని, అది తప్పు కాదని కాలంతో పాటు మనమూ మారాలని చాలా రోజులుగా చెబుతూ వుంది. కానీ నేను దానికి అంగీకరించలేదు. దీన్ని గురించి మీరేమంటారు?'' అని ఆమె మాట్లాడింది.

“ధరణి గారూ, అమ్మాయి చెప్పిన మాట మంచిదే. ఒంటరిగా జీవితాన్ని భారంగా గడిపే దాని కంటే తోడు కోసం మళ్ళీ పెళ్లి చేసుకోవడం తప్పు కాదు, సరి కదా అది అవసరం కూడా. మిమ్మల్ని అర్థం చేసుకున్న వ్యక్తిని, మీకు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోండి. కొత్తజీవితాన్ని ప్రారంభించండి. జీవితాన్ని సుఖమయం చేసుకోండి. సంతోషంగా గడపండి'' అన్నాడు.

“అలాగే మాస్టారూ, మీరు చెప్పారు కాబట్టి మీరు చెప్పినట్లుగా నాకు నచ్చిన వ్యక్తిని, నన్ను అర్థం చేసుకున్న వ్యక్తిని పెళ్లి చేసుకుంటాను. నాకు నచ్చిన వ్యక్తి మీరే, మీకంటే నన్ను బాగా అర్థం చేసుకున్న వ్యక్తులు ఎవరూ లేరు. కాబట్టి మనిద్దరం పెళ్లి చేసుకుందాం. మీరూ ఒంటరిగా ఉన్నారు. ఇంకా చాలా కాలం జీవించవలసి ఉంది, మా చెల్లెలు కమల చనిపోయిన తర్వాత మీరు ఒంటరిగా భారంగా గడుపుతున్నారని మీ మాటల వల్ల నాకు తెలుస్తూనే ఉంది. కాబట్టి మాస్టారు, మనిద్దరం పెళ్లి చేసుకుని మన ఒంటరి జీవితానికి స్వస్తి పలుకుదాం. కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం'' అన్నది ధరణి.

ఆమె మాటలకు సత్యప్రసాద్ కొంచెం సేపు ఏమీ మాట్లాడలేకపోయాడు. అతనికి ఆమెను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. కానీ ఆమె చెప్పింది మాత్రం

వాస్తవం. ఆమెకు అతనే ఇష్టమైన వ్యక్తి, ఆమెను బాగా అర్థం చేసుకున్న వ్యక్తి కూడా అతడే, ఆమెకు ఏం చెప్పాలో తోచక అతను మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు ధరణి తానే మాట్లాడింది.

"మాస్టారూ, మీరు మౌనంగా ఉండి పోయారు. నేను చెప్పిన దాంట్లో ఏమైనా తప్పుందా చెప్పండి. మళ్ళీ చెబుతున్నాను నాకు ఇష్టమైన వ్యక్తి మీరు ఒక్కరే, నన్ను బాగా అర్థం చేసుకున్న వ్యక్తి కూడా మీరు ఒక్కరే, పెళ్ళంటూ చేసుకుంటే మిమ్మల్నే చేసుకుంటాను. మరొకరిని ఎవరినీ చేసుకోను, మీరు మన పెళ్ళికి అంగీకరించకుంటే నేను ఇలాగే బాధపడుతూ, భారంగా శేష జీవితం గడుపుతాను. నేను ఒంటరిగా బాధపడుతూ జీవించాలో, లేక మీతో కలిసి సంతోషంగా జీవించాలో మీరే నిర్ణయించండి, నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది. దయచేసి నన్ను అర్థం చేసుకోండి'' అన్నది ధరణి.

"ధరణి గారూ, మీరు మన పెళ్ళి మాట చెప్పిన తర్వాత నాకు ఏం మాట్లాడాలో అర్థం కాక మౌనంగా ఉండిపోయాను. మీరు చెప్పినట్లుగా నేను మీకు నచ్చిన వ్యక్తిని కావచ్చు, మిమ్మల్ని అర్థం చేసుకున్న వ్యక్తిని కూడా కావచ్చు. మిమ్మల్ని పెళ్లి చేసుకోకపోవడానికి నాకు ఎలాంటి కారణం కనిపించలేదు, కానీ నాకెందుకో మిమ్మల్ని పెళ్లి చేసుకుంటానని చెప్పలేకపోతున్నాను. కమల నాకు చాలా ఇష్టమైన వ్యక్తి, ఆమె చనిపోయిన తర్వాత ఆమె స్థానంలో మరొకరిని పెళ్లి చేసుకోవడం నాకెందుకో మంచిదిగా అనిపించడం లేదు. దయచేసి మీరు నన్ను అర్థం చేసుకోండి'' అని ఫోన్ పెట్టేసాడు.

అతని ప్రవర్తనకు ధరణి బాధపడింది. అయినప్పటికీ సత్యప్రసాద్ మనస్తత్వం ఆమెకు బాగా తెలుసు కాబట్టి కొంచెం సేపు ఆలోచించిన తర్వాత అతని ప్రవర్తనకు పెద్దగా నొచ్చుకోలేదు. భార్యను గాఢంగా ప్రేమించిన వాళ్ళు, సున్నిత మనస్కులు అలాగే ఉంటారని ఆమె సమాధాన పడింది.

ధరణి ఈ విషయమంతా సవితకు చెప్పింది. సవిత సత్యప్రసాద్ గారితో తాను మాట్లాడతానని చెప్పింది. సవిత మొదట ఫోన్ లో సత్యప్రకాశ్ తో మాట్లాడింది.

"అన్నయ్యా, ప్రసాద్ బాబాయ్ గారు ఎలా ఉన్నారు. బాబాయ్ తో మాట్లాడుతున్నావా?'' అని అడిగింది.

"నాన్నగారితో ప్రతిరోజు మాట్లాడుతున్నాను. అమ్మ చనిపోయిన తర్వాత ఆయన చాలా డీలా పడిపోయారు. అమ్మను మర్చిపోలేక పోతున్నారు. ఒంటరితనంతో బాధపడుతున్నారు. రోజులు భారంగా గడుస్తున్నాయి. నేను ప్రతిరోజు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నాను. ధరణి అమ్మగారు ఎలా ఉన్నారు?'' అని ప్రకాశ్ అడిగాడు.

"అమ్మ పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆమె కూడా నాన్న చనిపోయినప్పటి నుంచి ఒంటరితనంతో రోజులు భారంగా గడుపుతూ వుంది. నా దగ్గరికి వచ్చి ఉండమని ప్రతిరోజు బతిమాలుతున్నాను. కానీ రావడం లేదు, చివరకు నేను అమ్మను మళ్ళీ పెళ్లి చేసుకోమన్నాను. దానికి కూడా అంగీకరించడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు'' సవిత చెప్పింది.

"మళ్ళీ పెళ్లి చేసుకోమని నువ్వు అమ్మకు చెప్పిన ఆలోచన బాగుంది. నేను కూడా నాన్నకు మళ్ళీ పెళ్లి చేసుకోమని చెబుతాను. ఒంటరితనంతో రోజులు భారంగా గడపడం కంటే మళ్ళీ పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించడం అవసరం కదా'' అన్నాడు.

"అన్నయ్యా, ధరణి అమ్మ , ప్రసాద్ బాబాయ్ ఇద్దరు ఒకే పరిస్థితిలో ఉన్నారు. ఇద్దరు జీవిత భాగస్వామిని కోల్పోయి రోజులు భారంగా గడుపుతున్నారు. వీరిద్దరూ పరస్పరం బాగా అర్థం చేసుకున్నవారు. ఒకరి మీద ఒకరికి మంచి గౌరవం, అభిమానం ఉన్నాయి. చాలాకాలంగా కుటుంబ స్నేహితులు, ఒకే కుటుంబంగా లాగా జీవిస్తున్నారు. వీళ్ళిద్దరికీ పెళ్లి చేస్తే బాగుంటుందని నా ఉద్దేశం, నువ్వేమంటావు'' అన్నది సవిత.

"నువ్వు చెప్పిన ఆలోచన చాలా బాగుంది. నాకెందుకో ఈ ఆలోచన రాలేదు. నేను నాన్నతో ధరణి అమ్మను పెళ్లి చేసుకోమని చెబుతాను. నువ్వు ధరణి అమ్మతో ప్రసాద్ బాబాయ్ ని పెళ్లి చేసుకోమని చెప్పు, ఇద్దరం కలిసి ఇద్దరిని ఒప్పించి ఎలాగైనా వాళ్ళిద్దరికీ పెళ్లి చేసి వారు కొత్త జీవితం ప్రారంభించేలాగా చేద్దాం'' అన్నాడు.

సవిత "సరే అన్నయ్య అలాగే చేద్దాం" అని చెప్పింది

సత్య ప్రకాశ్ తండ్రికి ఫోన్ చేశాడు.

"నాన్నా, ఎలా ఉన్నారు, వంట మనిషి వంట బాగా చేస్తూ వుందా? ఆమె సరిగా రావడం లేదని వంట సరిగా చేయడం లేదని ఆ మధ్య మీరు చెప్పారు. ఆమె వస్తూ వుందా లేక మానేసిందా" అని తండ్రిని అడిగాడు.

"లేదు నాన్నా, ఆమె రావడం లేదు. పని మానేసింది. నేనే వంట చేసుకునే ప్రయత్నం చేశాను కానీ అది కుదరలేదు" అన్నాడు.

"మరి భోజనం ఎలా చేస్తున్నారు? హెూటల్లో చేస్తున్నారా, హెూటల్లో భోజనం ఈ వయసులో మీ ఆరోగ్యానికి మంచిది కాదు. ఇంటి భోజనం చాలా అవసరం" అన్నాడు.

"ఉదయం పూట తొందరగా యూనివర్సిటీ కి వెళ్లి అక్కడ క్యాంటీన్ లో టిఫిన్ చేస్తున్నాను. మధ్యాహ్నం భోజనం కూడా క్యాంటీన్ లోనే చేస్తున్నాను. రాత్రి హెూటల్లోనే చపాతి తింటున్నాను. మూడు పూటలా హెూటల్లోనే తింటున్నాను. నువ్వు చెప్పినట్లుగా ఈ వయసులో హెూటల్ భోజనం మంచిది కాదని తెలుసు. కానీ ఇంతకంటే నాకు వేరే మార్గం కనిపించడం లేదు. నేను వంట చేసుకునే ప్రయత్నం చేశాను. కానీ నేను చేసిన వంట నాకు ఏమాత్రం రుచించడం లేదు. నేను తినలేక పోతున్నాను. వ్యక్తులు ఉన్నప్పుడు వారి విలువ తెలియదు. వారు చనిపోయిన తర్వాత వారి విలువ తెలుస్తుంది. మీ అమ్మ నేను చెప్పకుండానే నా మనసు తెలుసుకొని అన్నీ చేసి పెట్టేది. అప్పుడు ఆమె విలువ నాకే మాత్రం తెలియలేదు. కానీ ఆమె చనిపోయిన తర్వాత ఆమె విలువ నాకు తెలుస్తూ వుంది. భార్యను మనవాళ్లు అర్ధాంగి అన్నారు. కానీ నా దృష్టిలో ఆమె సగం శరీరం కంటే ఎక్కువే. అందుకనే ఇంగ్లీష్ వాళ్ళు భార్యను "బెటర్ హాఫ్" అన్నారు. భార్య చనిపోయిన భర్త సగం చనిపోయిన వాని కిందనే లెక్క. నాబోటివాడు పూర్తిగా చనిపోయినట్లే. భార్య చనిపోయిన వాడు జీవించి వున్నప్పటికీ కాళ్లు చేతులు లేని పూర్తిగా అవిటి వాడైనట్లే. మొదటి నుండి అవిటివాడైతే అవిటి జీవితం అలవాటై ఉంటుంది కాబట్టి పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ మధ్యలో అవిటితనం వస్తే అది నరకం. అవిటి జీవితానికి అలవాటు పడడం చాలా కష్టం. యూనివర్సిటీలో ఉన్నంత

సేపు అక్కడ పనిలో పడి పెద్దగా బాధ తెలియటం లేదు. కానీ ఇంటికి వచ్చిన తర్వాత అనుక్షణం అమ్మ గుర్తుకు వస్తూ వుంది నాయనా. ఒంటరి జీవితం చాలా భారంగా నిరాశగా నిస్పృహగా గడుస్తూ ఉందిరా “ అని బోరున విలపించాడు సత్యప్రసాద్.

తండ్రి అలా దుఃఖిస్తూ ఉంటే ప్రకాశ్ కు కూడా దుఃఖం ఆగలేదు. తండ్రిని ఎలా ఓదార్చాలో అతనికి తెలియలేదు. ఆయన తన తల్లిని ఎంతగా గాఢంగా ప్రేమించాడో అభిమానించాడో అతనికి బాగా తెలుసు. వాళ్ళిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉండేవారు. ఏనాడు వాళ్ళిద్దరూ కొంచెం కూడా గొడవ పడడం తాను చూడలేదు. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఎంతో ప్రేమగా ఉండేవారు. తండ్రి ఏనాడు తన తల్లిని పల్లెత్తు మాట కూడా అని ఎరుగడు. అలాగే తల్లి కూడా తన తండ్రితో అది కావాలి ఇది కావాలి అని, అవి లేవు ఇవి లేవు అని ఏనాడు ఆమె అనడం అతను చూడలేదు. తండ్రికి ఏం కావాలో ఎలా కావాలో ఆమె ముందుగానే ఊహించి అతనికన్నీ అమర్చి పెట్టేది. తల్లిదండ్రుల అన్యోన్య దాంపత్యాన్ని చూసి అతను ఒక్కొక్కసారి ఆశ్చర్యపోయేవాడు. అలాంటి భార్యను తలుచుకొని తండ్రి దుఃఖించడంలో అతనికి ఆశ్చర్యం కలగలేదు. తల్లిదండ్రులను తలుచుకోగానే అతనికి దుఃఖం ముంచుకొచ్చింది. తండ్రి ఒంటరివాడైనందుకు తల్లిని మరిచిపోలేక పోతున్నందుకు అతను ఎంతో బాధ పడ్డాడు. తండ్రి తో పాటు తాను దుఃఖిస్తే అతను మరింత కంగారు పడతాడని ప్రకాశ్ వస్తున్న దుఃఖాన్ని ఆపుకొని తండ్రితో చెప్పాడు.

“నాన్నా , మీరు చాలా సున్నిత మనస్కులు, కాబట్టే అమ్మ చనిపోయి ఆరు నెలలు పైగా అయినప్పటికీ మీరు ఇంకా అమ్మ చనిపోయిన దుఃఖంలోనే ఉన్నారు. మీరు ఆ దుఃఖం నుంచి బయటపడాలి. అమ్మను మరచిపోయే ప్రయత్నం చేయాలి. చనిపోయిన వారితో పాటు మనమూ పోలేం కదా. మీరు ఇలా బాధపడుతూ ఉంటే అది మీ ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. మీకు ఒంటరి జీవితం కష్టంగా ఉంటే నేను ఇక్కడ ఉద్యోగం మానేసి ఇండియాకు వచ్చేస్తాను. మన కలిసి ఉందాం, మీకంటే నాకు అమెరికా జీవితం ముఖ్యం కాదు'' అన్నాడు ప్రకాశ్.

"వద్దు నాయనా, నువ్వు ఇండియాకు రావద్దు. ఎంతో ఇష్టపడి ఆసక్తితో అమెరికాకు వెళ్లావు. నాకోసం నువ్వు అమెరికా జీవితాన్ని వదిలిపెట్టి రావద్దు. అది నాకు ఏమాత్రం ఇష్టం కాదు. నువ్వు చెప్పినట్లుగా నేను అమ్మను మరిచిపోయే ప్రయత్నం చేస్తున్నాను. కానీ ఎవరైనా అమ్మను గుర్తు చేస్తే నాకు వెంటనే భరించరాని దుఃఖం వస్తూ వుంది. ఇప్పుడు కొంతమేలే, పరవాలేదు, కొద్ది కాలంలోనే నేను అమ్మ దుఃఖం నుంచి బయటపడతాను. నువ్వు నా గురించి బాధపడవద్దు. అలా బాధపడితే నాకు మరింత బాధగా ఉంటుంది'' అన్నాడు సత్య ప్రసాద్.

"మీరు ఇలా బాధపడుతూ ఉంటే నేను మౌనంగా చూస్తూ ఎలా ఉండగలను. నేను మీ కొడుకును నాన్న, మీరు నన్ను బాధ్యతాయుతంగా క్రమశిక్షణతో పెంచారు. నేను బాధపడకుండా ఉండాలంటే మీరు చనిపోయిన అమ్మను మరిచిపోవాలి. ఎంతకాలమని అమ్మను మర్చిపోకుండా ఇలా దుఃఖిస్తూ ఉంటారు. దీనివల్ల మీ ఆరోగ్యం ఏమవుతుంది? మీకు తెలియని విషయం కాదు నాన్న, లోకంలో ఎంతో మంది చనిపోతున్నారు, ఎంత ఆత్మీయులైనా కొంతకాలానికి మరిచిపోయి మామూలుగా మారిపోతున్నారు. అలాగే మీరు కూడా అమ్మను మర్చిపోవాలి. ఒంటరిగా ఉంటే మీరు అమ్మను మర్చిపోలేరు. అమ్మను మర్చిపోవాలంటే మీరు మళ్లీ పెళ్లి చేసుకొని కొత్త జీవితం ప్రారంభించాలి. ధరణి పెద్దమ్మ చాలా మంచి ఆమె. ఆమె గురించి నాకంటే మీకే బాగా తెలుసు. మిమ్మల్ని బాగా అర్థం చేసుకున్న వ్యక్తి ఆమె, మీరు కూడా ఆమెను బాగా అర్థం చేసుకున్న వారే, చాలా కాలంగా కుటుంబ స్నేహితులుగా ఉన్నారు. మీరిద్దరూ జీవిత భాగస్వామిని కోల్పోయి జీవితాన్ని భారంగా గడుపుతున్నారు. అలా ఉండడం మీకిద్దరికీ ఏమాత్రం మంచిది కాదు. మీరిద్దరూ పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించాలి. దీనికి మీరు అంగీకరించాలి. ఇంతకంటే వేరే మార్గం లేదు నాన్న , మీరు అంగీకరించకపోతే నేను అమెరికా వదిలిపెట్టి ఇండియాకు వస్తాను. అలా వచ్చి మనం కలిసి ఉంటే మీరు అమ్మ దుఃఖం నుంచి బయటపడతారు. ఒంటరిగా ఉంటే మీరు దుఃఖం నుంచి బయట పడలేరు. కాబట్టి మీరు ధరణి గారిని పెళ్లి చేసుకుంటారా, లేకపోతే నన్ను ఇండియాకు రమ్మంటారా, ఏదో ఒకటి చెప్పండి'' అన్నాడు సత్య ప్రకాశ్.

సత్య ప్రకాశ్ గట్టిగా చెప్పడంతో సత్యప్రసాద్ కొడుకుతో చెప్పాడు.

"నువ్వు అమెరికా వదిలిపెట్టి ఇండియాకు రావడం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. అలా వస్తే నేను మరింత బాధ పడతాను. నావల్ల నీ భవిష్యత్తు నాశనం కావడం నేను సహించలేను. ధరణి గారిని పెళ్లి చేసుకోవడం గురించి నేను ఆలోచిస్తాను. నాకు రెండు రోజులు సమయం ఇవ్వు, చెబుతాను" అన్నాడు సత్య ప్రసాద్

"సరే నాన్నా , నేను తప్పుగా మాట్లాడి ఉంటే దయచేసి నన్ను క్షమించండి. మీరు బాధపడటం చూడలేక నేను కొంచెం కఠినంగా మాట్లాడాను. దయచేసి నన్ను నా మనసును అర్థం చేసుకోండి" అన్నాడు ప్రకాశ్.

జరిగిన విషయాన్ని ప్రకాశ్ సవితకు ఫోన్ చేసి చెప్పాడు. రెండు రోజుల తర్వాత సత్య ప్రసాద్ గారికి ఫోన్ చేసి ధరణి అమ్మని పెళ్లి చేసుకోమని అభ్యర్థన పూర్వకంగా మాట్లడమని చెప్పాడు. ఆమె అలాగే అని రెండు రోజుల తర్వాత సత్యప్రసాద్ కు ఫోన్ చేసింది.

"బాబాయ్ ఎలా ఉన్నారు, మీరు చనిపోయిన కమల చిన్నమ్మను మరిచిపోలేక బాధపడుతున్నారని ప్రకాశ్ అన్నయ్య నాతో బాధగా చెబుతూ వున్నాడు. బాబాయ్ మీరు చాలా పెద్దవారు, మీకు తెలియని విషయాలని కాదు. మీరు ఇలా ఒంటరితనంతో బాధపడుతూ జీవించడం ఏమైనా బాగుందా? మీరు చాలా మంచి ఆరోగ్యంగా ఉన్నారు. ఇప్పుడు మీకు 54 సంవత్సరాలు. ఇంకా మీరు కనీసం 30, 35 ఏళ్లు జీవించే అవకాశముంది. ఈ 35 ఏళ్లు మీరు చిన్నమ్మను మరిచిపోలేక ఒంటరితనంతో బాధపడుతూ ఉంటే ప్రకాశ్ అన్నయ్యకు ఎలా ఉంటుంది, నేను మీ కూతురు లాంటిదాన్ని, నాకు ఎలా ఉంటుంది, మీరు ఇండియాలో బాధగా జీవితం గడుపుతూ ఉంటే ఇక్కడ మేము సంతోషంగా ఉండగలమా? మీరు సంతోషంగా ఆనందంగా జీవిస్తూ ఉంటే మేము ఇక్కడ సంతోషంగా ఆనందంగా ఉంటాం. అలా కాకుండా మీరు అక్కడ బ్రతుకు భారంగా గడుపుతూ ఉంటే మాకు చాలా బాధగా ఉంటుంది. మా నాన్న చనిపోయాడు, కమల చిన్నమ్మ చనిపోయింది, చనిపోయిన వారి గురించి ఆలోచించడం మానండి. మా అమ్మ మీకంటే ఒక సంవత్సరం చిన్నది, ఆమె ఒంటరితనంతో చాలా బాధపడుతూ

ఉంది, ఇక్కడికి రమ్మంటే రావట్లేదు, ఇక్కడికి వస్తే నాతో పాటు కలిసి ఉంటుంది. కానీ ఆమెకు ఇక్కడ జీవితం ఏమాత్రం ఇష్టం లేదు, చాలా రోజుల నుంచి పెళ్లి చేసుకోమని చెబుతూ ఉంటే ఒప్పుకోలేదు. కానీ ఈమధ్య మిమ్మల్నయితే పెళ్లి చేసుకుంటానని ఇంకొకరిని ఎవరినీ చేసుకోనని చెప్పింది. బాబాయ్ ఈ వయసులో శారీరక సుఖం కోసం కాదు మీరు పెళ్లి చేసుకునేది, మాఅమ్మ గానీ మీరు గానీ ఇంకా 30 ఏళ్లకు పైగా జీవిస్తారు. ఈ 30 ఏళ్లు ఒంటరిగా బ్రతుకు భారంగా గడిపే కంటే మీరిద్దరూ పెళ్లి చేసుకుని ఒకరికొకరు తోడుగా ఉంటే సంతోషంగా ఉంటారు. మీరిద్దరూ పరస్పరం బాగా తెలిసిన వారు, ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నవారు, చాలా కాలంగా ఒకే కుటుంబం లాగా జీవిస్తున్న వారు, అలాంటి మీరిద్దరూ పెళ్లి చేసుకుంటే మీ జీవితం సుఖంగా సంతోషంగా సాగుతుంది. దయచేసి మీరు మా అమ్మను పెళ్లి చేసుకోండి, మా అమ్మకు కొత్త జీవితాన్ని సంతోషకరమైన జీవితాన్ని ఏర్పరచండి. తద్వారా మీరు కూడా సంతోషంగా ఉంటారు. సుఖంగా జీవిస్తారు. మీ యిద్దరి సుఖసంతోషాలే నాకు, అన్నయ్య ప్రకాశ్ కు కావలసింది. మేము కోరుకునేది అదే. ఇది నా అభ్యర్థన, దయచేసి నా అభ్యర్థన మన్నించండి బాబాయ్'' అన్నది.

సవిత చెప్పిన మాటలు విన్న తర్వాత సత్యప్రసాద్ ఆమె మాటలను కాదనలేకపోయాడు. అదీ గాకుండా చనిపోయిన భార్య కమలకు ధరణిని పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చాడు, అతను సవితతో చెప్పాడు.

"అమ్మ సవితా, నువ్వు చెప్పిన మాటలు చాలా వాస్తవంగా ఉన్నాయి. కూతురు లాంటి నీ మాటలను కాదనలేకపోతున్నాను. అలాగే నువ్వు , అన్నయ్యి చెప్పినట్లుగా ధరణి గారిని పెళ్లి చేసుకుంటాను. మీరు చెప్పినట్లుగా నేను ధరణి గారు కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాం'' అన్నాడు

తన మాటలను మన్నించి తన తల్లిని పెళ్లి చేసుకోవడానికి అంగీకరించి నందుకు ఆమె సత్యప్రసాద్ కు చాలా ధన్యవాదాలు తెలియజేసింది. తర్వాత ఆమె ఆ విషయాన్ని ప్రకాశ్ కు చెప్పింది. ప్రకాశ్ చాలా సంతోషించాడు. సవిత ఈ విషయం గురించి తన అమ్మమ్మ తాత గారికి కూడా చెప్పింది. వాళ్ళు కూడా చాలా సంతోషించారు. అమెరికా నుంచి సత్యప్రకాశ్, అతని భార్య, సవిత ఆమె భర్త రాజేంద్ర ఇండియాకు వచ్చారు. ధరణి తల్లిదండ్రులు

కూడా వచ్చారు. అందరూ కలిసి రిజిస్ట్రార్ ఆఫీసులో ధరణి సత్య ప్రసాద్ ల వివాహం జరిపించారు. ధరణి తల్లిదండ్రులు రెండు రోజులుండి తమ స్వగ్రామానికి వెళ్లిపోయారు. యువ జంటలు విశాఖపట్నంలో ధరణి సత్య ప్రసాద్ లతో పాటు కొన్ని రోజులుండి సంతోషంగా అమెరికాకు వెళ్ళిపోయారు. ధరణి సత్యప్రసాద్ లు కొత్త జీవితాన్ని ప్రారంభించారు.

17 వ అధ్యాయం

అలా ధరణి తన గత జీవితం మొత్తాన్ని గుర్తుకు చేసుకుంటూ వుంది. ఈలోగా సత్యప్రసాద్ విశ్వవిద్యాలయం నుంచి ఇంటికి వచ్చాడు. ఆమె ఆలోచనలో నిమగ్నమై ఉండడం గమనించి "ధరణి గారూ దేన్ని గురించో చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు, నేను వచ్చిన విషయం కూడా మీరు గమనించలేదు'' అని సరదాగా అన్నాడు.

"ఏమీ లేదండి, నాకు గతం గుర్తుకు వచ్చింది. దాన్ని గురించి ఆలోచిస్తున్నాను. అంతకంటే ఆలోచించడానికి ఏముంటుంది. మన పెళ్లై మూడు నెలలయింది. రాజుగారి మంచితనం గురించి, మా చెల్లెలు కమల గురించి ఆలోచిస్తున్నాను, మన పిల్లల గురించి ఆలోచిస్తున్నాను'' అన్నది.

"ధరణి గారూ, మీరు చెప్పింది చాలా వాస్తవం, రాజుగారు చాలా మంచివారు, వారి మంచితనం గురించి చెప్పడానికి మాటలు చాలవు. అలాగే కమల కూడా చాలా మంచిది, నిస్వార్ధపరురాలు, ఆమెకు మీరంటే చాలా అభిమానం. రాజుగారు చనిపోయిన తర్వాత మీరు ఒంటరితనంతో బాధపడుతున్నారని ఆమె చాలా బాధపడుతూ ఉండేది. మీ ఒంటరితనం పోగొట్టి మీరు సుఖంగా జీవించడం గురించి ఆమె చాలా ఆలోచిస్తూ ఉండేది. చనిపోవడానికి ముందు కమల చివరి కోరికగా మిమ్మల్ని పెళ్లి చేసుకోమని నన్ను కోరింది. నేను కూడా అలాగే పెళ్లి చేసుకుంటానని ఆమెకు మాట ఇచ్చాను. నేను మాట ఇచ్చేవరకు ఆమె నన్ను వదిలిపెట్టలేదు. మీరంటే ఆమెకు అంత అభిమానం, ప్రేమ'' అని అన్నాడు.

"మాస్టారూ, కమలకు నేనంటే ఇష్టమని నాకు తెలుసు. కానీ నా మీద ఇంత ప్రేమ ఇంత అభిమానం ఉన్నాయని నాకు ఇప్పుడే తెలిసింది. నిజంగా

కమల మంచితనం గురించి చెప్పడానికి నా దగ్గర మాటలు లేవు. నేను ఆమె మంచితనాన్ని అనుభూతి చెందుతున్నాను. నిజంగా ఆమె చాలా నిస్వార్థపరురాలు, స్త్రీలలో అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. ఆమె మంచితనం తలుచుకుంటూ ఉంటే నాకు కన్నీరు ఆగటం లేదు'' అని గద్గద స్వరంతో పలికింది.

“మీ మంచితనం, ఇతరులకు మీరు చేసే సహాయం చాలా గొప్పవి ధరణి గారూ. కమలకు మా కుటుంబానికి మీరు త్రికరణశుద్ధిగా చాలా మేలు చేశారు. చాలా సహాయం చేశారు. కమల ఆ విషయాలను గురించి మీ మంచితనం గురించి నాతో పదేపదే చెబుతూ ఉండేది. మంచి వాళ్ళకు ఎప్పుడూ మంచి జరుగుతుందని పెద్దలంటూ ఉంటారు. అది మీ విషయంలో నిజమని నిరూపితమయింది'' అన్నాడు సత్య ప్రసాద్.

“నేను పెద్దగా సహాయం చేసింది ఏమీ లేదు. నేను చాలా సహాయం చేశానని కమల చెప్పడం ఆమె మంచితనం, ఆమె గొప్పతనం'' ధరణి చెప్పింది.

“మన పిల్లలు సత్య ప్రకాశ్, సవితలు కోరుకున్నట్లుగా, కమల కోరుకున్నట్లుగా మనిద్దరం పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించాం. కొత్త జీవితం సుఖంగా సంతోషంగా సాగుతూ ఉంది. నేను మీకు, కమలకు, మన పిల్లలకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఎందుకంటే మీరందరూ గట్టిగా చెప్పడం వల్లనే నేను మిమ్మల్ని పెళ్లి చేసుకొని వంటరి జీవితం నుంచి బయటపడి సుఖంగా ఉన్నాను'' అన్నాడు సత్య ప్రసాద్.

“మీరు నన్ను పెళ్లి చేసుకోవడం వల్లనే ఒంటరితనంతో దుర్భరంగా గడుస్తున్న నా జీవితం సుఖంగా సంతోషంగా సాగుతూ ఉంది. జీవిత భాగస్వామిని కోల్పోయిన వారు ఎవరైనా ఒంటరిగా కష్టంగా జీవితాన్ని గడపకుండా మనలాగే నచ్చిన వ్యక్తిని, అర్థం చేసుకున్న వ్యక్తిని మళ్ళీ పెళ్లి చేసుకొని జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని కోరుకుందాం'' అన్నది ధరణి.

“అవును, మీరు చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం'' అని సత్యప్రసాద్ కూడా అంగీకరించాడు.

సత్యప్రసాద్ ధరణి ల జీవితం సుఖంగా సంతోషంగా సాగుతూ వుంది.

తాగుబోతులు

అప్పన్న తనకు జరిగిన అవమానానికి చాలా బాధపడ్డాడు. పది మందిలో సన్యాసి నాయుడు చేసిన అవమానానికి అతను కోపంతో రగిలిపోయాడు. తనకు జరిగిన అవమానానికి ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని అతను నిర్ణయించుకున్నాడు. ఎలాగైనా పగ సాధించాలని అతను ఆలోచించాడు. కానీ ఎలాగా అనేది అతనికి అంతుబట్టలేదు. తనకు జరిగిన అవమానం పదేపదే గుర్తుకు వస్తూవుంది అతనికి.

ఆరోజు పీర్ల సావిట్లో పేకాట జోరుగా సాగుతూ వుంది. నలుగురు నలుగురు కలిసి నాలుగు వర్గాలుగా విడిపోయి మూడు చోట్ల పేకాట ఆడుకుంటున్నారు. ఒక్కొక్క చోట ముగ్గురు నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్న వారి పక్కన చేరి వారి ఆట చూస్తున్నారు. వాళ్లలో ఎక్కువమంది సిగరెట్లు బీడీలు కాలుస్తున్నారు. కొంతమంది నాటు సారా తాగిన మత్తులో జోగుతున్నారు. పీర్ల సావిడి పక్కన టీ కొట్టు ఉంది. టీ కొట్టులో టీ ఒక్కటే కాదు. పునుగులు, బజ్జీలు, ఇడ్లీలు, దోసెలు కూడా ఉన్నాయి. టీ తో పాటు కాఫీ కూడా అందుబాటులో ఉంది. వాటితోపాటు సిగరెట్లు బీడీలు అగ్గిపెట్టెలు అమ్మకానికున్నాయి. ఆ టీ కొట్టు దగ్గర నిత్యం పది మంది దాకా గుమికూడి జాతీయ సమస్యల నుంచి మొదలుకొని ఊర్లోని లోకాభిరామాయణం దాకా చర్చించుకుంటూ ఉంటారు. అక్కడికి చేరే వాళ్ళలో ఎక్కువమంది పని లేని వాళ్ళు, పనికిమాలిన వాళ్ళు. అయితే ఆ మాటంటే వాళ్ళెవరూ ఒప్పుకోరు. ఆ మాట అన్నవాళ్ళ మీదికి ఒంటికాలి మీద లేచిపోయి దెబ్బలాటకు దిగుతారు. ఉన్నమాటంటే ఉలుకెక్కువ కదా. టీ కొట్టు నుంచి టీ కుర్రాడు టీలు, కాఫీలు, సిగరెట్లు, బీడీలు తెచ్చియిస్తూ ఉంటాడు. పీర్ల సావిడి నిత్యం టీ వాసనతో సిగరెట్లు బీడీల పొగ కంపుతో నిండిపోయి ఉంటుంది. సిగరెట్లు బీడీలు

కాల్చేవాళ్ళు వాటితోపాటు తమ ఆరోగ్యాన్ని కూడా కాల్చుకుంటున్నారు. కాల్చని వాళ్లు కాల్చేవాళ్లు వదిలిపెట్టే పొగ పీలుస్తూ తమకు తెలియకుండానే ఆరోగ్యాన్ని తగలెట్టుకుంటున్నారు.

అప్పన్న సన్యాసినాయుడు మరో ఇద్దరు కలిసి ఒక దగ్గర పేకాట ఆడుతున్నారు. ఇద్దరూ నాటుసారా నిషాలో ఉన్నారు. అప్పన్న కొంచెం నిదానం మనిషి. పేకాటలో తనకు కావలసిన పేకముక్కను తీసుకోవడం విషయంలో గానీ, అవసరం లేని పేకను కింద పడేయడంలో గానీ ఆలస్యం చేస్తుంటాడు. అది మిగతా ఆటగాళ్లకు చిరాకును, కోపాన్ని తెప్పిస్తూ ఉంటుంది. ఎంతసేపురా త్వరగా ముక్క తీసుకో అని, త్వరగా ముక్క ఎయ్ అని మిగతా వాళ్ళు అప్పన్నకు చిరాకుగా చెబుతూ ఉంటారు. అప్పన్న ఆ మాటలు పట్టించుకోకుండా నిదానంగానే పేకాట ఆడుతూ ఉంటాడు. ఆరోజు సన్యాసినాయుడు నిషాలో ఉండటం వల్ల అప్పన్న ఆలస్యంగా పేక ముక్కను వేయడం సహించలేక "ఒరే లంజకొడకా తొందరగా ముక్క ఎయిరా" అని తిట్టాడు. అప్పన్న కూడా నిషాలో ఉండడం చేత తిట్టును సహించలేక "నువ్వే లంజకొడుకువురా నా కొడకా" అన్నాడు. వెంటనే సన్యాసినాయుడు అప్పన్నను అతని తల మీద కాలితో మూడు, నాలుగు సార్లు తన్ని గట్టిగా తిడుతూ మీద పడి కొట్టడం ప్రారంభించాడు. పీర్ల సావిట్లో ఉన్నవాళ్లు, టీ కొట్టు దగ్గర ఉన్న వాళ్ళు వచ్చి విడిపించారు. అప్పన్నకు చాలా అవమానం జరిగిపోయింది. అప్పన్న సన్యాసినాయున్ని తిరిగి కొట్టడం కాదు గదా ఒక మాట కూడా అనలేదు. అతనికి సన్యాసినాయుడంటే చాలా భయం. అందుకని మౌనంగా అవమానాన్ని భరించి అక్కడ నుంచి లేచి ఇంటికి వెళ్ళిపోయాడు.

సన్యాసి నాయుడు అంటే అప్పన్నకే కాదు ఆ ఊర్లో చాలా మందికి చాలా భయం. నాయుడు చాలా ధైర్యం తెగింపు ఉన్నవాడు. 60 సంవత్సరాల వయసు ఉంటుంది. మనిషిని చంపడమంటే పెద్ద లెక్క కాదు అతనికి. గతంలో ఆ ఊర్లో ముఠా తగాదాలుండేవి. నాయుడు 15 సంవత్సరాల ప్రాయం నుంచి ఒక ముఠాలో చేరి అవతలి ముఠా వాళ్లను కొట్టడం, చంపడం చేశాడు. ఆ తర్వాత కొంతకాలానికి ఆవూర్లో ముఠా తగాదాలు అంతరించాయి. నాయునికి 30 ఏళ్ల వయసులో దగ్గర పట్నంలో ఉన్న ఒక బలమైన ముఠా

నాయకునికి అంగరక్షకుడుగా చేరి కొంత కాలం పని చేశాడు. ఆ సమయంలో సన్యాసినాయుడు మరి కొందరితో కలిసి ఎదుటి ముఠాకు చెందిన ఇద్దరు ముగ్గురు నాయకులను చంపాడు. సన్యాసినాయుడు పనిచేస్తున్న ముఠా నాయకున్ని అవతలి వర్గం వాళ్ళు చంపేశారు. అంతటితో ముఠా కక్షలు సమసిపోయాయి. ఆ తర్వాత సన్యాసి నాయుడు తన ఊరికి తిరిగి వచ్చాడు. అప్పటినుంచి సన్యాసినాయుడు తన ఊర్లోనే ఉంటున్నాడు. నాటు సారా కాసి అమ్మడం ప్రధానంగా అతని ఆర్థిక వనరు. దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ లోని పోలీసులకు లంచాలిచ్చి నాటు సారా కాసి బహిరంగంగానే అమ్ముతూ వుంటాడు. ఆ విధంగా అతను డబ్బులు సంపాదించడం నేర్చుకున్నాడు. ఆ ఊర్లో మరికొందరు నాటు సారా కాయడానికి ప్రయత్నించారు. వారిని చంపుతానని బెదిరించి నాటు సారా కాయడంలో తనకు పోటీ లేకుండా చేసుకున్నాడు. అతనికి ముగ్గురు అన్నలు ముగ్గురు తమ్ముళ్ళున్నారు. ఆ ఏడుగురికి ఒక్కొక్కరికి ఇద్దరు ముగ్గురు కొడుకులున్నారు. వాళ్లది చాలా పెద్ద బలగం. వాళ్ళందరూ చాలా కలిసిమెలిసి ఉండి ఊర్లో అందరిని భయపెడుతూ బతుకుతున్నారు. సన్యాసినాయుని జోలికి గాని అతని అన్నదమ్ముల జోలికి గాని ఎవరూ పోరు. ఈ కారణం చేత కూడా సన్యాసినాయుడు అంటే అందరికీ భయం. అందువల్లనే అప్పన్న తనకంత అవమానం జరిగినప్పటికీ మారు మాట్లాడకుండా తన ఇంటికి వెళ్ళిపోయాడు.

అప్పన్న ఇంటికి వెళ్లిపోయిన తర్వాత అతని బంధువులు ఇద్దరు ముగ్గురు వచ్చి అతన్ని ఓదార్చే ప్రయత్నం చేశారు. సన్యాసినాయున్ని, అతని అన్నదమ్ములను వారి అరాచకాలను, వారి దుర్మార్గాలను ఏకరువు పెట్టి తిట్టారు. దేవుడున్నాడని అతన్ని అవమానించినందుకు తప్పనిసరిగా సన్యాసినాయునికి తగిన శిక్ష పడుతుందని వాళ్లందరూ అప్పన్నను ఓదార్చే ప్రయత్నం చేశారు. సన్యాసినాయుడంటే పడని వాళ్ళు మరి కొంతమంది కూడా వచ్చి అప్పన్నను ఓదార్చారు. అప్పన్న మౌనంగా వాళ్ళు చెప్పేదంతా విన్నాడు, ఏమీ మాట్లాడలేదు.

సన్యాసి నాయుడు తనను పదిమందిలో కాలితో తన్ని, తిట్టి అవమానించినట్లుగానే తాను కూడా సన్యాసినాయున్ని పది మందిలో కాలితో తన్ని తిట్టి అవమానించాలని అప్పన్న అనుకున్నాడు. కానీ అది సాధ్యం కాదని

అతని తెలుసు. అతను సన్యాసినాయున్ని తిట్టినా కొట్టినా అతని అన్నదమ్ముళ్లు, వాళ్ళ పిల్లలు వచ్చి అతన్ని చితక్కొడతారు. అందువల్ల అతను ప్రత్యక్షంగా సన్యాసినాయునితో గొడవకు దిగాలనుకోవడం లేదు. పరోక్షంగా ఎవరికీ తెలియకుండా రహస్యంగా అతని మీద పగ సాధించాలని అతను ఆలోచిస్తున్నాడు. తనకు జరిగిన అవమానాన్ని తలుచుకుంటూ అతను ఒక వారం రోజులు పాటు ఇంట్లో నుంచి బయటకు రాలేదు. దాన్ని గురించే తలుచుకుంటూ ఏ విధంగా సన్యాసినాయుని మీద పగ తీర్చుకోవాలా అని తీవ్రంగా ఒంటరిగా ఆలోచిస్తూ ఉన్నాడు. అతనికి అన్నమూ నీరూ పెద్దగా సహించడం లేదు. నాటుసారా కూడా అతనికి పెద్దగా కైపు నివ్వడం లేదు. పగతో రగిలిపోతున్నాడు. సన్యాసినాయుని మీద పగ తీర్చుకుంటే తప్ప అతను ప్రశాంతంగా ఉండలేని స్థితికి చేరుకున్నాడు. ఎంత వద్దనుకున్నా అతనికి తనకు జరిగిన అవమానం గుర్తుకొస్తూ వుంది.

సన్యాసినాయునికి అప్పన్నకు తాగుడు అలవాటు ఉంది. ఇద్దరూ కలిసి అప్పుడప్పుడు ఎక్కువగా తాగి పడిపోవడం కూడా గతంలో జరిగింది. బాగా ఆలోచించగా ఆలోచించగా సన్యాసినాయుని మీద పగ తీర్చుకోవడానికి అప్పన్నకు ఒక ఆలోచన వచ్చింది. దాన్ని ఆచరణలో పెట్టి సన్యాసినాయుని మీద పగ తీర్చుకోవాలని అతను గట్టి నిర్ణయానికి వచ్చాడు.

వారం రోజుల తర్వాత అప్పన్న మెల్లగా బయటకు రావడం మొదలుపెట్టాడు. బయటికి వచ్చినప్పటికీ ఒక వారం రోజులు పాటు పీర్ల సావిడి దగ్గరికి వెళ్ళలేదు. మూడోవారం తర్వాత అతను మెల్లగా పీర్ల సావిడి దగ్గరున్న టీ కొట్టు దగ్గరికి వెళ్తున్నాడు. కానీ పీర్ల సావిట్లోకి వెళ్లేవాడు కాదు. పేకాట ఆడేవాడు కాదు. అతను ఎవరితోనూ పెద్దగా మాట్లాడడం లేదు. ఇతరులు మాట్లాడుతుంటే మౌనంగా వింటూ వున్నాడు. నెల రోజుల తర్వాత అప్పన్న మెల్లగా అందరితోనూ మామూలుగా మాట్లాడం ప్రారంభించాడు. సన్యాసినాయుడు ఉన్న చోటుకి మాత్రం వెళ్లేవాడు కాదు. అలా అప్పన్న మరొక నెల గడిపాడు. మూడవ నెల ప్రారంభం నుంచి అన్ని చోట్లకి వెళ్తూ సన్యాసినాయుడున్న చోటికి కూడా వెళ్లడం మొదలు పెట్టాడు. అయితే సన్యాసినాయునితో మాట్లాడేవాడు కాదు. నాలుగో నెలలో అప్పన్న అడపాదడపా సన్యాసినాయునితో మాటలు కలిపేవాడు. ఐదవ నెల నుంచి అప్పన్న

సన్యాసినాయునితో మామూలుగా మాట్లాడటం మొదలుపెట్టాడు. అయితే అతను పీర్ల సావిట్లోకి వెళ్లేవాడు కాదు. పేకాట ఆడేవాడు కాదు. పూర్తిగా ఆటను వదిలేశాడు. అప్పన్నకు పౌరుషం, అభిమానం ఎక్కువ. తాను అవమానానికి గురి కావడానికి పేకాట కారణం కాబట్టి అతను మళ్ళీ జీవితంలో ఎప్పుడూ పేకాట ఆడలేదు.

ఆరు నెలల తర్వాత అప్పన్న సన్యాసినాయునితో కలిసి సారా తాగడం మొదలుపెట్టాడు. మొదట అప్పుడప్పుడు నాయునితో కలిసి తాగేవాడు. ఆ తర్వాత మెల్లమెల్లగా దాన్ని పెంచాడు. సంవత్సరానికల్లా అప్పన్న సన్యాసినాయుడు మంచి మిత్రులయ్యారు. ఇద్దరూ కలిసి పీర్ల సావిట్లో తాగేవారు. ఒక్కొక్కసారి ఎక్కువగా తాగి పడిపోయేవారు. దగ్గరలో ఉన్న పట్టణానికి పని మీద వెళ్ళినప్పుడు అక్కడ లాడ్జిలో విచ్చలవిడిగా సారా తాగి పడిపోయేవారు. లాడ్జిలో తాగేటప్పుడు వాళ్ళు తలుపు దగ్గరకు వేసేవారు. లోపల గడియ పెట్టుకునేవారు కాదు. మరుసటి రోజు ఇంటికి వచ్చేవారు. ఇలా చాలా సార్లు జరిగింది.

అలా ఒకసారి ఇద్దరూ పట్నానికి వెళ్లి లాడ్జిలో రెండు రోజులున్నారు. రెండు రోజులపాటు సారా తాగుతూనే ఉన్నారు. తనకు కడుపు నొప్పిగా వుందని చెప్పి అప్పన్న తక్కువ తాగుతూ నన్యాసి నాయునితో రెండవ రోజు రాత్రి బాగా ఎక్కువగా తాగించాడు. మూడో రోజు ఉదయానికి సన్యాసినాయుడు చనిపోయాడు. అప్పన్న తాగిన మత్తులో పడి ఉన్నాడు. లాడ్జి వాళ్లు సన్యాసినాయుని ఇంటికి ఫోన్ చేసి నాయుడు తాగితాగి చనిపోయినట్లుగా చెప్పారు. నాయుని కొడుకులు, అన్నదమ్ములు, వారి పిల్లలు అందరూ ఏడ్చుకుంటూ లాడ్జి దగ్గరికెళ్లారు. వాళ్లు వెళ్లేటప్పటికీ అప్పన్న తాగిన మత్తులోనే పడి ఉన్నాడు. వాళ్ళు అప్పన్నను తిట్టి నాయుని శవాన్ని తీసుకొని వచ్చి అంతక్రియలు నిర్వహించారు. వాళ్లందరూ సన్యాసినాయుడు సారా తాగి తాగి చనిపోయినట్లుగా భావించారు. ఊర్లో వాళ్ళు కూడా అది నమ్మారు.

అప్పన్న తన మిత్రుడైన సన్యాసినాయుడు చనిపోయినందుకు చాలా బాధపడుతున్నట్లుగా చాలా మందికి చెప్పాడు. అప్పటినుంచి సారా తాగడం

మానేశాడు. సారా తాగడం వల్ల మిత్రుడైన నాయుడు చనిపోయాడని తాను బుద్ధి తెచ్చుకొని సారా జోలికి పోనని అందరికీ చెప్పాడు.

సన్యాసి నాయుడు చనిపోయి ఆరు నెలలయింది. నాయుని కొడుకులు అతని బంధువులు మిగిలిన ఊర్లో వాళ్ళందరూ సన్యాసినాయున్ని మరిచిపోయారు. అప్పన్న మాత్రం సన్యాసినాయున్ని మరిచిపోలేదు. అతని మనసులో నాయుడు తనను నలుగురిలో తన్ని అవమానించడం, లాడ్జిలో అతను చనిపోవడం మెదులుతూనే ఉంది.

ఆరు నెలల తర్వాత అప్పన్న మళ్లీ సారా తాగడం మొదలుపెట్టాడు. సారా తాగినప్పుడు అతను ఎవరితోనూ పెద్దగా మాట్లాడేవాడు కాదు. చాలా వరకు బయటికి కూడా వెళ్లేవాడు కాదు, ఇంట్లోనే ఉంటున్నాడు.

అకస్మాత్తుగా ఒక రోజు అప్పన్న పోలీసు స్టేషన్ కు వెళ్లి అక్కడి ఎస్.ఐ ని కలిసి ఆరు నెలల కిందట సన్యాసినాయున్ని రహస్యంగా తానే చంపానని, సన్యాసినాయుని బంధువుల నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరాడు.

ఎస్.ఐ ఆశ్చర్యంతో "సన్యాసినాయున్ని నువ్వు చంపావా, ఎందుకు చంపావు, ఎలా చంపావు?'' అని అడిగాడు. అప్పన్న ఎస్.ఐ తో చెప్పాడు.

''సార్, సన్యాసి నాయుడు సంవత్సరం నర్ర కిందట పేకాట ఆడుతున్నప్పుడు నన్ను తల మీద కాల్తో తన్ని దారుణంగా తిట్టి అవమానించాడు. ఆ అవమానాన్ని తట్టుకోలేకపోయాను. నిద్రాహారాలు లేకుండా చాలా బాధ పడ్డాను. ఎలాగైనా అవమానానికి తగిన ప్రతీకారం చేస్తేనే గాని నేను మామూలు మనిషిని కాలేని స్థితికి చేరుకున్నాను. కానీ సన్యాసినాయున్ని కొట్టడం తిట్టడం కాలితో తన్నడం నావల్ల కాదని నాకు తెలుసు. ఎందుకంటే వానికి బంధుబలగం చాలా ఎక్కువగా ఉంది. నేను సన్యాసినాయున్ని ఏమైనా చేస్తే వాళ్ళందరూ వచ్చి నన్ను చితక్కొడతారు. సన్యాసినాయుడన్నా, వాని బంధువులన్నా ఊర్లో అందరికీ చాలా భయం. అందువల్ల నేను డైరెక్ట్ గా వాన్ని ఏమీ చేయలేక ఒక ప్లాన్ వేసుకుని చాలా రహస్యంగా ఆ ప్లాన్ ప్రకారం సన్యాసి నాయున్ని చంపాను'' అని అన్నాడు.

"నువ్వేసుకున్న ప్లాన్ ఏంటి, ఎలా చంపావు?'' అని ఎస్.ఐ అడిగాడు.

"సన్యాసినాయుడు నన్ను అవమానించినందుకు వాడితో మాట్లాడటం కానీ వాడి మొహం చూడడం కానీ చేయకూడదని మొదట అనుకున్నాను. కానీ అలా చేస్తే నా కక్ష తీరదు, నాకు మనశ్శాంతి ఉండదు. అందువల్ల నేను వానికి దగ్గరగా మిత్రునిగా ఉండి రహస్యంగా నేను వాన్ని చంపినట్లుగా ఎవరికీ తెలియకుండా చంపాలని నిర్ణయించుకుని వాడితో స్నేహం చేసి వానితో కలిసి తిరిగి, తాగి వానికి గానీ, వాని కుటుంబానికి గానీ, వాని బంధువులకు గానీ, ఊర్లో మరెవరికి గానీ అనుమానం రాకుండా ప్రవర్తించాను. అప్పుడప్పుడు ఇద్దరం కలిసి దగ్గర్లో ఉన్న పట్నానికి వెళ్లి అక్కడ లాడ్జ్ లో రూమ్ తీసుకొని తాగేవాళ్ళం. నేను నా ప్లాన్ ప్రకారం తక్కువ తాగుతూ సన్యాసినాయునితో ఎక్కువగా సారా తాగిస్తూ వచ్చాను. వాడు తెగ తాగి పడిపోయేవాడు. నేను కూడా ఎక్కువ తాగినట్లుగా, పడిపోయినట్లుగా నటిస్తూ ఉండేవాన్ని. చివరకు ఒక రోజు పట్నంలో లాడ్జిలో రూమ్ తీసుకొని రెండు రోజులు వానితో బాగా తాగించాను. రెండవ రోజు రాత్రి వాడు తాగిన సారాలో విషం కలిపాను. అది తాగి వాడు చచ్చాడు. నేను కూడా బాగా తాగి పడిపోయినట్లుగా నటించాను. లాడ్జి వాళ్ళు సన్యాసినాయుని ఇంటికి ఫోన్ చేసి నాయుడు తాగి తాగి చనిపోయినట్లుగా చెప్పారు. వాని బంధువులందరూ అది నమ్మారు. నా మీద వాళ్లకి ఎలాంటి అనుమానం కలగలేదు. నేను అంత బాగా నటించాను" అని అప్పన్న చెప్పాడు.

"నటించావు సరే, మరి ఇప్పుడు ఎందుకు మా దగ్గరికి వచ్చి చేసిన నేరాన్ని ఒప్పుకొని లొంగి పోతున్నావు. ఇలా లొంగిపోతే నీకు జీవిత ఖైదు పడుతుంది కదా, అది తెలిసి కూడా నువ్వెందుకు లొంగి పోతున్నావ్" అన్నాడు ఎస్. ఐ.

"సన్యాసినాయున్ని నేను విషం పెట్టి చంపిన విషయం ఇంతవరకు ఎవరికీ చెప్పలేదు. మొదటిసారిగా మీకే చెబుతున్నాను. ఈ సంగతి ఎవరికి చెప్పినా అది మెల్లగా సన్యాసినాయుని బంధువులకు తెలిసిపోతుంది. వాళ్ళు నన్ను బతకనివ్వరు. తప్పనిసరిగా చంపుతారు. అందుకే నేను ఎవరికీ చెప్పలేదు, చివరికి మా ఇంట్లో వాళ్లకు కూడా చెప్పలేదు. సారా తాగితే తాగిన మైకంలో ఈ రహస్యాన్ని బయటకి చెబుతాననే భయంతో నేను సారా తాగడం కూడా

మానేశాను. సారా తాగకుండా ఆరు నెలలు చాలా కష్టం మీద ఉన్నాను. ఆ తర్వాత సారా తాగకుండా వుండలేకపోయాను. మళ్ళీ సారా తాగడం మొదలెట్టాను. తాగిన మైకంలో ఎప్పుడో ఒకసారి నాయున్ని చంపిన విషయం ఎవరికైనా చెప్తానేమోనని నేను భయపడి చస్తున్నాను. ఈ రహస్యాన్ని ఎవరికి చెప్పినా అది తప్పనిసరిగా సన్యాసినాయుని బంధువులకు తెలిసిపోతుంది. వాళ్లు నన్ను తప్పనిసరిగా చంపుతారు. వాళ్ల చేతిలో చచ్చిపోవడం కంటే నేరాన్ని మీ దగ్గర ఒప్పుకొని జైలుకు పోవడం మంచిది కదా అనే ఉద్దేశంతో విషయమంతా మీకు చెప్పి లొంగిపోతున్నాను. అంతే కాకుండా నేను సన్యాసినాయున్ని చంపిన విషయం ఊర్లో అందరికీ తెలియాలి. "అప్పన్న మొనగాడు రా, సన్యాసినాయుడు అప్పన్నను కాలితో తన్ని అవమానించినందుకు వాన్ని చంపి కక్ష తీర్చుకున్నాడు" అని అందరూ నా గురించి చెప్పుకోవాలి. అందుకోసం కూడా నేను ఈ రహస్యాన్ని ఇప్పుడు మీకు చెబుతున్నాను, కాబట్టి నన్ను అరెస్టు చేసి నాకు రక్షణ కల్పించండి. అలాగే సన్యాసినాయుని బంధువులు మా ఇంటి మీద పడి నా భార్య పిల్లలను కొడతారు, మా ఇంటిని దోచుకుంటారు. అలా కాకుండా వాళ్లకు కూడా రక్షణ కల్పించండి" అని అప్పన్న ప్రాధేయ పడ్డాడు.

"ఇదంతా మీరిద్దదరూ తాగుబోతులు కావడంవల్ల వచ్చింది. నువు చెప్పినట్లుగా మీ కుటుంబానికి రక్షణ కల్పిస్తాను, నీ మీద ఖూనీ కేసు కట్టి కోర్టుకు పంపిస్తాను" అని ఎస్.ఐ చెప్పాడు. అలాగే చేశాడు.

దొంగ

నేను ఒకసారి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కు నా సొంత పని మీద ఢిల్లీకి వెళ్ళవలసి వచ్చింది. నేను ఢిల్లీకి వెళ్ళడం అది మొదటి సారి. విశాఖపట్నం నుంచి లింక్ ఎక్స్ ప్రెస్ లో ఢిల్లీకి రానుపోను రిజర్వేషన్ చేయించుకున్నాను. సాధారణంగా లింక్ ఎక్స్ ప్రెస్ ఆలస్యంగా నడుస్తూ ఉంటుంది. అందుకని ఎందుకైనా మంచిదని ఒక రోజు ముందుగా ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించుకుని అలాగే రిజర్వేషన్ చేయించుకున్నాను. లింక్ ఎక్స్ ప్రెస్ విశాఖపట్నంలో మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరుతుంది. అది రాత్రి 12 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. హైదరాబాదు నుంచి దక్షిణ్ ఎక్స్ ప్రెస్ పేరుతో కొన్ని బోగీలు అక్కడికి వస్తాయి. విశాఖపట్నం నుంచి వచ్చిన బోగీలు హైదరాబాదు నుంచి వచ్చిన బోగీలు రెండూ కలిపి దక్షిణ్ ఎక్స్ ప్రెస్ అనే పేరుతో ఆ రైలు కాజీపేట నుంచి ఢిల్లీలోని నిజాముద్దీన్ స్టేషన్ కు వెళ్తుంది. కాజీపేట నుంచి రాత్రి 1:00 కు బయలుదేరిన ఆ రైలు చాలా స్టేషన్లో ఆగుతూ ఆరోజు రాత్రి మరుసటి రోజు పగలు, రాత్రి ప్రయాణించి ఆమరసటి రోజు తెల్లవారుజామున 6 గంటలకు నిజాముద్దీన్ స్టేషన్ కు చేరుకుంటుంది. అంటే విశాఖపట్నం నుంచి ఢిల్లీకి ఆ రైల్లో ప్రయాణించడానికి 42 గంటల సమయం పడుతుంది. అందుకనే ఆ రైలును విశాఖపట్నంలో దున్నపోతుల బండి అని పిలుస్తారు. పొద్దున ఆరు గంటలకు ఢిల్లీలో దిగుతాం కాబట్టి సమయం వృధా కాకుండా ఆఫీస్ పని చేసుకోవడానికి వీలుగా ఉంటుందని చాలా మంది ఆ రైల్లో ఢిల్లీకి వెళ్తుంటారు. నేను కూడా అలాగే భావించి ఆ రైల్లో రిజర్వేషన్ చేయించుకున్నాను.

నేను ఆ రైలు ఎక్కి 42 గంటలు ప్రయాణించి తెల్లవారుజామున రైలుబండి దిగి ఢిల్లీలో మండీ హౌస్ దగ్గరలో ఉన్న గోమతి గెస్ట్ హౌస్ లో దిగాను. సాధారణంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ కు పని మీద వచ్చిన

వాళ్ళు ఆ గెస్ట్ హౌస్ లోనే దిగుతూ ఉంటారు. ఢిల్లీలో ప్రైవేట్ లాడ్జీల్లో గదుల అద్దెలు చాలా ఎక్కువగా ఉంటాయి. గోమతి గెస్ట్ హౌస్ లో సాధారణ పౌరులు భరించే స్థితిలో అద్దె ఉంటుంది. అందుకని నేను కూడా అక్కడే దిగాను. గెస్ట్ హౌస్ లో దిగిన వాళ్ళకు గెస్ట్ హౌస్ వాళ్లే బ్రేక్ఫాస్ట్ పెడతారు. యూ జీ సి ఆఫీస్ పని మీద వచ్చిన వాళ్ళు ఉదయం టిఫిన్ చేసి ఆఫీసుకు వెళ్తూ ఉంటారు. అందుకనే అక్కడ మధ్యాహ్నం భోజనం ఉండదు. నేను అక్కడే బ్రేక్ ఫాస్ట్ చేశాను. బ్రేక్ ఫాస్ట్ అంటే మన ప్రాంతంలో మాదిరిగా ఇడ్లీలు దోశలు ఉండవు. అక్కడ బ్రేక్ ఫాస్ట్ అంటే బ్రెడ్ ముక్కలు, ఆమ్లెట్, టీ ఉంటుంది. నాకు మరుసటి రోజు ఆఫీసులో పని. బ్రేక్ ఫాస్ట్ చేసిన తర్వాత ఏం చేయాలో తోచలేదు. అందుకని ఢిల్లీ ఊరు చూద్దామనుకొని ముందు కరోల్ బాగ్ మార్కెట్ కి వెళ్దామని నిర్ణయించుకున్నాను. ఏదైనా కొత్త ఊరుకు వెళ్ళినప్పుడు అక్కడ ఏదైనా వస్తువు కొనటం నాకు అలవాటు. ఆ వస్తువు చూసినప్పుడు ఆ ఊరు గుర్తుకు వస్తూ ఉంటుంది నాకు. ఎలాగూ ఆ రోజంతా నాకు పని లేదు. ఢిల్లీలో కరోల్ బాగ్ బాగా ప్రసిద్ధి చెందిన మార్కెట్ అని తెలుసుకొని అక్కడికి వెళ్లి ఏదైనా కొందామనుకున్నాను. అక్కడికి ఎలా వెళ్లాలో ఏ సిటీ బస్సులో వెళ్లాలో అక్కడున్న వాళ్ళని కనుక్కొని బయలుదేరాను. నా దగ్గర అప్పుడు నాలుగు వేల రూపాయలు డబ్బులున్నాయి. ఆ డబ్బులు గెస్ట్ హౌస్ లో ఉంచటం మంచిది కాదనే ఉద్దేశంతో నా దగ్గరే ఉంచుకున్నాను. అది ఎండాకాలం, చెమటకు డబ్బులు తడిసి పోతాయని భావించి డబ్బులను చిన్న పాలిథిన్ కవర్లో పెట్టి నా ప్యాంటు సీక్రెట్ ప్యాకెట్ లో పెట్టుకున్నాను. సిటీ బస్సు ఛార్జీలకు అవసరమైన కొంత చిల్లర మాత్రం చొక్కా జేబులో పెట్టుకున్నాను.

నేను కొంత దూరం నడిచి సిటీ బస్టాప్ దగ్గరికి వెళ్ళాను. నాకు హిందీ పెద్దగా రాదు, కొంచెం కొంచెం వచ్చు. అక్కడ బస్టాప్ లో ఉన్న ఒక యువకున్ని కరోల్ బాగ్ కు ఏ బస్సు వెళ్తుందో నాకు వచ్చిన కొద్దిపాటి హిందీ భాషలో అడిగి తెలుసుకొని ఆ బస్సులో ఎక్కి కూర్చున్నాను. నేను ఎక్కినప్పుడు సిటీ బస్సు పెద్దగా రద్దీగా లేదు. పోను పోను సిటీ బస్సులో జనాలు చాలా ఎక్కువ మంది ఎక్కారు. కరోల్ బాగ్ కు బాగా ఒక దగ్గరగా వచ్చినప్పుడు నేను కూర్చున్న సీటు దగ్గరికి ఒక ముసలాయన వచ్చాడు. నేను ఆయన మీద

జాలిపడి నేను కూర్చున్న సీటు అతనికి ఇచ్చి నేను నిలబడ్డాను. ఆ తర్వాత స్టాప్ కరోల్ బాగ్, నేను అక్కడ దిగాను.

దిగిన తర్వాత డబ్బులు చూసుకున్నాను, లేవు. నేను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. అంతకు ముందు అయిదు నిముషాల వరకు కూర్చునే ఉన్నాను. కూర్చుని ఉన్నప్పుడు జేబుదొంగలు డబ్బు కొట్టే అవకాశం లేదు. నిలబడ్డ ఐదు నిమిషాల్లోనే, అంత తక్కువ సమయంలో నా సీక్రెట్ ప్యాకెట్ నుంచి నాకు తెలియకుండా డబ్బులు ఎలా కొట్టేశాడో నాకు అసలు ఏమీ అర్థం కాలేదు. సీక్రెట్ ప్యాకెట్ లో పెట్టుకుంటే డబ్బులు పోవనే ధైర్యంతో నేను అక్కడ పెట్టుకొని ఆటోలో వెళ్లకుండా సిటీ బస్సు ఎక్కాను. జేబుదొంగ నా డబ్బులు ఎలా కొట్టేసి ఉంటాడా అని నేను చాలా సేపు ఆలోచించాను. కానీ నాకు సమాధానం దొరకలేదు. నా డబ్బులు కొట్టేసిన వాడి మీద కోపం రాలేదు. వాడి నైపుణ్యానికి చాకచక్యానికి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. షర్టు జేబులో ప్యాంటు జోబుల్లో ఉన్న డబ్బులను కొట్టవచ్చు, కానీ ప్యాంట్ సీక్రెట్ జేబులో ఉన్న డబ్బును ఎంత నైపుణ్యం ఉంటే నాకు తెలియకుండా కొట్టగలడు? అది తలుచుకుంటే నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

డబ్బులు పోగొట్టుకోవడం నాకు కొత్త కాదు. అంతకు ముందు కూడా నేను చాలాసార్లు విశాఖపట్నంలో సిటీ బస్సు ఎక్కినప్పుడు డబ్బులు పోగొట్టుకున్నాను. అయితే అది ఎక్కువ మొత్తంలో కాదు. వంద,రెండు వందలు మాత్రమే. విశాఖపట్నంలో ఉంటున్నాను కాబట్టి డబ్బులు పోయినా నాకు పెద్ద బాధ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఢిల్లీ నాకు కొత్త ఊరు, తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు, ఏం చేయాలి? ఎలా చేయాలి అనేది నాకు పెద్ద సమస్యగా మారింది. ఆటోలో వెళ్లకుండా సిటీ బస్సు ఎక్కినందుకు నన్ను నేను చాలా సార్లు తిట్టుకున్నాను. ఒక దగ్గర కూర్చొని ఏం చేయాలో ఎలా చేయాలో ఆలోచిస్తూ ఉన్నాను. నాకు ఎలాంటి ఉపాయం తట్టలేదు. చాలా బాధతో ఉన్నాను. రెండు రోజులపాటు భోజనం ఖర్చులు, గెస్ట్ హౌస్ లో రూమ్ అద్దె మొదలైన వాటికి కనీసం వెయ్యి రూపాయలైనా అవుతుంది. నా దగ్గర వంద లోపు మాత్రమే చిల్లర ఉంది. ఒక గంట సేపు నేను అలా దిగులుగా ఆలోచిస్తూ కూర్చున్నాను. అప్పుడు ఒక యువకుడు నా దగ్గరకు వచ్చాడు. అతనికి 25

సంవత్సరాల వయసు ఉంటుంది. మంచి బట్టలు వేసుకొని ఉన్నాడు. అతను నాతో హిందీలో మాట్లాడాడు. నాకు వచ్చిన కొంచెం కొంచెం హిందీతోనే అతనితో మాట్లాడాను.

" మీరు ఏ ఊరు నుండి వచ్చారు?''

"నేను విశాఖపట్నం నుంచి ఇక్కడ యూ జీ సీ ఆఫీసులో పని ఉండి వచ్చాను. ఆ పని రేపు ఉంది. ఈరోజు ఖాళీగా ఉన్నాను కాబట్టి ఇక్కడ మార్కెట్లో ఏమైనా కొనుక్కుందామని వచ్చాను''.

"ఎందుకు మీరు చాలా సేపట్నుంచి దిగులుగా ఉన్నారు''?

"సిటీ బస్సులో నా దగ్గర ఉన్న నాలుగు వేల రూపాయల డబ్బులు మొత్తం ఎవరో దొంగ కొట్టేశాడు. నేను ఇక్కడ రెండు రోజులుండాలి. అందుకు చాలా డబ్బులు కావాలి. నా దగ్గర డబ్బులు ఏమీ లేవు. నాకు ఏం చేయాలో తోచడం లేదు. ఇక్కడ తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు. అందుకని చాలా దిగులుగా బాధపడుతూ ఉన్నాను''.

"మీరు చాలా అమాయకంగా కనిపిస్తూ ఉన్నారు. మిమ్మల్ని చూస్తే ఎవరికైనా సులభంగా మోసం చేయవచ్చనిపిస్తుంది. అలాగే మీరు చాలా మంచివారు లాగా కూడా ఉన్నారు. ముసలాయనకు సీటు ఇచ్చి మీరు నిలబడ్డారు. ఢిల్లీలో జేబు దొంగలు చాలా ఎక్కువ. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా దొంగలు జేబు కొట్టేస్తారు. మీరు చాలా అజాగ్రత్తగా ఉండబట్టే దొంగ మీ డబ్బులు కొట్టేశాడు. ఇప్పుడు విచారించి ఏం లాభం''.

"నిజమే, డబ్బు విషయంలో నేను తరచుగా అజాగ్రత్తగా ఉంటాను. ఇంతకు ముందు కూడా చాలాసార్లు ఇలాగే డబ్బులు పోగొట్టుకున్నాను. ఇప్పుడు నేను డబ్బులు పోగొట్టుకున్నందుకు బాధపడటం లేదు. నా జేబు కొట్టేసిన దొంగ మీద కూడా నాకు కోపం లేదు. వాడి నైపుణ్యానికి చాకచక్యానికి నాకు చాలా ఆశ్చర్యం కలుగుతూ వుంది. నేను బాధపడుతున్నది నేను ఈసమస్య నుంచి ఎలా బయట పడడమా అని, ఇక్కడ నాకు తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు. ఈరోజు, రేపు నా ఖర్చులకు ఇంటికి వెళ్లడానికి ఖర్చులకు డబ్బులు

ఎలాగా అని ఆలోచిస్తున్నాను. ఎవరైనా డబ్బులు ఇస్తే నేను మా వూరు వెళ్ళిన తర్వాత వారికి తిరిగి డబ్బులు పంపిస్తాను''.

"నేను మిమ్మల్ని బస్టాప్ లో బస్సు ఎక్కినప్పటి నుంచి గమనిస్తున్నాను. మంచి వారి లాగా కనిపిస్తున్నారు. మీకు సాయం చేయాలనిపిస్తూ వుంది. మీకు డబ్బులు ఎంత కావాలి''?

"నేను రేపు రాత్రి వరకు ఇక్కడ ఉండాలి. రేపు రాత్రి 10 గంటలకు ట్రైన్లో మా వూరికి బయలుదేరుతాను. రేపటి వరకు నాకు ఖర్చులకు కనీసం రెండు వేలు కావాలి. దయచేసి మీరు రెండు వేలు ఇస్తే మా వూరికి వెళ్లగానే మీ రెండు వేల రూపాయలు మనీయార్డర్ చేస్తాను''.

"మీ పేరేమిటి''?

నాపేరు చెప్పాను

" మీకు డబ్బులు ఇస్తాను, కానీ మీరు నాకు తిరిగి డబ్బులు పంపనవసరం లేదు''

అని చెప్పి అతను కాసేపు సందేహించి అటూఇటూ చూసి తన జేబులో నుంచి పాలిథిన్ కవర్ బయటకు తీశాడు. అందులో డబ్బులున్నాయి. నేను దాన్ని గుర్తుపట్టాను, ఆ పాలిథిన్ కవరు, డబ్బులు నావే. నేను ఆశ్చర్యంతో అతని వైపు చూసి మాట్లాడకుండా అలాగే ఉండిపోయాను. అతను తన ముఖంలో ఎలాంటి భావాలు కనిపించనీయకుండా నాతో చెప్పాడు.

"మీ జేబు కొట్టేసింది నేనే, బస్సులో మీరు నిలబడిన తర్వాత మీ మీద పడి డబ్బులు కొట్టేసాను. కానీ మీ అమాయకత్వం మీ మంచితనం చూసిన తర్వాత మీకు సాయం చేయాలనిపించింది. మీరు బస్సు దిగిన తర్వాత మిమ్మల్ని గమనిస్తూ ఉన్నాను. డబ్బులు పోయాయని తెలుసుకున్న తర్వాత మీరు బాధపడుతూ ఉంటే చూడలేక మీ దగ్గరికి వచ్చి ఇలా మాట్లాడుతున్నాను. ఈ డబ్బులు మీవే తీసుకోండి''.

నేను అతను ఇచ్చిన కవరు తీసుకొని అందులో డబ్బులు లెక్క పెట్టాను. నాలుగు వేలు ఉన్నాయి. నేను అతనికి ధన్యవాదాలు తెలిపి రెండు వేలు

తీసుకొని మిగిలిన రెండు వేలు అతనికి ఇవ్వబోయాను. కానీ అతను తీసుకోలేదు.

"నాకు తెలియకుండా నా ప్యాంటు సీక్రెట్ పాకెట్ లో ఉన్న డబ్బులు ఎలా కొట్టేశారు" అతన్ని అడిగాను.

"అది సీక్రెట్, చెప్పగూడదు"

"ఫర్వాలేదు, నేను చాలా దూరం నుంచి వచ్చిన వాన్ని, రేపు ఢిల్లీ విడిచి వెళ్ళిపోతున్నాను. అలాంటి నాకు నీ సీక్రెట్ చెప్పడం వల్ల నష్టం లేదు. తెలుసుకోవాలన్న ఆసక్తితో అడుగుతున్నాను"

"అయితే వినండి, సిటీ బస్సులో దొంగ తనం చేసే జేబు దొంగలు కొత్తవాళ్లు, జేబులో డబ్బులు పెట్టుకున్న వాళ్లు ఎవరు కనిపిస్తారా అని సిటీ బస్టాప్ లో కాచుకొని ఉంటారు. అలాంటి వాళ్ళు కనిపించగానే వారిని అనుసరిస్తూ సిటీ బస్సు ఎక్కి వారి పక్కనే నిలబడతారు. సిటీ బస్సులో రద్దీ పెరగ్గానే సమయం చూసి సడన్ బ్రేక్ వేస్తే మనుషులు తమ ఎదురుగా ఉన్న మనుషుల మీద ఎలా పడతారో అలా మీద పడి జేబులో డబ్బులు కొట్టేసి వెంటనే అక్కడి నుంచి తప్పుకొని తర్వాత స్టాప్ లో దిగిపోతారు. ఢిల్లీలో ఉన్న చాలా మందికి ఈ విషయం తెలుసు. అందుకనే నేను మీకు ఈ విషయం చెబుతున్నాను. బస్టాప్ లో మీరు నన్ను కరోల్ బాగ్ కు ఏ బస్సు వెళ్తుంది అని అడిగారు. నేను చెప్పాను. మీరు సీక్రెట్ ప్యాకెట్ మీద అప్పుడప్పుడు చేతులతో తడవటం నేను గమనించాను, దాన్ని బట్టి మీరు సీక్రెట్ ప్యాకెట్లు డబ్బులు పెట్టుకున్నారని నేను తెలుసుకున్నాను. మీతో పాటు సిటీ బస్సు ఎక్కాను. బస్సులో రద్దీ లేకపోవడం చేత మీరు కూర్చున్నప్పుడు నేను జేబు కొట్టలేకపోయాను. మీరు ముసలాయనకు సీటు ఇచ్చి నిలబడిన వెంటనే మీ మీద పడి మీ జేబులో డబ్బులు కొట్టేశాను" అన్నాడు అతను.

నేను అతని పేరు అడిగాను.

"నాపేరు మీకు అవసరం లేదు. డబ్బుల విషయంలో అజాగ్రత్తగా ఉండే మీ లాంటి వాళ్ళు జేబులో డబ్బులుంచుకొని సిటీ బస్సులో ప్రయాణం చేయకూడదు. వెళ్ళేటప్పుడు ఆటోలో వెళ్లండి".

అని చెప్పి అతను అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. నేను చాలా ఆశ్చర్య పోయాను. జరిగిందంతా వాస్తవమా? లేక కలా? అనిపించింది అంతా కలలో జరిగినట్లుగా ఉంది.

నేను ఆశ్చర్యం నుంచి తేరుకొని అక్కడ మార్కెట్లో మా అబ్బాయికి అమ్మాయికి రెండు జతల బట్టలు తీసుకొని ఆటోలో గెస్ట్ హౌస్ కు వచ్చాను. మరుసటి రోజు ఆఫీసులో నా పని పూర్తి చేసుకొని ఆరోజు రాత్రి దక్షిణ్ ఎక్స్ ప్రెస్ లో విశాఖపట్నం వచ్చాను. ఈ సంఘటన నాకు తరచుగా గుర్తుకు వస్తూ ఉంటుంది. గుర్తుకొచ్చినప్పుడల్లా దొంగల్లో కూడా మనసున్న దొంగలుంటారని అనిపిస్తూ ఉంటుంది.

తాతమ్మ చదువు

"తాతమ్మా, ఇయెన్ని ఏళ్ళో సెప్పు ?" అన్నాడు వెంకటమ్మ ముని ముని మనవడు అనిల్ తన చేతి పది వేళ్ళు ఆమెకు చూపిస్తూ.

'ఒకటి రొండు మూడు నాలుగు ఐదు ఏడు తొమ్మిది ఆ తర్వాత నాకు తెల్దురా" అన్నది వెంకటమ్మ.

"తాతమ్మా , తప్పు చెప్పినావ్, ఐదు తర్వాత ఆరు, ఏడు తర్వాత ఎనిమిది, తొమ్మిది తర్వాత పది, నీకు పది వరకు అంకెలు గూడా తెలియవు, షేమ్ షేమ్" అన్నాడు నాల్గవ తరగతి చదువుతున్న అనిల్

"నేను సదువుకోలేదురా, నువ్వంటే బడికి వోయి సదువుకుంటండావ్, నీకు అన్నీ తెలుసు, నేను సదువుకోలేదు కదా నాకు ఏందీ తెల్దు, ఇంతకు సేము సేము అంటే ఏందిరా" అన్నది వెంకటమ్మ

"మా స్కూల్లో అడిగిన దానికి జవాబు చెప్పకపోతే అట్లాంటి వాళ్లను ఎగతాళి చేయడానికి సేమ్ సేమ్ అంటాం" అన్నాడు అనిల్.

"అంటే ఇప్పుడు నువ్వు నన్ను ఎగతాళి సేచ్చండవా" అన్నది వెంకటమ్మ.

"ఔ, సేచ్చండా, నేను ఒకటి నుంచి వెయ్యి వరకు అంకెలు చెప్తాను. నువ్ పది వరకు కూడా చెప్పలేవు. నేను చాలా చిన్నపిల్లోన్ని, నాకంటె నువ్వు చాలా పెద్దదానివి, నువ్వు నామోయిన గూడా అంకెలు చెప్పలేకపోతే మరి ఎగతాళి చేయనా" అన్నాడు.

ముని ముని మనుమని మాటలకు వెంకటమ్మ చాలా బాధపడింది. ఆమెకు ఇప్పుడు 75 ఏళ్లకు పైగా వయసు వచ్చింది. ఆమె వయసు ఎంతో ఆమెకు తెలియదు, ఆమె తల్లిదండ్రులు చదువు లేని వాళ్ళు, బాగా పల్లెటూరి

వాళ్ళు, ఆమె పుట్టిన రోజును చెప్పలేదు. ఆమెకు 15 సంవత్సరాల వయసులో పెళ్లి చేశారు. పెళ్లైన రెండు సంవత్సరాల నుంచి పిల్లలు పుట్టడం ప్రారంభించారు. ముగ్గురు మగపిల్లలు నలుగురు ఆడపిల్లలు పుట్టారు. వెంకటమ్మ ఆమె భర్త మంచి కష్టజీవులు. కష్టపడి పనిచేసి ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి పంపించారు. కొడుకులకు పెళ్లిళ్లు చేశారు. ఇప్పుడు ఆమె పిల్లలకు పిల్లలు, ఆ పిల్లలకు పిల్లలు, ఆ తర్వాత పిల్లలకు కూడా పిల్లలు పుట్టారు. ఆమె భర్త చనిపోయి అయిదు సంవత్సరాలవుతుంది. కొడుకులు మంచివాళ్లే, వెంకటమ్మను బాగా చూసుకుంటున్నారు. ఆమె చేతనైన పని చేస్తూ పెద్ద కొడుకు రంగయ్య దగ్గర ఉంది. అతనికి 55 సంవత్సరాలు వయసు ఉంటుంది. అతని మనవడు అనిల్, ఆ పిల్లవాడే వెంకటమ్మను ఆమెకు అంకెలు రావని ఎగతాళి చేశాడు.

ఇంకొకసారి మరొక మనవడు రూపాయ రెండు రూపాయలు ఐదు రూపాయల నాణేలు తీసుకొని వచ్చి ఆమెకు చూపించి అవి ఎంతనో చెప్పమన్నాడు. ఆమె చెప్పలేకపోయింది. దానితో ఆ మనవడు బాల్య చాపల్యంతో "తాతమ్మకు ఏమీ తెల్దు, రూపాయ రెండు రూపాయలు కూడా తెలవు, షేమ్ షేమ్" అంటూ ఆమెను గేళి చేశాడు.

వెంకటమ్మకు చాలా బాధ కలిగింది. తల కొట్టేసినంత పని అయింది. మొదటి నుంచి ఆమెకు పౌరుషం ఎక్కువ. భర్త తిట్టినా ఆమె భరించేది కాదు. తిరిగి మాటకు మాట అనేది. అలాంటిది తన ముందు పుట్టి పెరిగిన పిల్లకుంకలు తనను ఎగతాళి చేయడం ఆమె భరించలేకపోయింది. ఆమెకు ఏం చేయాలో అర్థం కాలేదు. అలాగే అజ్ఞానంతో ఉంటే మనుమలతో పాటు ఇతరుల పిల్లలు కూడా తనను ఆట పట్టిస్తారని ఆమె బాధ పడింది. ఆ అవమానాల నుంచి ఎలా బయటపడాలా అని చాలా దీర్ఘంగా ఆలోచించింది. ఆలోచించగా ఆలోచించగా ఆమెకు అవమానాల నుంచి బయట పడడానికి చదువు ఒకటే మార్గమని ఆమెకు అనిపించింది. అందుకని ఆమె బడికి వెళ్లి చదువుకోవాలని అనుకుంది. కానీ 75 ఏళ్ల వయసులో బడికి పోతే ఊర్లో వాళ్ళు, తన కొడుకులు, మనుమలు మనవరాళ్లు, కోడళ్ళు ఏమనుకుంటారు అని ఆమె భయపడింది. తన కొడుకులు తాను బడికి వెళ్ళటానికి

ఒప్పుకుంటారా? అని కూడా ఆమె సందేహించింది. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తాను బడికి వెళ్లి చదువుకొని కనీసం అక్షర జ్ఞానం తెలుసుకోవడం, అంకెలు తెలుసుకోవడం, సంతకం చేయడం నేర్చుకోవాలని ఆమె గట్టిగా నిర్ణయించుకుంది.

ఆ వూర్లో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. అందులో ఒకరు మహిళ, ఆమె ప్రధానోపాధ్యాయురాలు, పేరు సుశీల. మరొకరు పురుషుడు ఉన్నారు. వెంకటమ్మ మొదట సుశీల దగ్గరికి వెళ్లి చదువుకోవాలన్న తన కోరికను చెప్పింది.

''టీచరమ్మా, నేను సదువుకోవాలనుకుంటండా, నన్ను బల్లో సేర్చుకుంటారా'' అన్నది.

"అవ్వా, ఈ వయసులో చదువుకుంటావా?'' అని ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

"ఏమ్మా ముసిలోళ్ళు సదువుకోగూడదా? నా వయసులో ఉండే వాళ్లను బల్లో సేర్చుకోరా'' అని నిరాశగా అడిగింది.

''బడిలో చేరడానికి వయసుకు సంబంధం లేదు. నువ్వు బడిలో చేరుతానంటే తప్పకుండా చేర్చుకుంటాం. ఈ వయసులో నువ్వు చదువుకోడానికి ముందుకు రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఏ వయసులో వాళ్ళకైనా చదువు చాలా అవసరం. నేను తప్పనిసరిగా నిన్ను బడిలో చేర్చుకుంటాను. నువ్వు బడిలో చేరుతానంటే పలక బలపం అన్నీ నేను కొని పెడతాను. ఎప్పుడు చేరతావు?'' అన్నది సుశీల.

"నేను ఇంకా నా కొడుక్కు సెప్పలే, మా వానితో మాట్లడి ఎప్పడొచ్చేది సెప్తా, మావాడేమంటాడో సూడాల'' అన్నది వెంకటమ్మ కొంచెం సంకోచంగా.

" అవ్వా, నువ్వేమీ భయపడవద్దు, నీ కొడుకును అడిగి చూడు, నువ్వు బడికి పోవడానికి నీ కొడుకు అంగీకరిస్తే మంచిదే, ఒప్పుకోకపోతే నేను వచ్చి నీ కొడుకును ఒప్పిస్తా, సరేనా'' అన్నది సుశీల.

"నా తల్లే, ఎంత మంచి మాట సెప్పినావమ్మా , నువ్వెంత మంచి దానివి, నేను సదువుకుంటానని సెప్పగానే బల్లో సేర్చుకుంటానన్నావు, పలక బలపం కొనిచ్చానన్నావు, నా కొడుక్కు సెప్పి ఒప్పిచ్చానన్నావు నువ్వు శానా మంచి దానివి తల్లి'' అన్నది.

"సరే అవ్వా , నువ్వు ముందు నీ కొడుకును అడిగి అతను ఏమన్నాడో రేపు వచ్చి చెప్పు నాకు'' అని సుశీల వెంకటమ్మని పంపించింది.

వెంకటమ్మ చాలా సంతోషంగా ఇంటికి వచ్చింది. కొడుకు ఒప్పుకోడేమో అనే సంకోచం ఆమెలో ఉంది. ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఎలాగైనా బడిలో చేరాలని ఆమె గట్టిగానే నిశ్చయించుకుంది. కొడుకును అడిగింది.

"నాయనా రంగయ్యా, నేను బడికి వోయి సదువుకోవాలనుకుంటండా, నాకు సదువంటే శానా ఇట్టం, నా సిన్నప్పుడు బడికి పోడానికి మావూర్లో బడి లేకపాయ, అప్పుడు సదువుకో లేకపోయిన, పెండ్లయినాక సదువుకోడం కుదర్లే, సంసారం, పిల్లలు, ఇంట్లో పని, బైట పనితో సదుకోవడం కుదర్లే, ఇప్పుడు నాకు యా పనీ లేదు. కాలీగా ఉన్నా, ఇప్పుడు బడికి పోయి సదువుకో వాలనుకుంటండా, నువ్వేమంటావ్'' అన్నది.

ఆమె మాటలు విని రంగయ్య ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి మాటలు రాక కాసేపు అలాగే బొమ్మ లాగా ఉండిపోయాడు. కాసేపటికి తేరుకుని "ఏందమ్మా, ఏమన్నావ్ మళ్ళా సెప్పు'' అన్నాడు.

"అదే నాయనా నేను బడికి వోయి సదువుకోవాలనుకుంటండా'' అన్నది.

"నీకు ఎన్నవై యేండ్లు వచ్చుండాయ్, కాటికి కాళ్ళు సాపిన ఈ వయసులో బడికి వోయి సదువుకుంటావా? నీకేమన్నా తిక్క వట్టిందా, ఏం మాట్లాడతండావమ్మా, నువ్విప్పుడు సదువుకొని ఏం జేచ్చావు? ఈ వయసులో పలక బలపం పట్టుకొని బడికి వోతంటే అందరు నగుతారమ్మా, అందరూ నన్ను సూసి ఎగతాళి సేచ్చారు , నా పరువు పోతాది, నాదే గాదు, మన కుటుంబం పరువు మొత్తం పోతాది. నువ్వు బడికి వోవద్దు, యాడికి వోవద్దు, ఇంట్లో ఉండు'' అని ఖచ్చితంగా చెప్పాడు రంగయ్య.

"నేను సదువుకుంటే మన పరువు పోతాదా, మన పరువు పోయేంత చెడ్డ పని నేనేం చేయలేదు రా, చదువుకోవడం మంచి పనే గాని చెడ్డ పని కాదు. సదువుకోవడం వల్ల పరువు వోతే నీ మనవలు, మనవరాళ్లు సదువుకుంటండారు గదా, మరి వాళ్ళ వల్ల పరువు పోదా'' అన్నది వెంకటమ్మ.

"అమ్మా, అడ్డదిడ్డంగా మాట్లాడాకు, నువ్వూ పిల్లలు ఒకటేనా? పిల్లలది సదువుకునే వయస్సు, నీది సదువుకునే వయసు కాదు, కాటికి కాళ్లు సాపిన వయస్సు , ఈ వయసులో సదువుకోవాలని ఎవరూ అనుకోరు, అది పద్ధతికి ఇరుద్ధం. అందుకనే నిన్ను సదువుకోవద్దంటండా, పద్ధతికి ఇరుద్ధంగా సదువుకుంటే అది పరువు నట్టం కిందకే వచ్చాది. ఇంక నువ్వు దీన్ని గురించి మాట్లాడొద్దు. నువ్వు సదుకోడం నాకేమాత్రం ఇట్టం లేదు, ఆ తర్వాత నీ ఇట్టం'' అని కోపంగా మాట్లాడి రంగయ్య ఇంట్లో నుంచి బైటికి వెళ్లిపోయాడు.

కొడుకు కోపంగా మాట్లాడి వెళ్లిపోవడంతో వెంకటమ్మకు ఏం చేయాలో తోచలేదు. ఆమెకు చాలా దిగులు పట్టుకుంది. ఆ రోజంతా ఏమి తినలేదు తాగలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ బడికి వెళ్లాలని ఆమె నిశ్చయించుకుంది. మరుసటి రోజు ఆమె బడికి వెళ్లి తన కొడుకు చెప్పిన విషయం గురించి ప్రధానోపాధ్యాయురాలైన సుశీలతో చెప్పింది. సుశీల తాను వచ్చి రంగయ్యతో మాట్లాడతానని హామీ ఇచ్చింది. వెంకటమ్మ కొంతవరకు సంతోషించింది.

మరుసటి రోజు సుశీల రంగయ్య దగ్గరకు వచ్చి మాట్లాడింది. "అన్నా, అమ్మ వెంకటమ్మ చదువుకుంటానని అంటూ వుంది. ఆమెకు చదువుకోవాలనే ఆసక్తి చాలా ఎక్కువగా ఉంది. చదువుకోవడానికి వయసు అడ్డు కాదు. ఏ వయసు వారైనా చదువుకోవచ్చు. అందరూ చదువుకోవాలని, మనదేశంలో చదువు లేని వారు ఎవరూ ఉండకూడదని ప్రభుత్వం అనేక రకాల పథకాలు పెడుతూ ఉంది. గతంలో వయోజన విద్య అనే కార్యక్రమం పెట్టి గ్రామాల్లో చదువు లేని వయసులో పెద్ద వారందరికీ చదువుకునే అవకాశం కలిగించింది. ఇప్పుడు ఆ కార్యక్రమం ఆగిపోయింది. ఆ కార్యక్రమం ఉన్నప్పుడు చాలామంది పెద్దవాళ్లు రాత్రిపూట చదువుకోడానికి బడికి వెళ్లారు. వాళ్లను చూసి ఎవరూ చిన్నతనంగా మాట్లాడలేదు. పరువు తక్కువగా భావించలేదు. ఇప్పుడు నువ్వు అమ్మ చదువుకుంటానంటే అది పరువు తక్కువ అంటున్నావట,

చదువుకోవడం పరువు తక్కువ కాదన్నా , చదువు లేకపోవడం పరువు తక్కువ, చదువుకోవడం చాలా మంచిది. కాబట్టి అమ్మను చదువుకోవడానికి బడికి పంపించండి. నేను చాలా శ్రద్ధగా అమ్మకు చదువు చెప్పి ఆమెను అక్షరాస్యురాలుగా చేస్తాను. దానివల్ల ప్రభుత్వం వారి ఆశయం నెరవేరుతుంది. చదువుకునేవాళ్ళను ఆపటం ఒకరకంగా నేరం. మీరు ఆ నేరం చేయొద్దు. దయచేసి నా మాట విని అమ్మను చదువుకోవడానికి బడికి పంపించండి'' అని చెప్పింది.

ప్రధానోపాధ్యాయురాలు తన ఇంటికి వచ్చి తల్లిని బడికి పంపించమని నయంగా చెప్పడంతో రంగయ్య వద్దని అడ్డు చెప్పలేకపోయాడు.

"సరేనమ్మా అమ్మకు సదువుకోవాలని అంత ఇట్టంగా ఉంటే అట్లనే సదువుకోనీయండి, నేను అడ్డు సెప్పను. అమ్మ ఇట్టం మీ ఇట్టం'' అని రంగయ్య చెప్పాడు.

ప్రధానోపాధ్యాయురాలు "చాలా మంచిదన్నా'' అని చెప్పి ఆమె బడికి వెళ్ళిపోయింది.

ఆ మరుసటి రోజు నుంచి వెంకటమ్మ పలక బలపం తీసుకొని బడికి వెళ్ళింది. ఆమెను చూసి ఊర్లో వాళ్ళు మొదట ఆశ్చర్యపోయారు. కొంత మంది ఆమెను ఈ వయసులో సదువెందుకని నిరుత్సాహ పరిచారు. కొంత మంది ఆమెను "బాగా సదువుకొని పిల్లొల్లతో పోటీ చేసి గెలచాలని'' ఉత్సాహ పరిచారు. ఎవరేమన్నా ఆమె పట్టించుకోకుండా బడికి పోయి చదువుకుంటూ ఉంది. ఊర్లో వాళ్ళకు ఆమె బడికి పోయి చదువుకోవడం అలవాటైపోయింది. వెంకటమ్మ చాలా ఇష్టంతో ఆసక్తితో చదువు నేర్చుకోవడం ప్రారంభించింది. సుశీల ఆమెకు చాలా శ్రద్ధగా చదువు చెబుతూ వుంది. వెంకటమ్మ చాలా తక్కువ కాలంలోనే తెలుగు అక్షరాలు రాయడం చదవడం నేర్చుకుంది. అంకెలు ఒకటి నుంచి వంద వరకు చెప్పడం రాయడం నేర్చుకుంది. తన సంతకం చేయడం నేర్చుకుంది. తాను అక్షరాస్యురాలు అయినందుకు వెంకటమ్మ చాలా సంతోషించింది. ఆమె తన మనుమలతో

"ఒరేయ్ నాకు కూడా చదువు వచ్చు, అవసరమైతే మీతో పోటీ పడగలను జాగ్రత్త'' అని ధీమాగా చెప్పింది.

ఆటో పార్వతి

"నాన్నా, నేను ఆటో డ్రైవింగ్ నేర్చుకొని మీలాగే ఆటో నడుపుతాను'' అన్నది పార్వతి. ఆమె మాటలు విని ఓబన్న ఆశ్చర్యపోయాడు.

"ఆటో డ్రైవింగ్ అమ్మాయిలకు మంచిది కాదమ్మా, రాత్రింబవళ్ళు పని చేయాల, పాసింజర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి పోవాల. ఆటోలో అనేక రకాల మనుషులు కొత్త కొత్త వాళ్ళు ఎక్కుతారు. ఎవరు ఎలాంటి వాళ్ళో తెలియదు. మన నగరంలో పోకిరీ ఎదవలు చాలా మంది ఉన్నారు. వాళ్ళు పాసింజర్లుగా ఆటోలో ఎక్కి కూర్చొని దూరంగా తీసుకుని పోయి అపకారం కలిగిస్తారు. నువ్వు ముసలీ ముతకవు కాదు. పాతికేళ్ల వయసులో ఉన్నావు. నీబోటి వాళ్ళకు ఆటో నడపడం ఏమాత్రం మంచిది కాదమ్మా. నేను ముప్పై ఏళ్ల నుంచి ఆటో నడుపుతున్నాను. ఆటో నడపడంలో ఉన్న సమస్యలు నాకు బాగా తెలుసు. ఇంత వరకు మన నగరంలో ఆడవాళ్ళు ఎవరూ ఆటో నడపలేదు. దానికి కారణం ఈ రంగం ఆడవాళ్ళకు మంచిది కాదనే. కాబట్టి నువ్వు ఆటో నడపడం నాకిష్టం లేదు. నీకు మళ్లీ పెళ్లి చేద్దామనుకుంటున్నాను. సంబంధాలు చూస్తున్నాను.'' అన్నాడు ఓబన్న.

"నాకు మళ్లీ పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు నాన్న, నేను బాగా చదువుకోవాలని మొత్తుకున్నా నా మాట వినకుండా పదవ తరగతి అయిన వెంటనే బలవంతంగా మేనరికం పేరుతో నాకు ఒక తాగుబోతు ఎదవ నిచ్చి పెళ్ళి చేశావ్. పెళ్ళైనప్పటి నుంచి వాడు తాగొచ్చి నన్ను చిత్రహింసలు పెట్టాడు. ఎనిమిది సంవత్సరాలు నేను వానితో నరకం అనుభవించాను. ఈ ఎనిమిది సంవత్సరాలుగా నేను ఎనిమిది జన్మలకు సరిపడా కష్టాలు పడ్డాను. నా అదృష్టం బాగుండ బట్టి వాడు ఆక్సిడెంట్ లో చచ్చాడు కావట్టి నేను బతికి పోయాను. లేకపోతే వాని చేతిలో ఇంకా ఎన్ని కష్టాలు పడేదాన్నో. ఇంక మళ్ళీ పెళ్లి చేసుకొని

నాజీవితాన్ని మరొక మగ ఎదవ చేతిలో పెట్టి కష్టాలు పడే ఓపిక నాకు లేదు. నేను మళ్ళీ పెళ్లి చేసుకొనే ప్రసక్తే లేదు. నా పెళ్లి గురించి మళ్ళీ మాట్లాడావంటే నేను ఇంట్లో నుంచి పారిపోతాను. నేను ఒంటరిగా స్వతంత్రంగా నా బతుకు నేను బతుకుతాను. నేను ఎవరి మీదా ఆధారపడి బతక దలచుకోలేదు. అందుకనే నేను ఆటో డ్రైవింగ్ నేర్చుకోవాలను కుంటున్నాను'' అన్నది పార్వతి.

"మగవాళ్ళందరూ చెడ్డవాళ్ళు కాదమ్మా, మంచి వాళ్ళు కూడా ఉన్నారు. ఈసారి బాగా విచారించి మంచివాన్ని చూసి పెళ్ళి చేస్తాను. మన సమాజంలో ఆడవాళ్లు ఒంటరిగా బతకలేరు. తప్పనిసరిగా మగ తోడు అవసరం. ఈ విషయం నీకు తెలియంది కాదు. అందుకనే నేను నీకు మళ్ళీ పెళ్లి చేయాలని ఇంతగా ఆలోచిస్తున్నాను. స్త్రీలకు తల్లిదండ్రులు ఎల్లకాలం తోడుగా ఉండలేరు. ఆడవాళ్లకు జీవితాంతం తోడుండేది భర్త మాత్రమే, కాబట్టి నీకు మళ్ళీ పెళ్లి చేయాలనుకుంటున్నాను'' అన్నాడు ఓబన్న.

"నాన్నా ,ఇలాగే మేనరికం చాలా మంచిదని, బావ తెలిసినవాడని పిచ్చి మాటలు చెప్పి నన్ను మీ చెల్లెలు కొడుక్కు ఇచ్చి పెళ్లి చేశావు, ఏమైంది? వాడు నన్ను చిత్రహింసలు పెట్టి మానసికంగా శారీరకంగా ఎన్ని రకాల బాధలు పెట్టాడో చెప్పలేను. నువ్వు ఇంక నా విషయంలో పెళ్లి మాట తలపెట్టవద్దు. నేను ఆత్మహత్య అయినా చేసుకుంటాను గాని మళ్లీ పెళ్లి మాత్రం చేసుకోను. ఇదే నా చివరి మాట, ఈ మాటకు తిరుగులేదు. ఇక తోడంటావా, నువ్వు అమ్మా ఉన్నారు కదా, మీరున్నంత కాలం మీతో ఉంటాను. మీ తర్వాత అన్నయ్య నాకు సాయంగా ఉంటాడు. అన్నయ్య ఇంటికి దగ్గరలో వేరే ఇంట్లో ఉంటాను. అన్నయ్యకు పిల్లలున్నారు. వాని పిల్లలే నా పిల్లలనుకుంటాను. నా సంపాదన బాగా ఉంటే నేను ఒక అనాథ అమ్మాయిని పెంచుకుంటాను. ఆ అమ్మాయి నాకు తోడుగా ఉంటుంది. అంతేగానీ ఇంక మళ్ళీ పెళ్లి చేసుకునే ప్రసక్తే లేదు'' అన్నది.

" సరే పెళ్లి సంగతి పక్కన పెడదాం, ఇంత వరకు మన నగరంలో అమ్మాయిలు ఎవరూ ఆటో నడపలేదు. ఇప్పుడు నువ్వు ఆటో నడపడం మొదలు బెడితే అందరూ నీవేపు విచిత్రంగా చూస్తారు తల్లీ, ఫలానా ఓవన్న బిడ్డ మగరాయుని మాదిరిగా ఆటో నడుపుతూ ఉందని నన్ను గురించి

తక్కువగా మాట్లాడుకుంటారు. అనేక రకాల సమస్యలు వస్తాయి. వాటన్నింటినీ ఎదుర్కోవడం చాలా కష్టం'' అన్నాడు ఓబన్న.

“లోకంలో కొత్త దాన్ని వింతగా చూస్తారు జనాలు. నువ్వన్నట్లు మన నగరంలో ఆడవాళ్ళు ఎవరూ ఇంతవరకూ ఆటో నడపలేదు కాబట్టి మొదట్లో ఆటో నడుపుతున్న నావైపు విచిత్రంగా చూస్తారు. కొద్ది రోజుల్లోనే అది పాత బడుతుంది. ఆ తర్వాత నన్ను ఎవరూ పట్టించుకోరు. అంతేకాదు నన్ను చూసి మరికొంతమంది మహిళలు ఆటో నడపడానికి ముందుకొస్తారు. నీ బిడ్డను నేను మన నగరంలో మొదట మగరాయుని మాదిరిగా ధైర్యంగా ఆటో నడుపుతూ ఉంటే చూసి నువ్వు గర్వపడాల గానీ చిన్నతనంగా భావించకూడదు నాన్నా. సమస్యలు అన్ని చోట్లా ఉంటాయి. సమస్యలు వస్తాయని భయపడితే మనం ఏ పని చేయలేం. వాటిని ఎదుర్కొని ముందుకు పోవాలి'' అన్నది పార్వతి.

“ఈ రంగం ఆడవాళ్ళకు మంచిది కాదమ్మా. రాత్రి వేళల్లో ఆటో నడపడం చాలా ప్రమాదం. ఆడవారి మానప్రాణాలకు గ్యారంటీ లేదు'' అన్నాడు ఓబన్న.

“ఏరంగంలోనూ ఎవరికీ గ్యారంటీ లేదు నాన్నా, మన జాగ్రత్తలో మనముండాలి. నా జాగ్రత్తలో నేనుంటాను. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు జనాలు బాగా వుండే ప్రాంతంలో మాత్రమే ఆటో నడుపుతాను. రాత్రి ఎనిమిది గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటో నడపను. ఇంటికొస్తాను. నువ్వు ఆటో డ్రైవరివి కావడం నాకు కొంత మేలు. ఆటో డ్రైవర్లు చాలా మంది నాకు పరిచయస్తులే. అవసరమైనప్పుడు వాళ్ళు నాకు సాయంగా ఉంటారు. అందువల్ల నాకేమైనా జరుగుతుందని నువ్వు భయపడవలసిన అవసరం లేదు'' అన్నది పార్వతి.

“నువ్వు ఎన్ని చెప్పినా నువ్వు ఆటో నడపడం నాకిష్టం లేదు తల్లీ, ఏదైనా ఆసుపత్రిలో గానీ స్కూల్లో గానీ నీకు తగిన ఉద్యోగం చూస్తాను. నా మాట విని ఆటో నడపాలన్న ప్రయత్నం మానుకో తల్లీ'' అన్నాడు ఓబన్న.

“నాన్నా, నేను నర్సింగ్ కోర్సు చేసి నర్స్ గా రోగులకు సేవలు చేయాలనుకున్నాను. కానీ నువ్వు నా కోరిక కాదని చదువు మాన్పించి

బలవంతంగా పెళ్లి చేశావు. ఇక ఇప్పుడు ఆటో నడపాలన్న నాకోరిక కాదనకు. ఒకరి దగ్గర పని చేయడం నాకిష్టం లేదు. నేను స్వతంత్రంగా బతకాలనుకుంటున్నాను. నేను ఇప్పుడు నిన్ను అడుగుతున్నది నాకు ఆటో నడపడం నేర్పించమని, నువ్వు నేర్పించకపోతే నేనే ఏదైనా డ్రైవింగ్ స్కూల్ లో చేరి ఆటో నడపడం నేర్చుకుంటాను" అని చాలా ఖండితంగా చెప్పింది పార్వతి.

పార్వతి అంత గట్టిగా చెప్పడంతో ఓబన్న ఇంక ఏమి మాట్లాడలేక పోయాడు. ఆమెకు ఆటో నేర్పించడం తప్పనిసరి అని అతను గ్రహించాడు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ఖాళీగా ఉన్న ఒక గ్రౌండ్ కు ఆటోలో పార్వతిని తీసుకొని వెళ్లి ఆటో నడపడం నేర్పించడం మొదలుపెట్టాడు. ఆటో నడపడంలో పార్వతికి చాలా శ్రద్ధ ఇష్టం ఉండటంవల్ల ఆమె చాలా తక్కువ కాలంలోనే ఆటో నడపడం నేర్చుకుంది. అంతేకాకుండా ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకుంది.

ఆ తర్వాత ఆమె సొంతంగా ఆటో కొనుక్కోవాలని నిశ్చయించుకుంది. బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి ఆటో కొనుక్కోవడానికి లోన్ కావాలని అడిగింది. లోన్ ఇవ్వడానికి బ్యాంకు వాళ్ళు అంగీకరించారు. అయితే ఎవరైనా ఉద్యోగస్తులు ష్యూరిటీ ఇవ్వాలని చెప్పారు. ఆమెకు తెలిసిన ఉద్యోగస్తులు ఎవరూ లేరు. అందువల్ల ఆమె ష్యూరిటీ సంపాదించలేకపోయింది. దానితో బ్యాంకు వాళ్ళు లోన్ ఇవ్వలేదు. ఆమెకు ఏం చేయాలో అర్థం కాలేదు. బ్యాంకు నుంచి లోన్ పొందడం గురించి ఆమె చాలా తీవ్రంగా ఆలోచించింది. చివరకు ఆమెకు ఒక మార్గం కనిపించింది.

ఆ నగరంలో అప్పుడు నగర పోలీస్ కమీషనర్ గా పద్మప్రియ ఉన్నారు. ఆమె స్త్రీలకు అందుబాటులో ఉండి స్త్రీల సమస్యల పట్ల చాలా శ్రద్ధ వహించి పరిష్కరిస్తున్నారు. ఆ విషయం తెలుసుకున్న పార్వతి ఆమెను కలిసి ఆటో కొనుక్కోవడానికి ఆమె సాయం తీసుకోవాలని నిర్ణయించుకుంది. అనుకున్నట్టుగానే పార్వతి పోలీసు కమిషనర్ ను కలిసి తన గురించి చెప్పుకొని తనకున్న ఆటో డ్రైవింగ్ లైసెన్స్ ను చూపించి ఆటో కొనుక్కోవడానికి బ్యాంకు లోన్ ఇప్పించడం విషయంలో సాయం చేయవలసిందిగా కోరింది. కమీషనర్ ఆమె చెప్పింది శ్రద్ధగా విని ఆమె ఏ బ్యాంకుకు లోన్ దరఖాస్తు చేసిందో

తెలుసుకొని రెండు రోజుల తర్వాత కలవమని చెప్పారు. ఈలోగా కమీషనర్ పార్వతిని గురించి, ఆమె తండ్రి ఓబన్నను గురించి ఎంక్వైరీ చేయించారు. ఓబన్న నిజాయితీ గల ఆటో డ్రైవరని, అతని కూతురు పార్వతి ఆటో నడుపుతూ స్వతంత్రంగా బతకాలను కుంటూవుందనీ ఎంక్వైరీ లో కమీషనర్ తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆమె బాంకు మేనేజర్ కు ఫోన్ చేసి పార్వతి ఆటో కొనుక్కోవడానికి ఎలాంటి ష్యూరిటీ అవసరం లేకుండా లోన్ ఏర్పాటు చేశారు. ష్యూరిటీ లేకుండా లోన్ ఇవ్వడానికి మొదట బ్యాంకు మేనేజర్ అంగీకరించలేదు. లోన్ పూర్తిగా తీరే వరకు ఆటోకు సంబంధించిన ముఖ్యమైన కాగితాలు బ్యాంకు వాళ్ళు తమ దగ్గరే ఉంచుకుంటారు కాబట్టి బ్యాంకు వాళ్ళు లోన్ విషయం గురించి భయపడాల్సిన అవసరం లేదని, ఒకవేళ నెల వారీ కంతులు ఆటో వాళ్ళు కట్టకపోతే బ్యాంకు వాళ్ళు ఆటోను స్వాధీనం చేసుకోవచ్చని చెప్పి కమీషనర్ బ్యాంకు మేనేజర్ ను అంగీరింపజేసి పార్వతికి లోన్ ఇచ్చే లాగా చేశారు.

రెండు రోజుల తర్వాత పార్వతి కమీషనర్ ను కలిసింది. ఆమెకు లోన్ ఇవ్వడానికి బ్యాంకు వాళ్ళు అంగీకరించారని కమీషనర్ పార్వతికి చెప్పారు. అంతేకాకుండా ధైర్యంగా ఆటో నడపడానికి ముందుకొచ్చినందుకు ఆమెను కమీషనర్ అభినందించారు. పార్వతి చాలా సంతోషించి కమీషనర్‌కు ధన్యవాదాలు తెలియజేసింది. ఆ తర్వాత పార్వతి బ్యాంకు మేనేజర్ ను కలిసి లోన్‌కు సంబంధించిన కాగితాలు పూర్తి చేసింది. ఆమెకు లోన్ మంజూ రయింది. ఆటో తీసుకుంది. తాను ఆటోకు యజమాని అయినందుకు, ఆటో డ్రైవర్ కావాలన్న తన కోరిక నెరవేరుతున్నందుకు పార్వతి ఎంతగానో సంతోషించింది.

పార్వతి ధైర్యంగా ఆటో నడపడానికి ముందుకొచ్చినందుకు ఆమెను అభినందించడానికి కమీషనర్ పద్మప్రియ గారు పౌర సభను (పబ్లిక్ మీటింగ్) ఏర్పాటు చేశారు. ఆ సభకు ఆటో డ్రైవర్ లు చాలా మంది వచ్చారు. ప్రజలు కూడా చాలా మంది వచ్చారు. కమీషనర్ స్థానిక ఎం.ఎల్.ఏ ను ఆహ్వానించారు. పార్వతిని వేదిక మీద కూర్చోబెట్టారు. ఆ సభలో కమీషనర్ మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు రావాలని,

అందుకు పురుషులు ముఖ్యంగా కుటుంబ సభ్యులు మహిళలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్వతి ఆటో నడపడానికి అంగీకరించిన ఆమె తల్లిదండ్రులను మెచ్చుకున్నారు. నగరంలో మొదటి మహిళగా ధైర్యంగా ఆటో నడపడానికి ముందుకొచ్చినందుకు పార్వతిని ఆమె అభినందిస్తూ ఎం.ఎల్.ఏ చేత ఆటో తాళం చెవిని పార్వతికి ఇప్పించారు. పార్వతిని ఆదర్శంగా తీసుకుని మరికొంతమంది మహిళలు ఆటో నడపడానికి ముందుకు రావాలని చెప్పారు. పోలీసులు ఆటో నడుపుతున్న మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు గట్టిగా చెప్పారు. మహిళా డ్రైవర్లందరికీ పోలీస్ స్టేషన్ నెంబర్ ఇస్తామని, వారు తమ సమస్యను గురించి ఫోన్ చెసిన వెంటనే పోలీసులు వారి సమస్యల్ని పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటారని కూడా ఆమె హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ లుగా ఉన్న మహిళల సమస్యలను పరిష్కరించడంలో తాను ముందుంటానని, వారికి ఎలాంటి సహాయం కావాలన్నా తాను చేస్తానని ఎం.ఎల్.ఏ వాగ్దానం చేశారు.

తన కోసం కమీషనర్ గారు పెద్ద ఎత్తున సభను నిర్వహించి, తనను వేదిక మీద కూర్చోబెట్టినందుకు పార్వతి సంతోషంతో ఉప్పొంగి పోయింది. తనకు ఇంత గొప్ప మర్యాద జరుగుతుందని ఆమె ఎప్పుడూ ఊహించలేదు. తనకు జరిగిన గౌరవానికి కమీషనర్ ను కలిసి ఆమె అనేక ధన్యవాదాలు తెలియజేసింది. తన కూతురుకు జరిగిన గౌరవానికి ఓబన్న చాలా సంతోషించాడు. పార్వతి వల్ల తోటి ఆటో డ్రైవర్ లలో అతని పరపతి బాగా పెరిగింది. కంటే ఇలాంటి కూతురును కనాలని అతను తన తోటివారికి చాలా సంతోషంగా చెప్పాడు.

పార్వతి సంతోషంగా ఆటోను నడుపుతూ స్వతంత్రంగా జీవితం గడుపుతూ ప్రతి నెల బ్యాంకులో ఆటో లోన్ కు సంబంధించిన కంతులు కడుతూ ఉంది. చాలా మంది మగ ఆటో డ్రైవర్లు ఆమెకు సాయంగా ఉంటున్నారు. ఆటో డ్రైవింగ్ సీట్లో ఆమెను చూసి చాలా మంది ప్రయాణికులు ఆమెను అభినందిస్తూ ఉన్నారు. కొంత మంది స్త్రీలు ధైర్యంగా ఆమె ఆటో నడుపుతున్నందుకు ప్రశంసిస్తూ ఆమెతో సెల్ఫీ గూడా తీసుకుంటూ ఉన్నారు.

అది ఆమెకు చాలా సంతోషాన్ని కలిగిస్తూ వుంది. రెండు మూడు సార్లు కొంత మంది ఆకతాయి కుర్రాళ్ళు ఆమెను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. ఆమె ఏ మాత్రం భయపడకుండా వారిని ఎదుర్కోవడమే గాకుండా పోలీసులకు ఫోన్ చేసి వారిని పట్టించింది. అప్పటి నుంచి ఆమెకు మరి ఎవరి వల్ల ఎలాంటి సమస్య రాలేదు.

ఎలాంటి మోసం లేకుండా చాలా న్యాయంగా ఆమె ఆటో చార్జి తీసుకుంటూ ఆటో పార్వతిగా పేరు తెచ్చుకుంది. ఆమెను చూసి మరి కొంత మంది పురుష ఆటో డ్రైవర్లు తమ కూతుర్లకు బ్యాంకు లోన్ తో ఆటోలు కొనిపించి వారితో ఆటోలు నడిపించడం ప్రారంభించారు. నిరుద్యోగులుగా ఉన్న మరి కొంత మంది మహిళలు లోన్ తీసుకుని ఆటోడ్రైవర్ లుగా జీవితాన్ని ప్రారంభించారు. వారందరికీ పార్వతి డ్రైవింగ్ లైసెన్స్ పొందడం విషయంలో, బ్యాంకు లోన్ మంజూరు చేయించడం విషయంలో చాలా సాయం చేసింది. ఆవిధంగా పార్వతి చాలా మంది మహిళలకు ప్రేరణ, ఆదర్శం అయింది.

ఆటోడ్రైవర్ గా పార్వతి సంపాదన బాగానే ఉంది. ఆమె తల్లిదండ్రులను ఒప్పించి అనాథ శరణాలయంలో వున్న మూడు సంవత్సరాల పాపను దత్తత తీసుకుని ఇంటికి తెచ్చుకుంది. ఆ పాపను సొంత కూతురు లాగా చూసుకుంటూ ఆటోడ్రైవర్ గా సంతోషంగా జీవనం సాగిస్తూ వుంది ఆటో పార్వతి.

అతి గారాబం

రామచంద్ర రావు అన్నపూర్ణలకు పెళ్లైన తర్వాత ఐదు సంవత్సరాలకు రాఘవ పుట్టాడు. లేక లేక పుట్టిన కొడుకు కావడం చేత తల్లిదండ్రులు అతన్ని చాలా గారాబంగా విలాసవంతంగా అల్లారు ముద్దుగా పెంచడం ప్రారంభించారు. వాళ్లు ఒక మాదిరి ధనవంతులు. రామచంద్ర రావు వ్యాపారం చేస్తున్నాడు. డబ్బుకు కొదవ లేదు. కొడుకు ప్రతి పుట్టిన రోజును చాలా ఆర్భాటంగా చేశారు. చిన్నప్పటి నుంచి ఎక్కువ గారాబం చేయడం వల్ల రాఘవ పెంకెగా తయారయ్యాడు. అతడు ఏమడిగినా కొనిపెట్టారు. తానడిగింది తెచ్చి ఇవ్వకపోతే రాఘవ గొడవ చేసేవాడు. చాలా ఏడ్చేవాడు. అన్నం తినేవాడు కాదు నీళ్లు తాగేవాడు కాదు. ఇంట్లో వస్తువులు పగలగొట్టేవాడు. ఇంట్లో నుంచి పారిపోతానని బెదిరించేవాడు. దానితో తల్లిదండ్రులు భయపడిపోయి అతను ఏమి అడిగినా తెచ్చి పెట్టేవారు, కొనిచ్చేవారు.

రామచంద్ర రావుకు 150 సి.సి మోటార్ సైకిల్, కారు ఉన్నాయి. రాఘవకు కారులో వెళ్ళడం ఇష్టం కాదు. మోటార్ సైకిల్ అంటే చాలా ఇష్టం. రామచంద్ర రావు కొడుకును చిన్నప్పటి నుంచి మోటార్ సైకిల్ మీద ముందు కూర్చోబెట్టుకుని తీసుకొని వెళ్లేవాడు. దానితో ఆ పిల్లవాడికి మోటార్ సైకిల్ మీద పిచ్చి ప్రేమ ఏర్పడింది. మోటార్ సైకిల్ మీద తనను తిప్పమని ప్రతిరోజు పీడించేవాడు. రాఘవ పెరిగే కొద్దీ అతనికి మోటార్ సైకిల్ మీద పిచ్చి కూడా పెరుగుతూ వచ్చింది. రామచంద్ర రావు రాఘవను ముందు కూర్చోబెట్టుకుని వెళ్ళేటప్పుడు బైకును వేగంగా నడపమని తండ్రిని ప్రోద్బలం చేసేవాడు. రామచంద్ర రావు ఎంత వేగంగా నడిపినా ఇంకా ఇంకా వేగంగా నడపమని తండ్రితో చెప్పేవాడు. పిల్లలు అలా చెబుతున్నప్పుడు తండ్రి వేగంగా నడపడం మంచిది కాదని, ఆక్సిడెంట్ జరుగుతుందని చిన్నపిల్లలకు నచ్చ చెప్పాలి.

కానీ రామచంద్ర రావు అలా చెప్పకుండా కొడుకుకు మోటార్ సైకిల్ మీద ఉన్న ప్రేమను గొప్పదిగా భావించి అతను మోటార్ సైకిల్ ను వేగంగా నడిపేవాడు. రాఘవకు ఐదేళ్ళు వచ్చినప్పటి నుంచి రామచంద్ర రావు ముందు కూర్చున్న రాఘవకు క్లచ్ ఆపరేట్ చేయడం నేర్పించాడు.

రాఘవకు పన్నెండు సంవత్సరాల వయసు వచ్చేటప్పటికి రామచంద్ర రావు కొడుకుకు మోటార్ సైకిల్ డ్రైవింగ్ నేర్పించాడు. రాఘవకు సరిగ్గా కాళ్లు కూడా అందవు. ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. కాళ్ళు సరిగా అందకపోయినా తండ్రి మోటర్ సైకిల్ వేసుకొని రాఘవ తిరుగుతూ ఉంటాడు. తానొక్కడే కాకుండా తనతో పాటు చదువుతున్న మిత్రులను ఒకరిని ఇద్దరిని వెనకాల కూర్చోబెట్టుకొని చాలా వేగంగా బండి నడుపుతూ ఉంటాడు. ఆ వయసులో వాళ్లకు స్పీడ్ థ్రిల్ ఇస్తుంది. థ్రిల్ కోసం అతను బండిని వేగంగా నడిపేవాడు. అయితే అది ప్రాణం తీస్తుందనే సంగతి అతనికి తెలియదు. తల్లిదండ్రులు స్పీడుగా బండి నడపవద్దని ఎంతగా చెప్పిన అతను వినేవాడు కాదు.

ఒకసారి రాఘవ బైక్ నడుపుతున్నప్పుడు అకస్మాత్తుగా గేదె అడ్డం వచ్చింది. సడన్ బ్రేక్ వేసి బ్యాలెన్స్ పట్టలేక కింద పడిపోయాడు. బాగా దెబ్బలు తగిలాయి. ఇరవై రోజులు పాటు ఆసుపత్రిలో ఉన్నాడు. అతని తల్లి కుమారుని పరిస్థితి చూసి చాలా ఏడ్చింది. రామచంద్ర రావు కొడుకును చూసి చాలా దిగులు పడ్డాడు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చాక కొద్దిరోజుల పాటు రాఘవకు బైక్ ఇవ్వలేదు. నెల రోజుల తర్వాత మళ్ళీ మామూలే. తల్లిదండ్రులు చెప్పినా వినకుండా రాఘవ బైక్ వేసుకుని తిరుగుతున్నాడు. రాఘవ ఒక్కడే కాదు, చాలామంది మైనర్ కుర్రవాళ్ళు బైకులు స్కూటర్లు వేసుకొని రోడ్లమీద తిరుగుతున్నారు. ప్రభుత్వ చట్టాల ప్రకారం 18 సంవత్సరాలు నిండిన వాళ్ళు మాత్రమే గేర్ ఉన్న మోటార్ సైకిల్ నడపాలి. 16 సంవత్సరాలు నిండిన వాళ్ళు గేర్ లేని స్కూటర్ ను నడపడానికి అర్హులు. అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవాళ్లు మోటార్ సైకిల్ ను గానీ స్కూటర్ ను గానీ నడపకూడదు. కానీ ఈ చట్టాలను పట్టించుకోకుండా చాలామంది మైనర్ కుర్రవాళ్ళు మోటార్ సైకిళ్ళను స్కూటర్లను నడుపుతున్నారు. వాళ్ళను కట్టడి

చేయడానికి ఒకసారి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాఘవతో పాటు చాలామంది మైనర్ కుర్రవాళ్ళు బైకులు నడుపుతూ పోలీసులకు దొరికిపోయారు. మొదటిసారి కాబట్టి ఒక్కొక్కరికి 2000 రూపాయలు జరిమానా వేసి గట్టిగా హెచ్చరించి పోలీసులు వారిని వదిలిపెట్టారు. దానితో ఒక వారం రోజులపాటు రామచంద్ర రావు రాఘవకు బైకు ఇవ్వలేదు. వారం తర్వాత తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా రాఘవ బైక్ వేసుకొని మళ్ళీ తిరగడం మొదలు పెట్టాడు.

రాఘవకు బుల్లెట్ బండి అంటే చాలా ఇష్టం. దానిమీద తిరగాలని అతను కోరుకుంటూ ఉండేవాడు. అందువల్ల అతను తండ్రిని బుల్లెట్ బండిని కొనమని అడిగాడు. బుల్లెట్ చాలా బరువైనదని దాన్ని అందరూ నడపలేరని బాగా బలంగా ఉన్నవాళ్లు బరువు ఎక్కువ ఉన్నవాళ్లే దాని నడపగలరని తనలాగా రాఘవ లాగా సన్నగా ఉన్నవాళ్లు బుల్లెట్ మోటార్ సైకిల్ ను నడపలేరని రామచంద్ర రావు రాఘవను ఒప్పించే ప్రయత్నం చేశాడు. కానీ రాఘవ తండ్రి మాట వినలేదు. తనకు మోటార్ సైకిల్ నడపడం చాలా బాగా వచ్చునని, సన్నగా ఉన్నప్పటికీ బుల్లెట్ బండిని తాను బాగా నడపగలనని బుల్లెట్ బండి కొనమని రాఘవ తండ్రికి చెప్పాడు. రామచంద్ర రావు బుల్లెట్ బండి కొననని చెప్పలేదు. అలా చెబితే రాఘవ ఇంట్లో వస్తువులు పగలగొట్టి చాలా గొడవ చేస్తాడు. అందువల్ల అతను అలా చెప్పకుండా కొందాంలే అని చెబుతూ ఒక నెల రోజులు పాటు తాత్సారం చేశాడు.

రామచంద్ర రావు బుల్లెట్ బండిని కొనకుండా ఆలస్యం చేస్తుండంతో రాఘవ కోపంతో ఇంట్లో ఉన్న టీ.వీ ని పగలగొట్టాడు. దానితో అన్నపూర్ణ రాఘవ కోరినట్లుగా బుల్లెట్ బండి కొనమని ఒత్తిడి చేయడం ప్రారంభించింది. రామచంద్రరావుకు బుల్లెట్ బండిని కొనక తప్పలేదు. రాఘవ పేరుతో బుల్లెట్ బండి కొనడానికి వీల్లేదు. ఎందుకంటే అతనికి ఇంకా 18 సంవత్సరాలు నిండలేదు. అందుకనే అతను తన పేరుతోనే బుల్లెట్ బండిని కొన్నాడు. రాఘవ బుల్లెట్ బండిని చూసి చాలా సంతోషించాడు. కొడుకు సంతోషాన్ని చూసి అన్నపూర్ణ రామచంద్రారావులు కూడా సంతోషించారు. రెండు రోజుల తర్వాత రాఘవ బుల్లెట్ బండి వేసుకొని తిరగడం మొదలుపెట్టాడు. బుల్లెట్

బండి చాలా బరువైనది, రాఘవ చాలా సన్నగా ఉంటాడు, బుల్లెట్ బండిలో అతని బరువు సగం కూడా ఉండదు. రాఘవ లాంటి వాళ్ళు దాని మీద తిరగడం చాలా ప్రమాదం, కానీ రాఘవ అది పట్టించుకోకుండా బుల్లెట్ బండి వేసుకొని తిరగడం మొదలుపెట్టాడు. అన్నపూర్ణ రామచంద్ర రావులు కొడుకు బుల్లెట్ బండి మీద తిరుగుతూ ఉంటే కొడుక్కు ఏం జరుగుతుందోనని ఎక్కడ ఆక్సిడెంట్ జరుగుతుందోనని ఆందోళన పడుతున్నారు. బండి వేసుకొని బయటకు వెళ్లిన రాఘవ తిరిగి ఇంటికి వచ్చేదాకా అన్నపూర్ణ చాలా ఆందోళనతో కొడుకు కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. అతను రాగానే అమ్మయ్య ఈరోజు ఏమి జరగలేదు కొడుకు క్షేమంగా ఇంటికి వచ్చాడని ఆమె సంతోష పడుతూ ఉంటుంది. రాఘవ తల్లిదండ్రుల ఆందోళన పట్టించుకోకుండా బండి మీద సంతోషంగా తిరుగుతున్నాడు.

డ్రైవింగ్ చేస్తున్న మైనర్ కుర్రవాళ్ళను పట్టుకోవడానికి పోలీసులు అప్పుడప్పుడు అక్కడక్కడ తనిఖీలు చేస్తున్నారు. బుల్లెట్ బండి నడుపుతూ రాఘవ పోలీసులకు దొరికిపోయాడు. మోటార్ సైకిల్ నడుపుతూ పోలీసులకు దొరకడం ఇది రెండవ సారి. పోలీసులు బండితో పాటు రాఘవను పోలీస్ స్టేషన్ కు తీసుకుని వెళ్ళి ఫోన్ చేసి అతని తల్లిదండ్రులను పిలిపించారు. రామచంద్ర రావు అన్నపూర్ణలు పోలీస్ స్టేషన్ కు చాలా ఆందోళనగా వెళ్ళారు. రాఘవ లాగా మోటార్ బైక్ నడుపుతూ రెండవ సారి పట్టుబడిన మైనర్ కుర్రవాళ్ళు చాలామంది అక్కడ ఉన్నారు. ఆ కుర్రవాళ్ళ తల్లిదండ్రులను కూడా పోలీసులు పిలిపించారు. వాళ్లందర్నీ పోలీస్ స్టేషన్ బయట నిలబెట్టి సి.ఐ వాళ్లకు క్లాస్ తీసుకున్నాడు.

"మీ కొడుకులు చట్ట విరుద్ధంగా బండి నడుపుతూ దొరికిపోవడం ఇది రెండవసారి, మొదటిసారి దొరికినప్పుడు జరిమానా వేసి హెచ్చరించి వదిలేశాం. చట్టం గురించి మీకందరికీ తెలుసు, 18 సంవత్సరాలు నిండని కుర్రాళ్ల గేర్ ఉన్న బండి నడపడానికి చట్టం అంగీకరించదు. ఈ విషయం తెలిసి కూడా మీరు మీ కొడుకులకు మోటార్ సైకిల్ ను ఇచ్చి రోడ్ల మీద వదిలేశారు. వీళ్ళు డ్రైవింగ్ రూల్స్ తెలియకుండా బండి నడుపుతున్నారు. వీరి వల్ల ఆక్సిడెంట్లు జరుగుతున్నాయి. వీళ్ళ కారణంగా అమాయకులు ఆక్సిడెంట్లకు

గుర్రై ఆసుపత్రుల పాలవుతున్నారు. కొంతమంది చనిపోతున్నారు. ఈమధ్య ఒక మైనర్ కుర్రవాడు తన తండ్రి బైక్ నడుపుతూ ఆక్సిడెంట్ చేసి ఒక అమ్మాయి మరణానికి కారకుడయ్యాడు. తండ్రి మీద కొడుకు మీద కేసు పెట్టాము, ఇద్దరూ జైల్లో ఉన్నారు. మిమ్మల్ని చివరిసారిగా హెచ్చరిస్తున్నాం. ఈసారి గనక మీ కొడుకులు బైక్ నడుపుతూ పట్టుపడితే మీ మీద మీ కొడుకుల మీద కేసు పెట్టి కోర్టులో హాజరు పరుస్తాం. దీన్ని గుర్తుంచుకొని జాగ్రత్తగా మసులుకోండి. మీ కొడుకులకు మీ మోటార్ సైకిళ్ళు ఇవ్వద్దు. వాళ్ళు అరిచి గీ పెట్టినా సరే ఏం చేసినా సరే మీ మోటార్ సైకిల్ ఇవ్వకండి. ఇస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి'' అని సీ.ఐ గట్టిగా హెచ్చరించి ఒక్కొక్కరికి **5000** రూపాయల జరిమానా విధించి వదిలిపెట్టాడు.

ఆ తర్వాత సీ.ఐ రామచంద్ర రావును అతని భార్యను రాఘవను పక్కకు పిలిచి వారితో చెప్పాడు. "రావు గారు మీరు బాధపడతారని అందరి ముందు చెప్పలేదు. మీ కొడుకు వయసెంత, అతని ఎత్తెంత, బరువెంత, బుల్లెట్ బండి బరువులో సగం కూడా లేడు మీ వాడు. అతనికి మీరు బుల్లెట్ బండి ఇచ్చి ఊర్లో బలాదూరుగా తిరగడానికి అవకాశం ఇచ్చారు. బుల్లెట్ బండి ఎలాంటిదో నేను మీకు చెప్పనక్కర్లేదు. దాని మీద పోతూ అతను ఎవరినైనా గుద్దినా, లేకపోతే ఆక్సిడెంట్ జరిగినా మీ కొడుకు మీకు దక్కుతాడా? ఆ మాత్రం తెలియకుండా మీరు మీ కొడుకు బుల్లెట్ బండి నడపడానికి ఎలా అనుమతిస్తున్నారు? నాకు చాలా కోపం వస్తావుంది. అయినా తమాయించుకొని మర్యాదగా మాట్లాడుతున్నాను. ఇంత బాధ్యతారహితంగా మీరు ఎలా ఉండగలుగుతున్నారు, ఇది మీకు భావ్యమేనా, ఇదే చివరిసారి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను, ఈసారి మీ అబ్బాయి దొరికితే మిమ్మల్ని మీ అబ్బాయిని తప్పనిసరిగా జైలుకు పంపిస్తాను, గుర్తుంచుకోండి'' అని సి ఐ రామచంద్రరావును తీవ్రంగా హెచ్చరించి, రాఘవ వైపు తిరిగి అతనికి గట్టిగా చీవాట్లు పెట్టాడు.

"ఏమయ్యా నీకు బుద్ధుందా? నీ వయసుకు, నీ ఎత్తుకు నీకు బుల్లెట్ బండి కావాలా? ఇంత సన్నగా ఉన్నావు, కాళ్ళు గూడా అందవు, ఎప్పుడైనా సడన్ బ్రేక్ వేస్తే నువ్వు బండిని కింద పడకుండా పట్టుకోగలవా, ఈ బండి మీద నుంచి కింద పడితే ఏం జరుగుతుందో ఎప్పుడైనా ఆలోచించావా,

ఇంకొకసారి బుల్లెట్ బండి వేసుకొని నాకు దొరికితే లాఠీతో కుల్లబొడుస్తాను. నీలాంటి పనికిమాలిన వాళ్ల వల్ల మీ తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ల చుట్టూ పోలీసులు చుట్టూ తిరగవలసి వస్తూ వుంది. ఇకనైనా మీ తల్లిదండ్రులు చెప్పినట్లుగా బుద్ధిగా మసులుకో, బాగా చదువుకో , పద్ధెనిమిది సంవత్సరాలు దాటేవరకు మళ్లీ మోటార్ బైకు తాకనే కూడదు జాగ్రత్త'' అని గట్టిగా చెప్పాడు.

అన్నపూర్ణ రామచంద్ర రావులు సీ.ఐ చెప్పింది విని అలాగే మీరు చెప్పినట్లుగా మా వాడికి ఇంక మోటార్ బైక్ ఇవ్వం, జాగ్రత్తగా ఉంటామని చెప్పి అక్కడి నుంచి వచ్చారు.

సీ.ఐ తిట్టిన తిట్లు హెచ్చరికలు రామచంద్ర రావు మీద అతని భార్య మీద కొడుకు మీద కొద్ది రోజుల వరకు బాగానే పని చేశాయి. రామచంద్ర రావు బుల్లెట్ బండిని అమ్మేశాడు. అతను రాఘవకు మోటర్ బైక్ ను తాకే అవకాశం కూడా ఇవ్వలేదు. రాఘవ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బుద్ధిగా ప్రతిరోజు సైకిల్ మీద స్కూలుకు వెళ్లి వస్తున్నాడు. కొడుకులో వచ్చిన మార్పుకు తల్లిదండ్రులు సంతోషించారు. అలా మూడు నెలలు గడిచాయి. ఆ మూడు నెలల పాటు రాఘవ మోటార్ బైక్ ను నడపకుండా చాలా కష్టంగా గడిపాడు. రామచంద్ర రావు తన వ్యాపారం పనుల్లో బిజీగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ కొడుక్కు మోటార్ బైక్ తాళంచెవి ఇవ్వవద్దని భార్యకు గట్టిగా చెప్పాడు. ఆమె కూడా రాఘవకు మోటార్ బైకు తాళం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉంటూ ఉంది.

మూడు నెలలు గడిచేటప్పటికీ సీ.ఐ తిట్టిన తిట్లు హెచ్చరికలు పాతబడిపోయాయి. రాఘవ తల్లిని బ్రతిమాలుతూ దగ్గర ప్రదేశాలకు 150 సీ.సి బైక్ మీద వెళ్లి వస్తున్నాడు. అన్నపూర్ణ రాఘవకు బైకు తాళం చెవి ఇవ్వడం లేదని భర్తకు అబద్ధాలు చెబుతూ వచ్చింది. అలా రాఘవ 9వ తరగతి పూర్తి చేశాడు. 10వ తరగతికి వచ్చాడు. అతనికి 15 సంవత్సరాలు పూర్తి అయ్యాయి.

పదవ తరగతికి వచ్చిన తర్వాత రాఘవ తండ్రిని బ్రతిమాలి బైకును నడపడం మొదలుపెట్టాడు. మొదట్లో తల్లిదండ్రుల మాటలను పాటించి జాగ్రత్తగా నిదానంగా బైకు నడిపేవాడు. కానీ అలా నిదానంగా నడపడం అతనికి ఏ మాత్రం నచ్చలేదు. కొద్దిరోజుల తర్వాత తన సహజ ధోరణిలో

బైక్ ను వేగంగా నడపడం ప్రారంభించాడు. తనతో పాటు పదవ తరగతి చదువుకున్న మిత్రులను కూడా బండి మీద కూర్చోబెట్టుకొని తిప్పడం మొదలుపెట్టాడు. అలా తిరుగుతూ రాఘవ మూడోసారి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈసారి పోలీసులు రామచంద్రరావు మీద రాఘవ మీద కేసు పెట్టి కోర్టుకు పంపించారు. కోర్టు చట్ట విరుద్ధంగా మోటార్ బైకును నడిపినందుకు రాఘవకు ఇరవై వేల రూపాయల జరిమానా విధించింది. మైనర్ గా ఉన్న కొడుక్కు బండిని ఇచ్చినందుకు రామచంద్రరావును నెలరోజుల పాటు కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. రామచంద్రరావు ఇరువై వేల రూపాయల జరిమానా కట్టి నెలరోజుల పాటు కోర్టు హాజరయ్యాడు. ఈ విధంగా కొడుకు చేసిన నేరానికి రామచంద్రరావు శిక్ష అనుభవించవలసి వచ్చింది. రామచంద్ర రావే కాదు చాలామంది తండ్రులు కొడుకులు చేసిన ఈ నేరానికి భారీగా జరిమానా కట్టి నెలరోజులు పాటు కోర్టుకు హాజరైన శిక్షను అనుభవించారు.

రామచంద్రరావు ఆఫీసుకు కారులో వెళ్లేవాడు. ఇంటిదగ్గర బైకు ఉండేది. పై సంఘటన జరిగినప్పటి నుంచి రామచంద్రరావు బైకు మీద ఆఫీసుకు వెళ్తున్నాడు. రాఘవకు బైకు నడిపే అవకాశం ఇవ్వకుండా అతను కట్టుదిట్టంగా చర్యలు తీసుకున్నాడు. రాఘవ బుద్ధిగా సైకిల్ మీద స్కూలుకు వెళ్లి వస్తున్నాడు. అలా మూడు నెలలు గడిచాయి. రాఘవ మోటార్ సైకిల్ నడపకుండా ఉండలేకపోయాడు. మోటర్ బైక్ కావాలని తండ్రిని బతిమాలాడు, కానీ రామచంద్రరావు అతనికి బండిని ఇవ్వలేదు. దానితో రాఘవ కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని తల్లిదండ్రులు ఆందోళన చెంది అన్నిచోట్ల వెతికించారు. కొడుకు ఏమైపోయాడో అని అన్నపూర్ణమ్మ రెండు రోజులపాటు ఆహారం నీళ్లు ముట్టకుండా భయపడిపోయింది. రామచంద్ర రావు కూడా చాలా భయపడ్డాడు. మూడు రోజుల తర్వాత రాఘవ బట్టలు మాసిపోయి నీరసంతో ఇంటికి వచ్చాడు. మూడు రోజులపాటు ఎక్కడెక్కడో తిరిగాడు. సరైన తిండి లేదు, నీళ్లు లేవు, నిద్ర లేదు. అతనికి ఇంటి విలువ తల్లిదండ్రుల విలువ పూర్తిగా తెలిసి వచ్చి ఇంటికి తిరిగి వచ్చాడు. కొడుకు ఇంటికి వచ్చినందుకు అన్నపూర్ణ చాలా సంతోషించింది. కొడుకును పట్టుకొని చాలాసేపు దుఃఖించింది. రామచంద్రారావు కూడా ఆనందపడ్డాడు.

కానీ అసలు సమస్య తీరలేదు. కొడుకు మోటార్ బైకు కావాలంటాడు, పోలీసులకు దొరికితే ఈసారి ఎలాంటి లాంటి శిక్ష వేస్తారో అని రామచంద్రా రావు భయపడుతున్నాడు. ఏం చేయాలో అతనికి అర్థం కాలేదు, దీనికంతటికి మూల కారణం తామేనని అతడు గ్రహించాడు. కొడుకును చిన్నప్పటి నుంచి అతి గారాబంగా విలాసవంతంగా అల్లారుముద్దుగా పెంచి అతను అడిగినవన్నీ కొనిచ్చి ఈ స్థితికి తీసుకొచ్చామని అతను తెలుసుకున్నాడు. చిన్నప్పటి నుంచి తానే కొడుకును మోటర్ బైక్ మీద తిప్పి అతనికి బైక్ మీద పిచ్చి ప్రేమ ఏర్పడే లాగా చేశాడు. మైనారిటీ తీరకుండానే అతనికి మోటర్ బైక్ నడపటం నేర్పించడం తాను చేసిన నేరంగా అతను గ్రహించాడు. బాల్యం నుంచి కొడుకుకు మంచి చెడ్డలు చెప్పి, అతనికి అతని హద్దులు తెలియజేసి, సత్ప్రవర్తన కలిగిన వాడుగా తాము అతన్ని పెంచి ఉండాలి. కానీ లేక లేక కలిగిన కొడుకు కావడం చేత అతి ప్రేమతో అతి గారాబంగా పెంచి కొడుకును తామే పాడు చేశామని అతను గ్రహించాడు. అదే విషయాన్ని భార్యకు కూడా చెప్పాడు. ఆమె కూడా తమ తప్పు తెలుసుకుంది.

రామచంద్ర రావు భార్యను కొడుకును కూర్చోబెట్టి రాఘువకు హితబోధ చేశాడు. “నాన్నా రాఘువా, నువ్వు మాకు లేక లేక కలిగిన ఒక్కగానొక్క కుమారునివి, మా ఆశలన్నీ నీ మీదనే ఉన్నాయి. ఏకైక కుమారునివి కాబట్టి నువ్వు అడిగినవన్నీ తెచ్చిపెట్టాం, ఎంతో గారాబంగా అపురూపంగా పెంచుకున్నాం. దానితో నువ్వు కొంచెం పెంకిగా మారావు, నువ్వు అడిగింది తెచ్చి ఇవ్వకపోతే చాలా గొడవ చేసేవాడివి, మారాం చేసే వాడివి, అందుకని మేము నువ్వు ఏదడిగినా కాదనకుండా తెచ్చి పెట్టాం, అప్పుడు నువ్వు చిన్న వాడివి, ఏది మంచి ఏది చెడు తెలియని వయస్సు, కానీ ఇప్పుడు నువ్వు పెరిగి పెద్దవాడివయ్యావు. మంచి చెడు నీకు తెలుసు. చిన్నప్పుడు నిన్ను మోటర్ బైక్ మీద బాగా తిప్పేవాన్ని . దానివల్ల నీకు బైక్ మీద ఎక్కువ ఇష్టం ఏర్పడింది. కానీ 18 సంవత్సరాలు నిండే వరకు మోటర్ బైకు నడపకూడదు. అది మన చట్టం, మన చట్టాన్ని మనం గౌరవించాలి, గౌరవించకపోతే మనకు చాలా సమస్యలు వస్తాయి. ఇప్పటికే మూడుసార్లు పోలీసులకు పట్టుబడ్డావు. నాలుగో సారి పట్టుపడితే నీకు నాకు పోలీసులు ఏ శిక్ష వేస్తారో తలుచుకుంటేనే భయంగా ఉంది. నీ వల్ల మీ తల్లిదండ్రులు భయపడుతూ బతకడం నీకు మంచిదా?

నువ్వు మళ్ళీ బైక్ నడిపి నీకు జైలు శిక్ష పడితే నీ భవిష్యత్తు చాలా సమస్యల్లో పడుతుంది. అంతవరకు తెచ్చుకోవద్దు. అంతే కాకుండా నువ్వు ఇంకా చిన్న పిల్లవాడివి. బైక్ ను నడిపేటప్పుడు అకస్మాత్తుగా ఏదైనా జంతువు గానీ మనుషులు గానీ అడ్డం వస్తే నువ్వు బైక్ ను అదుపు చేసుకోలేవు. బండితో పాటు కింద పడిపోతావు. ఇంతకు ముందు ఒకసారి జరిగింది. దెబ్బలు తగిలి ఇరవై రోజులపాటు ఆసుపత్రిలో ఉన్నావు. ఇక మళ్లీ అలాంటిది జరిగితే తట్టుకునే శక్తి మాకు లేదు. దయచేసి నా మాట విని నీకు 18 సంవత్సరాలు పూర్తి అయ్యేవరకు నువ్వు బైక్ నడపవద్దు. స్కూలుకు ఆటోలో వెళ్ళు, లేకపోతే నేనే ప్రతిరోజు వచ్చి నిన్ను దింపి మళ్లీ స్కూల్ నుంచి తీసుకొని వస్తాను. అంతేగాని ఎట్టి పరిస్థితుల్లోనూ మోటర్ బైక్ నడపవద్దు'' అని చాలా బాధపడుతూ చెప్పాడు. అన్నపూర్ణ కూడా చాలా బాధపడుతూ కొడుకును పట్టుకొని ఏడుస్తూ "నాన్నగారు చెప్పినట్లుగా నడుచుకో నాయనా, మమ్మల్ని ఇంకా బాధ పెట్టొద్దు'' అని చెప్పింది.

తల్లిదండ్రుల వేదనాపూర్వకమైన మాటలు విన్న తర్వాత తన కారణంగా తల్లిదండ్రులు ఎంత బాధ పడుతున్నారో రాఘవ అర్థం చేసుకున్నాడు. ఇంక ఎప్పుడూ వారిని బాధపెట్టకూడదని వారు చెప్పినట్లుగా నడుచుకోవాలని అతను నిర్ణయించుకొని తండ్రితో "అలాగే నాన్నగారూ, మీరు చెప్పినట్లుగా ఇంక నేను బైకు నడపను, రోజూ సైకిల్ మీదనే స్కూల్ కి వెళ్లి వస్తాను. కానీ నాకు బైక్ మీద ఉన్న పిచ్చి వల్ల ఎప్పుడైనా ఒకసారి బైక్ నడపాలని కోరిక కలుగవచ్చు, మీకు తెలియకుండా నేను బైకు తీసుకొని వెళ్ళవచ్చు, అందువల్ల బైక్ మన దగ్గర ఉండగూడదు, మీరు బైక్ ను అమ్మేయండి. మన ఇంట్లో బైక్ లేకపోతే నాకు బైక్ మీదకు మనసు పోయే అవకాశం ఉండదు. మీకు ఎలాగూ కారు ఉంది కాబట్టి బైకు లేకపోయినా పర్వాలేదు'' అని చెప్పాడు.

రాఘవ మాటలకు రామచంద్ర రావు చాలా సంతోషించాడు. నిజానికి అతనికి కూడా తన మోటార్ సైకిల్ ను అమ్మాలనే ఆలోచన వచ్చింది. కానీ కొడుకు బాధపడతాడని ఆ మాట చెప్పలేదు. రాఘవే ఆ మాట చెప్పడంతో రాఘవలో మంచి మార్పు వచ్చిందని ఆయన చాలా సంతోషించాడు. రాఘవ చెప్పినట్లుగా బైకును అమ్మేశాడు. దానితో సమస్య తీరిపోయింది.



ధరణి - నవలిక, ఇంకో ఐదు కథలు

ఆచార్య మర్రెబోయిన జయదేవ్
డి.లిట్.

మీరు చెప్పారు కాబట్టి మీరు చెప్పినట్లుగా నాకు నచ్చిన వ్యక్తిని, నన్ను అర్థం చేసుకున్న వ్యక్తిని పెళ్లి చేసుకుంటాను. నాకు నచ్చిన వ్యక్తి మీరే, మీకంటే నన్ను బాగా అర్థం చేసుకున్న వ్యక్తులు ఎవరూ లేరు. కాబట్టి మనిద్దరం పెళ్లి చేసుకుందాం. మీరూ ఒంటరిగా ఉన్నారు. ఇంకా చాలా కాలం జీవించవలసి ఉంది, మా చెల్లెలు కమల చనిపోయిన తర్వాత మీరు ఒంటరిగా భారంగా గడుపుతున్నారని మీ మాటల వల్ల నాకు తెలుస్తూనే ఉంది. కాబట్టి మాస్టారు, మనిద్దరం పెళ్లి చేసుకుని మన ఒంటరి జీవితానికి స్వస్తి పలుకుదాం. కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం. - ధరణి

సిగరెట్లు బీడీలు కాల్చేవాళ్ళు వాటితోపాటు తమ ఆరోగ్యాన్ని కూడా కాల్చు కుంటున్నారు. కాల్చని వాళ్లు కాల్చే వాళ్లు వదిలిపెట్టే పొగ పీలుస్తూ తమకు తెలియకుండానే ఆరోగ్యాన్ని తగలెట్టుకుంటున్నారు. - తాగుబోతులు

మీ జేబు కొట్టేసింది నేనే, బస్సులో మీరు నిలబడిన తర్వాత మీ మీద పడి డబ్బులు కొట్టేసాను. కానీ మీ అమాయకత్వం మీ మంచితనం చూసిన తర్వాత మీకు సాయం చేయాలనిపించింది. - దొంగ

నీకు ఎనవై యేండ్లు వచ్చండాయ్, కాటికి కాళ్ళు సాపిన ఈ వయసులో బడికి వోయి సదువు కుంటావా? నీకేమన్నా తిక్క వట్టిందా, ఏం మాట్లాడతండావమ్మా, నువ్విప్పుడు సదువుకొని ఏం జేచ్చావు? ఈ వయసులో పలక బలపం పట్టుకొని బడికి వోతంటే అందరు నగుతారమ్మా - తాతమ్మ చదువు

నీ బిడ్డను నేను మన నగరంలో మొదట మగరాయుని మాదిరిగా ధైర్యంగా ఆటో నడుపుతూ ఉంటే చూసి నువ్వు గర్వపడాల గానీ చిన్నతనంగా భావించకూడదు నాన్నా. సమస్యలు అన్ని చోట్లా ఉంటాయి. సమస్యలు వస్తాయని భయపడితే మనం ఏ పని చేయలేం. వాటిని ఎదుర్కొని ముందుకు పోవాలి - ఆటో పార్వతి

ఏమయ్యా నీకు బుద్ధుందా? నీ వయసుకు, నీ ఎత్తుకు నీకు బుల్లెట్ బండి కావాలా? ఇంత సన్నగా ఉన్నావు, కాళ్ళు గూడా అందవు, ఎప్పుడైనా సడన్ బ్రేక్ వేస్తే నువ్వు బండిని కింద పడకుండా పట్టుకోగలవా, ఈ బండి మీద నుంచి కింద పడితే ఏం జరుగుతుందో ఎప్పుడైనా ఆలోచించావా - అతి గారాబం